సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 150

మంగళవారం 14-2-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'




సతీ భూదేవి

పరాయి దేశంలో శిక్ష అనుభవిస్తున్న భర్త కోసం పోరాడిన ఓ మహిళ - 11లో



కొనసాగిన నష్టాలు

సెన్సెక్స్ నష్టం 251 పాయింట్లు 17,800 దిగువకు నిఫ్టీ - 13లో



తొలివిడతకు తెర

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి విడత ముగిసింది. ఉభయసభల రెండో విడత సమావేశాలు మార్చి 13 నుంచి ప్రారంభమవుతాయి.

వివరాలు 6లో ▸



చైనా దుందుడుకు చర్య

దక్షిణ చైనా సముద్రంలో ఫిలిప్పీన్స్ కోస్ట్‌గార్డ్ ఓడపైకి చైనా కోస్ట్‌గార్డ్ షిప్ మిలటరీ గ్రేడ్ లేజర్ కిరణాలను ప్రయోగించింది.

వివరాలు 6లో ▸



మృతులు 35,000 పైమాటే

తుర్కియే, సిరియాలో సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 35,000 పైగా ఉంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి.

వివరాలు 6లో ▸



రష్యా నుంచి తక్షణమే వచ్చేయండి

రష్యాలో నివాసం ఉంటున్న లేదా రష్యాకు ప్రయాణం చేస్తున్నా.. తక్షణమే వెనక్కి వచ్చేయాలని అమెరికా తమ పౌరులను కోరింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీకాళహస్తిలో ఈ నెల 25 వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు సోమవారం భక్తకన్నప్ప ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలంకార మండపంలో భక్త కన్నప్ప ఉత్సవ మూర్తితో పాటు స్వామి, అమ్మవార్లను అలంకరించి కొండపైకి తీసుకెళ్లారు.

వివరాలు 10 ▸

కాకినాడలో మదర్ మిల్క్ బ్యాంకు ప్రారంభం



రాష్ట్రంలోనే తొలిసారి కాకినాడ జీజీహెచ్‌లో తల్లి పాల బ్యాంకు ఏర్పాటైంది. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ధాత్రి లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్ పేరుతో సుశేష్, ఎస్‌సీసీతో పాటు ఇతర దాతలు, స్వచ్ఛంద సంస్థల సీఎస్ఆర్ నిధులతో రూ.50 లక్షలు వెచ్చించి దీనిని ఏర్పాటు చేశారు.

వివరాలు 2 ▸

కడప స్టీల్ ప్లాంట్ పనులకు రేపు భూమి పూజ



రాయలసీమ వాసుల చిరకాల స్వప్నాన్ని నెరవేరుస్తూ రూ. 8,800 కోట్లతో 30 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యు గ్రూపు వైఎస్సార్ కడప జిల్లా సున్నపురాళ్లపల్లెలో ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు.

వివరాలు 2 ▸





ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, ప్రాంతీయ సమన్వయకర్తలతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సైన్యం సన్నద్ధం!

మార్చి 18-26 వరకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహణ


ప్రతి గడపకూ సచివాలయాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, గృహ సారథులు

- 1.65 కోట్ల గృహాలను సందర్శించేలా 5.65 లక్షల మందికి శిక్షణ.. 387 మండలాల్లో తొలి బ్యాచ్‌కి ఇప్పటికే పూర్తి.. నేటి నుంచి రెండో బ్యాచ్‌కు..
- గత సర్కార్ కన్నా 45 నెలలుగా అందించిన మెరుగైన పాలనను వివరించాలి
- రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ తెలియ చేయాలి.. గృహాల సందర్శనకు వలంటీర్ల సహకారాన్ని కూడా తీసుకోవాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలకు సీఎం జగన్ దిశానిర్దేశం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహణపై సమీక్ష
- కొంత మంది వెనుకబడ్డారు.. వారిలో స్పీడ్ పెరగాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత 45 నెలలుగా అందిస్తున్న మెరుగైన పాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి గడపకూ విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల సమన్వయ కర్తలు, ప్రాంతీయ సమన్వయకర్తలకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మార్చి 18వతేదీ నుంచి 26 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. 'జగనన్నే మా భవిష్యత్తు' ద్వారా సచివాలయాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహ సారథులు గడప గడపకూ వెళ్లాలని నిర్దేశించారు. సచివాలయాల పార్టీ కన్వీనర్లు, గృహ సారథులతో కూడిన 5.65 లక్షల మంది వైఎస్సార్ సీపీ సైన్యం క్షేత్రస్థాయిలో సిద్ధమైందన్నారు. ఈ సైన్యం 1.65 కోట్ల గృహాలను సందర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి

మిగతా 3వ పేజీలో ▶

విద్య, ఇంధన రంగాలపై ఆస్ట్రేలియా ఆసక్తి 2లో



సోమవారం బెంగళూరులోని యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కాంప్లెక్స్‌లో జరిగిన వైమానిక ప్రదర్శనలో విన్యాసాలు చేస్తున్న సూర్యకిరణ్ యుద్ధవిమానాలు..

ఆసక్తిగా తిలకిస్తున్న ప్రధాని మోదీ

75 దేశాలకు.. రక్షణ పరికరాలు

5 బిలియన్ డాలర్లు ఎగుమతుల లక్ష్యం

100 దేశాలు రక్షణ మంత్రుల హాజరు

75,000 కోట్లు పెట్టుబడులు

250 ఒప్పందాలు

(ఐదు రోజుల పాటు జరిగే 'ఏరో ఇండియా'లో ఈ మేరకు ఒప్పందాలు కుదురుతాయని, దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని అంచనా)

రక్షణ రంగంలో మేటిగా భారత్

ఉత్పత్తుల తయారీలో అగ్రగామిగా ఎదుగుతున్నాం

బెంగళూరు ఏరో-ఇండియా షోలో ప్రధాని మోదీ

6లో

స్మృతి సూపర్ హిట్

డబ్ల్యూపీఎల్ వేలంలో భారత వైస్ కెప్టెన్‌కు అత్యధిక మొత్తం

12లో

బీసీసీఐ మొదటిసారి నిర్వహించబోతున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మొదటి అంకమైన ప్లేయర్ల వేలం ఘనంగా ముగిసింది. మొత్తం 448 మంది వేలంలోకి రాగా... ఐదు జట్లలోకి కలిపి మొత్తం 87 మంది ఎంపికయ్యారు. వేలంలో ఎక్కువ మొత్తం పలికిన టాప్-10 జాబితాలో భారత్ నుంచి స్మృతి మంధానతో పాటు మరో ఐదుగురు ఉన్నారు. వేలం బరిలో 448 ప్లేయర్లు నిలవగా, 87 మంది అమ్ముడయ్యారు. వీరిలో 57 మంది భారత క్రికెటర్లు. స్మృతి మంధానకు అత్యధిక మొత్తం దక్కింది. ఏపీ నుంచి అంజలి శర్వాణి, సబ్బినేని మేఘన, వి.స్నేహ దీప్తి, షబ్నమ్‌లకు డబ్ల్యూపీఎల్‌లో అవకాశం దక్కింది.



స్మృతి మంధాన
రూ. 3.40 కోట్లు
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు



ఆష్లే గార్డ్‌నర్
రూ. 3.20 కోట్లు
గుజరాత్ జెయింట్స్



నటాలీ సీవర్
రూ. 3.20 కోట్లు
ముంబై ఇండియన్స్



దీప్తి శర్మ
రూ. 2.60 కోట్లు
యూపీ వారియర్స్



జెమిమా రోడ్రిగ్స్
రూ. 2.20 కోట్లు
ఢిల్లీ క్యాపిటల్స్



ఎన్‌సీడీ-సీడీ సర్వే 74.45 శాతం పూర్తి

- రాష్ట్రంలో దీర్ఘకాలిక వ్యాధులు ప్రాథమిక దశలోనే గుర్తింపు
- ప్రజలందరినీ స్క్రీనింగ్ చేస్తున్న ఏఎన్ఎంలు.. 4.69 కోట్ల మందిలో 74.45% మందికి స్క్రీనింగ్
- వైద్యుల పర్యవేక్షణలోకి బాధితులు

- వివరాలు 2లో

కోవిడ్ తర్వాత డిజిటల్ లావాదేవీలు పెరిగాయి

ఆర్‌బీఐ జీఎం అంజనీ మిశ్రా

సాక్షి, అమరావతి: కోవిడ్ తర్వాత దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలు పెరిగాయని, దీనికి అనుగుణంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వీటిపై మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం (ఏపీ ఇన్‌చార్జి) అంజనీ మిశ్రా పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెంచడానికి 'మంచి ఆర్థిక ప్రవర్తనే - మీ రక్షకుడు' అనే పేరుతో ఆర్‌బీఐ సోమవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడలో మిశ్రా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు పొదుపు చేయడం, బడ్జెట్ ప్రణాళిక రూపొందించుకోవడంతోపాటు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తామని



ఆర్‌బీఐ ముద్రించిన పోస్టర్లను విడుదల చేస్తున్న మిశ్రా తదితరులు

మిగతా 2వ పేజీలో ▶

ముందే మొదలైన వేసవి

ఫిబ్రవరి రెండో వారంలోనే సర్రుమంటున్న ఎండ

- రెండు రోజుల నుంచి రాష్ట్రంలో 2-3 డిగ్రీల మేర పెరిగిన ఉష్ణోగ్రతలు
- నంద్యాలలో 38 డిగ్రీలు, వరదాయిపాలెంలో 37.9 డిగ్రీలు
- పలు ప్రాంతాల్లో 36 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- ఇవి సాధారణంగా మార్చిలో నమోదయ్యేవి
- ముందస్తు ఎండలతో ఏప్రిల్ చివరికి వేసవి తీవ్రత తగ్గే అవకాశం
- ఈ ఏడాదీ రాష్ట్ర వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు

14లో



ఆకాశంలో సగమైనా.. నాగాలాండ్‌లో మాత్రం శూన్యం 6లో



నువ్వున్నావ్‌గా! ఇల్లు ఊడ్చడానికి, వంట చేయడానికి, బట్టలు ఉతకడానికి.. పనిమనుషుల్ని పెట్టుకుంటే నా జీతం కూడా సరిపోదు

మణిహారంలో కలికితురాయి

పోలవరం జలాశయంతోపాటే 960 మెగావాట్ల జలవిద్యుత్కేంద్రం పనులను వేగవంతం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- ఇప్పటికే కొండను తొలవడం, 12 ప్రెజర్ టన్నెళ్ల తవ్వకం పనులు పూర్తి.. ఫెరోల్స్ అమర్చి లైనింగ్ పనులు చేపట్టిన మేఘా సంస్థ
- వర్టికల్ కెప్లాన్ టర్బైన్ల పునాది పనులు దాదాపుగా పూర్తి.. భోపాల్ బీహెచ్ఈఎల్‌లో టర్బైన్ల తయారీ.. ఆసియాలోనే ఇవి అతి పెద్దవి
- గోదావరి బేసిన్‌లో అతి పెద్ద జలవిద్యుత్కేంద్రం ఇదే
- రాష్ట్ర విద్యుత్ ముఖచిత్రంలో సమూల మార్పు ఖాయమంటున్న నిపుణులు.. పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేస్తుందని వెల్లడి
- రివర్స్ టెండర్లతో గత సర్కారు అక్రమాలకు తెర దించిన ప్రభుత్వం.. జలవిద్యుత్కేంద్రం పనుల్లో రూ.405.23 కోట్లు ఖజానాకు ఆదా
- చంద్రబాబు అక్రమాలను బట్టబయలు చేసిన పోలవరం జలవిద్యుత్కేంద్రం టెండర్



పోలవరం జల విద్యుత్కేంద్రంలో పూర్తయిన ప్రెజర్ టన్నెళ్లు (దిగువ భాగాన).



ప్రెజర్ టన్నెళ్లలో పూర్తయిన ఫెరోల్స్ అమరిక, లైనింగ్

పోలవరం జలవిద్యుత్కేంద్రం నుంచి సాక్షి 'ప్రత్యేక' ప్రతినిధి రామగోపాలరెడ్డి ఆలమూరు: గోదారమ్మ మణిహారంలో మరో కలికితురాయి ఒదగనుంది. పోలవరం జాతీయ బహుళార్థక సాధక ప్రాజెక్టులో అంతర్భాగంగా 960 మెగావాట్ల సామర్థ్యంతో చేపట్టిన జలవిద్యుత్కేంద్రం నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. గోదావరి పరీవాహక ప్రాంతంలోని జలవిద్యుత్కేంద్రాలలో ఇదే అతి పెద్దది కావడం గమనార్హం. జలాశయం పనులు పూర్తయ్యేలోగా జలవిద్యుత్కేంద్రం పనులనూ పూర్తి చేయాలని నిర్ణయించింది. పోలవరం జలవిద్యుత్కేంద్రం పూర్తయితే రాష్ట్ర విద్యుత్ ముఖచిత్రంలో సమూల మార్పులు చోటు చేసుకుంటాయని విద్యుత్ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేస్తుందని స్పష్టం చేస్తున్నారు. పోలవరం ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్-1కి

మిగతా 2వ పేజీలో ▶

జలవిద్యుదుత్పత్తి ఇలా..

- పోలవరం ప్రాజెక్టు ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1 ఎడమ వైపు నుంచి 206 మీటర్ల పొడవున, 294 మీటర్ల వెడల్పుతో జలవిద్యుత్కేంద్రం ప్రెజర్ టన్నెళ్ల వైపు అప్రోచ్ ఛానల్ తవ్వుతారు.
- ప్రెజర్ టన్నెళ్లకు అమర్చే గేట్లను ఎత్తినప్పుడు అధిక ఒత్తిడితో నీరు ప్రవహించి 27 మీటర్ల ఎత్తు నుంచి టర్బైన్లపై పడతుంది. టర్బైన్లు వేగంగా తిరగడం వల్ల విద్యుత్ ఉత్పత్తవుతుంది.
- టర్బైన్ల నుంచి దిగువకు వచ్చిన నీటిని టెయిల్ రేస్ ఛానల్ ద్వారా ఈసీఆర్ఎఫ్‌కు దిగువన నదిలోకి కలుపుతారు.
- ఈ టన్నెళ్లకు చివర తక్కువ వ్యాసంతో ఇనుప పైపులను తొడిగి భూ ఉపరితలానికి ఆరు మీటర్ల దిగువన వర్టికల్ కెప్లాన్ టర్బైన్లను ఏర్పాటు చేస్తారు.

క్లుప్తంగా...

సీఎంను కలిసిన శెట్టి బలిజ సంఘం నేత కుడిపూడి



సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌ను అమలాపురానికి చెందిన శెట్టి బలిజ సంఘం రాష్ట్ర నేత కుడిపూడి సూర్యనారాయణరావు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

వ్యవసాయంలో యాంత్రీకరణకు పెద్దపీట

- 'ఈనాడు' కథనంలో ఆరోపణలన్నీ అవాస్తవాలే
- వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్



సాక్షి, అమరావతి: 'వ్యవసాయ యాంత్రీకరణ ఎండమావే' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురించిన కథనంలో ఎలాంటి వాస్తవాలు లేవని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ఇప్పటివరకు 6,525 ఆర్బీకేల పరిధిలో రూ.588 కోట్ల విలువైన యంత్ర పరికరాలతో పాటు వరి ఎక్కువగా సాగయ్యే ప్రాంతాల్లో రూ.103 కోట్లతో 391 క్లస్టర్ స్థాయి యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. రైతు గ్రూపుల ద్వారా ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన రైతు సంఘాలకు రూ.15 లక్షల విలువైన యంత్ర పరికరాలతో గ్రామ స్థాయిలో యంత్ర సేవా కేంద్రాల ఏర్పాటు చేశామన్నారు. యంత్రాల ద్వారా పంటకోతను ప్రోత్సహించేందుకు వరి పండించే ప్రాంతాల్లో రూ.25 లక్షల విలువైన కంబైన్డ్ హార్వెస్టర్స్‌తో కూడిన క్లస్టర్ స్థాయి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

రూ.634 కోట్లతో యంత్ర సేవా కేంద్రాలు

ఆర్బీకే స్థాయి కేంద్రాల కోసం 40 శాతం రాయితీ కింద రూ.240.67 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా రైతు సంఘాల ఖాతాల్లో జమ చేసిందని హరికిరణ్ వివరించారు. మిగిలిన 4,225 ఆర్బీకేల పరిధిలో రూ.634 కోట్లతో యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటి ఏర్పాటు కోసం రూ.254 కోట్ల రాయితీ నిధులు కూడా ప్రభుత్వం కేటాయించిందన్నారు. రైతుల అభ్యర్థన మేరకు 7 లక్షల సన్న, చిన్నకారు రైతులకు రూ.910 కోట్ల విలువైన స్ప్రేయర్లు, టార్పాలిన్లు రాయితీపై 2023 ఖరీఫ్ సీజన్‌లోగా అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇందులో రూ.455 కోట్లు రాయితీ రూపంలో ప్రభుత్వం భరిస్తోందన్నారు. రూ.200 కోట్లతో 2వేల కిసాన్ డ్రోన్ సీహెచ్‌సీలను ఏర్పాటు చేస్తున్నామని, రూ.80 కోట్లను రాయితీగా అందిస్తోందన్నారు. 2014–15 నుంచి 2018–19 మధ్య 3,584 సీహెచ్‌సీల ఏర్పాటుకు రూ.239.16 కోట్లు రాయితీని విడుదల చేస్తే.. మూడున్నరేళ్లలో 6,916 సీహెచ్‌సీల ఏర్పాటుకు రూ.140.67 కోట్ల రాయితీని ఈ ప్రభుత్వం అందించిందన్నారు. 2014–15 నుంచి 2018–19 వరకు 3.24 లక్షల రైతులకు వ్యక్తిగత కేటగిరి కింద యంత్ర పరికరాలను రాయితీపై అందించగా.. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో 7 లక్షల మందికి స్ప్రేయర్లు, టార్పాలిన్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.

సాధికారతకు చిరునామా.. మహిళా ప్రాంగణం

రాష్ట్రంలో 13 కేంద్రాలతో 26 జిల్లాల్లో మంచి ఫలితాలు

- విద్యార్థినులకు ఉపాధి, ఉద్యోగినులకు నైపుణ్యాభివృద్ధి
- గత రెండేళ్లలో 86 వేలమందికి ప్రత్యేక శిక్షణ



ఫ్యాషన్ డిజైనింగ్‌పై శిక్షణ



నిమ్మకూరులోని ఎన్టీఆర్ మహిళా ప్రాంగణం

ఎన్టీఆర్ స్వగ్రామమైన కృష్ణాజిల్లా నిమ్మకూరులోని నందమూరి తారకరామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం) అక్కడికి అడుగుపెట్టే అతివకు ఆత్మవిశ్వాసం అందిస్తోంది. దాదాపు 7.66 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏకకాలంలో 250 మంది శిక్షణ పొందే హాలు, హాస్టల్, డైనింగ్ వంటి సౌకర్యాలతో సేవలు అందిస్తోంది. గతంలో నిర్లక్ష్యానికి గురై, ఆపై కరోనా సమయంలోను అంతగా సేవలందించలేకపోయిన ఈ ప్రాంగణంపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహించడంతో గురుతర పాత్ర పోషిస్తోంది. ఏడాది కాలంలో మహిళా శిశు సంక్షేమశాఖ అంగన్‌వాడీ కార్యకర్తలకు, వైద్య ఆరోగ్యశాఖ ఆశా వర్కర్లకు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రీప్రైమరీ, కంప్యూటర్ ఆపరేటర్, అసిస్టెంట్ ఫ్యాషన్ డిజైనరీ, బ్యూటీషియన్ కోర్సుల్లో విద్యార్థినులకు శిక్షణ ఇవ్వడం విశేషం. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రింటింగ్ యూనిట్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన రిజిస్టర్లు, రశీదులు, విద్యార్థులకు నోట్ పుస్తకాలతోపాటు పోలింగ్ కోసం బ్యాలెట్ పేపర్లు సైతం ముద్రించడం విశేషం. ఇదే ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలకు స్వధార్ గృహాన్ని నిర్వహిస్తున్నాం.

– వి.శ్రీలక్ష్మి, జిల్లా మేనేజర్

సాక్షి, అమరావతి: నిమ్మకూరులోని మహిళా ప్రాంగణం గురించి జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి సాక్షి ప్రతినిధికి తెలిపినట్లు.. రాష్ట్రంలో 13 నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రాలు 26 జిల్లాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగినులకు విశేషసేవలు అందిస్తున్నాయి. పట్టణ, గ్రామీణ మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపి సాధికారత సాధించేలా అవసరమైన ఉపాధి, వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నాయి. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా శిక్షణ కార్యాక్రమాల ద్వారా అవగాహన పెంచుతున్నాయి. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలతో భారీస్థాయిలో ఉపాధి ఆధారిత కార్యకలాపాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలో మహిళల ఆర్థికాభ్యున్నతి కోసం కృషిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి.

ప్రతి ప్రాంగణంలో సదుపాయాలు

రాష్ట్రంలోని ప్రతి మహిళా ప్రాంగణం (శిక్షణా కేంద్రం) ఒక జిల్లా మేనేజర్ పర్యవేక్షణలో సమర్థంగా పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒక్కో ప్రాంగణం సుమారు 8 నుంచి 10 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రతి ప్రాంగణంలో 200 నుంచి 250 మందికి ఒకేసారి శిక్షణ ఇచ్చేలా వసతి సౌకర్యాలు కల్పించారు. కార్యాలయ భవనం, థియరీ, ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చేందుకు అనుకూలమైన గదులు, నైపుణ్య శిక్షణతోపాటు ఆయా వస్తువుల తయారీ సెంటర్లు, వర్కుషెడ్లు, డార్మిటరీలతో హాస్టలు సదుపాయం, డైనింగ్ హాలుతో విస్తృతమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేశారు.

ఉపాధి శిక్షణ

స్వయం ఉపాధికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణలో మహిళా ప్రాంగణాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయంతో అనేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. టమాటా ప్రాసెసింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్, అలంకరణలు, బ్యూటీషియన్ కోర్సులు, కంప్యూటర్ ఆపరేటర్, ప్రీప్రైమరీ టీచర్ ట్రైనింగ్, నర్సింగ్, షీ ఆటో కార్ డ్రైవింగ్ కోర్సులను అందిస్తున్నాయి. వీటితోపాటు స్థానికంగా డిమాండ్ ఉండే అనేక ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

ఉద్యోగినులకు వృత్తి సామర్థ్యం పెంపు

ప్రభుత్వ ఉద్యోగినులు వృత్తి సామర్థ్యం పెంచుకునేలా ఈ కేంద్రాల్లో వివిధ రకాల శిక్షణ ఇస్తున్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, మెప్మా సిబ్బంది వంటి అనేక విభాగాల్లో ఉద్యోగినులు ఇక్కడ శిక్షణ పొంది వృత్తి సామర్థ్యం పెంచుకున్నారు. గత రెండేళ్లలో రూ.6.30 కోట్ల ఖర్చుతో 13 కేంద్రాల్లో 26 జిల్లాలకు చెందిన 86 వేలమందికి శిక్షణ ఇచ్చారు.

మదర్ మిల్క్ బ్యాంకు ప్రారంభం

కాకినాడ క్రైం : రాష్ట్రంలోనే తొలిసారి కాకినాడ జీజీహెచ్‌లో తల్లి పాల బ్యాంకు ఏర్పాటైంది. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ధాత్రి లాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్(పీఎల్ఎంసీ) పేరుతో సుశేష్, ఎన్‌సీసీతో పాటు ఇతర దాతలు, స్వచ్ఛంద సంస్థల సీఎస్ఆర్ నిధులతో రూ.50 లక్షలు వెచ్చించి దీనిని ఏర్పాటు చేశారు. శిశు అనారోగ్యాలు, మరణాల నిర్మూలనే లక్ష్యంగా తల్లి పాల బ్యాంకు ఏర్పాటు చేశామని, మరో రెండు దశల్లో మిల్క్ బ్యాంకు అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. ఈ యూనిట్ ద్వారా శిశువులకు తల్లి పాలు అందించడంతో పాటు తల్లుల నుంచి పాలు సేకరిస్తారని చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సుశేష, ధాత్రి ఫౌండేషన్ ప్రతినిధులను కలెక్టర్ సత్కరించారు. అంతకుముందు పిల్లల వార్డుల్లో ఆహ్లాదకర వాతావరణంలో చికిత్స అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన కుడ్య చిత్రాలను కలెక్టర్ ప్రారంభించారు.

ఎన్‌సీడీ-సీడీ సర్వే 74.45 శాతం పూర్తి

ప్రజలందరినీ స్క్రీనింగ్ చేస్తున్న ఏఎన్ఎంలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిరక్షణకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. మధుమేహం, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక జబ్బులున్న వారిని ప్రాథమిక దశలోనే వారిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, మెరుగైన వైద్యం అందిస్తోంది. దీర్ఘకాలిక జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించడానికి నాన్ కమ్యూనికబుల్ డిసీజస్-కమ్యూనికబుల్ డిసీజస్(ఎన్‌సీడీ-సీడీ) సర్వేను వైద్య శాఖ చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రజలందరినీ ఏఎన్ఎంలు స్క్రీనింగ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4.69 కోట్ల మందిని స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 74.45 శాతం అంటే 3.48 కోట్ల మందికి స్క్రీనింగ్ పూర్తయింది. వీరిలో మధుమేహం, రక్తపోటు, ఇతర సమస్యలున్న వారిని గుర్తించి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (పీహెచ్‌సీ) ఏఎన్ఎంలు మ్యాప్ చేస్తున్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వారికి వైద్య పరీక్షలు నిర్వహించి సమస్యలను నిర్ధారిస్తున్నారు. సమస్య నిర్ధారణ అయిన వారిపై నిరంతర పర్యవేక్షణ ఉంచుతున్నారు. బాధితుల వివరాలను ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ యాప్‌కు కూడా అనుసంధానిస్తున్నారు. గ్రామాలకు వెళ్లే ఫ్యామిలీ డాక్టర్లు బాధితుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. అవసరమైన మందులు అందజేస్తున్నారు. ఎన్‌సీడీ-సీడీ సర్వేలో ఏలూరు జిల్లా ముందంజలో ఉంది. ఈ జిల్లాలో 83.25 శాతం మేర సర్వే పూర్తయింది. ఆ తర్వాత అనకాపల్లి (81.86), బాపట్ల (78.15), ప్రకాశం (77.61) జిల్లాల్లో ఎక్కువ సర్వే చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 44.04 శాతం మందినే ఇప్పటివరకు సర్వే చేశారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తితో గవర్నర్ సేవలు

- విశ్వభూషణ్ హరిచందన్‌ను కొనియాడిన ముఖ్యమంత్రి జగన్
- గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయిన సీఎం దంపతులు

సాక్షి, అమరావతి : అధికార కార్యకలాపాల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో వ్యవహరించి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఎంతో రాజకీయ పరిణతి కనబరిచారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ఆయన గవర్నర్‌గా రాష్ట్రానికి అందించిన సేవలను ప్రజలు సదా గుర్తుంచుకుంటారన్నారు. ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీ అయిన విశ్వభూషణ్ హరిచందన్‌తో సీఎం వైఎస్ జగన్ రాజ్‌భవన్‌లో సోమవారం భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి దంపతులకు గవర్నర్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్, ఉప కార్యదర్శి నారాయణస్వామి స్వాగతం పలికారు. అనంతరం వారిరువురూ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో సీఎం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం సాధించి సత్సంబంధాలు సాగేలా కీలకపాత్ర పోషించారన్నారు. కరోనా విపత్కర పరిస్థితులను అధిగమించి రాష్ట్రం ప్రగతిపథంలో పయనించడానికి గవర్నర్ ఎంతో సహకరించారన్నారు. విశ్వభూషణ్ హరిచందన్ బదిలీ కావడం బాధాకరమైనా మరో రాష్ట్రానికి గవర్నర్‌గా వెళ్లడం ద్వారా అక్కడి ప్రజలకు మేలు చేయగలుగుతారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు చైర్మన్ మల్లాది విష్ణు, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి ముత్యాలరాజులతోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్, సతీమణి భారతి

మణిహారంలో కలికితురాయి



టర్బైన్ల ఏర్పాటు కోసం శరవేగంగా పునాది పనులు



ఫెరోల్స్‌లో వినియోగించే సెగ్మెంట్లను తయారు చేస్తున్న కార్మికులు

▶ మొదటి పేజీ తరువాయి

ఎడమవైపున కొండను తొలచి 960 మెగావాట్లు (12×80) సామర్థ్యంతో జలవిద్యుత్కేంద్రాన్ని నిర్మించే డిజైన్‌ను సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) ఆమోదించింది.

రివర్స్ టెండరింగ్‌తో రూ.405.23 కోట్లు ఆదా

పోలవరం నీటిపారుదల ప్రాజెక్టులో మిగిలిన రూ.3,302 కోట్ల విలువైన పనులను 2018 ఫిబ్రవరి 27న నామినేషన్ పద్ధతిలో నవయుగకు కట్టబెట్టిన టీడీపీ సర్కార్ రూ.3,216.11 కోట్ల వ్యయంతో జలవిద్యుత్కేంద్రం పనులను కూడా అదే సంస్థకు కట్టబెట్టింది. ఆ సంస్థ నుంచి నాటి సీఎం చంద్రబాబు భారీగా ముడుపులు వసూలు చేసుకున్నారు. ఈ అక్రమాలపై నిపుణుల కమిటీతో విచారణకు ఆదేశించిన సీఎం వైఎస్ జగన్.. కమిటీ సిఫార్సుల మేరకు రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. జలవిద్యుత్కేంద్రం పనులను రూ.2,810.88 కోట్లకే చేసేందుకు మేఘా సంస్థ ముందుకొచ్చింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.405.23 కోట్లు ఆదా అయ్యాయి. చంద్రబాబు అక్రమాల బాగోతాన్ని రివర్స్ టెండరింగ్ బట్టబయలు చేసింది.

శరవేగంగా పనులు..

టీడీపీ హయాంలో జలవిద్యుత్కేంద్రం పనుల్లో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం జలవిద్యుత్కేంద్రం నిర్మాణానికి వీలుగా గోదావరి ఎడమ గట్టుపై ఉన్న కొండను తొలిచే పనులను రికార్డు సమయంలో పూర్తి చేశారు.

- జలవిద్యుత్కేంద్రంలో అత్యంత కీలకమైన 12 ప్రెజర్ టన్నెళ్ల(సొరంగాలు) తవ్వకం పనులను రికార్డు సమయంలో పూర్తి చేశారు. 150.3 మీటర్ల పొడవు, 9 మీటర్ల వ్యాసంతో కూడిన 12 టన్నెళ్లను తవ్వారు.
- ప్రెజర్ టన్నెళ్లలో ఫెరోల్స్ అమర్చి లైనింగ్ పనులను చేపట్టారు. ఇప్పటికే ఏడు టన్నెళ్లలో ఫెరోల్స్ అమర్చి లైనింగ్ పనులను దాదాపుగా పూర్తి చేశారు. సొరంగాల ద్వారా నీరు సక్రమంగా వెళ్లేందుకు లైనింగ్ తోడ్పడుతుంది.
- ఒక్కో టన్నెల్‌లో 52 ఫెరోల్స్ చొప్పున 12 టన్నెళ్లలో 624 ఫెరోల్స్‌ను అమర్చనున్నారు. 9 మీటర్ల వ్యాసం, 25 మిల్లీమీటర్ల మందంతో కూడిన ఇనుప రేకులతో వీటిని తయారు చేశారు. ఫెరోల్స్ తయారీకి మొత్తం 8,520 టన్నుల స్టీల్‌ను వినియోగించారు.
- ఈ టన్నెళ్లకు చివర తక్కువ వ్యాసంతో ఇనుప పైపులను తొడిగి భూ ఉపరితలానికి ఆరు మీటర్ల దిగువన వర్టికల్ కెప్లాన్ టర్బైన్లను ఏర్పాటు చేస్తారు. టర్బైన్ల పునాది పనులను వేగవంతం చేశారు.
- వర్టికల్ కెప్లాన్ టర్బైన్ల తయారీని భోపాల్‌లోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బీహెచ్ఈఎల్‌కు అప్పగించారు. ఈ టర్బైన్లు ఆసియాలోనే అతి పెద్దవి కావడం గమనార్హం.

హిమాలయ జలవిద్యుత్కేంద్రాలకు దీటుగా..

- గోదావరి నుంచి ఏటా సగటున మూడు వేల టీఎంసీల జలాలు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలో కలుస్తున్నాయి. ఈ ప్రవాహమంతా పోలవరం ప్రాజెక్టు మీదుగానే ధవళేశ్వరం బ్యారేజీకి చేరుతోంది.
- జలవిద్యుత్కేంద్రంలో ఒక సొరంగం (యూనిట్) ద్వారా 80 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలంటే రోజుకు 331 క్యూమెక్కులు (11,690 క్యూసెక్కులు) నీటిని విడుదల చేయాలి. ఈ లెక్కన 12 సొరంగాలలో 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయాలంటే 1,40,280 క్యూసెక్కులు (12 టీఎంసీలు) అవసరం.
- పోలవరం పూర్తి నిల్వ సామర్థ్యం 194.6 టీఎంసీలు. ప్రాజెక్టు వద్దకు జూలై నుంచి అక్టోబర్ రెండో వారం వరకూ ఏడాదికి సగటున 100 నుంచి 120 రోజుల వరకూ 1.50 లక్షల క్యూసెక్కుల కంటే అధికంగా వరద ప్రవాహం వస్తుంది. అంటే ఏడాదికి సుమారు వంద నుంచి 120 రోజులు పూర్తి సామర్థ్యం మేరకు విద్యుదుత్పత్తి చేసుకోవచ్చు.
- ఆ తర్వాత వరద ప్రవాహం తగ్గిన మేరకు విద్యుదుత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. గోదావరి డెల్టాకు రబీ పంటలకు పోలవరం నుంచే నీటిని విడుదల చేయాలి. వాటిని విద్యుదుత్పత్తి ద్వారా విడుదల చేస్తారు. అంటే ఏడాది పొడవునా పోలవరం జలవిద్యుత్కేంద్రంలో విద్యుదుత్పత్తి చేసుకోవచ్చు.
- అందువల్ల హిమాలయ నదులపై ఏర్పాటు చేసిన జలవిద్యుత్కేంద్రాలకు దీటుగా పోలవరం జలవిద్యుత్కేంద్రంలో కరెంట్ ఉత్పత్తి అవుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

కడప స్టీల్ ప్లాంట్‌కు రేపు భూమి పూజ

భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: సీమవాసుల చిరకాల స్వప్నాన్ని నెరవేరుస్తూ రూ.8,800 కోట్లతో 30 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో జేఎస్‌డబ్ల్యూ గ్రూపు వైఎస్సార్ కడప జిల్లా సున్నపురాళ్లపల్లెలో ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్ పనులను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేసి లాంఛనంగా ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో జేఎస్‌డబ్ల్యూ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్ కూడా పాల్గొంటారు. 2019లో ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ పేరుతో ముఖ్యమంత్రి స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన చేసిన తర్వాత కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేయడంతో రెండేళ్లు పనులు జరగలేదు. కోవిడ్ సంక్షోభానికి భయపడి పలు సంస్థలు పెట్టుబడి ప్రతిపాదనలను ఉపసంహరించుకున్నాయి. ఇప్పుడు రూ.1,76,000 కోట్ల (22 బిలియన్ డాలర్లు) మార్కెట్ విలువ కలిగి, ఏటా 27 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ కంపెనీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టింది. దీంతో పనులు చకచకా జరగనున్నాయి. ఈ సంస్థకు ప్రభుత్వం దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన భూములు కేటాయించింది. జేఎస్‌డబ్ల్యూ సంస్థ తొలి విడతలో రూ.3,300 కోట్లతో ఏటా 10 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటు చేస్తుంది. రెండో విడతలో మరో 20 లక్షల టన్నులు ఉత్పత్తి చేసేందుకు ప్లాంట్‌ను విస్తరిస్తుంది. మొత్తం 30 లక్షల టన్నుల సామర్థ్యంతో పరిశ్రమ అందుబాటులోకి తెస్తుంది. నిర్మాణం ప్రారంభించిన 36 నెలల్లో తొలి దశ అందుబాటులోకి తేవాలని జేఎస్‌డబ్ల్యూ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

రూ.700 కోట్లతో మౌలిక వసతుల కల్పన

రాయలసీమ వాసులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.700 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తోంది. ఈ ప్లాంట్‌ను జాతీయ రహదారి 67కు అనుసంధానిస్తూ 7.5 కిలోమీటర్ల అప్రోచ్ రోడ్డు నిర్మిస్తోంది. ప్రొద్దుటూరు – ఎర్రగుంట్ల రైల్వే లైన్‌కు అనుసంధానిస్తూ 10 కిలోమీటర్ల నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేయనుంది. మైలవరం రిజర్వాయర్ నుంచి రెండు టీఎంసీల నీటిని సరఫరా చేసేలా ప్రత్యేక పైప్‌లైన్ నిర్మిస్తోంది.

గ్రీన్ ఎనర్జీ రంగంలోనూ పెట్టుబడులు

గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా జేఎస్‌డబ్ల్యూ పెట్టుబడులు పెట్టనుంది. 2.5 మెట్రిక్ టన్నుల డీఆర్ఐ ప్లాంట్, 1000 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ ప్లాంట్, 3,000 మెగావాట్ల సోలార్, విండ్, పంప్డ్ హైడ్రోస్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. బ్యాటరీ స్టోరేజ్, హైడ్రోజన్ స్టోరేజ్ కేంద్రాలనూ ఏర్పాటు చేయనుంది.

డిజిటల్ లావాదేవీలు పెరిగాయి

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ఓఎస్‌డీ ఎం.మూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా 186 గ్రామాలకు బ్యాంకింగ్ సేవలు అందడం లేదని, వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజికసేవ కింద ఆయా గ్రామాల్లో సేవలు అందించడానికి బ్యాంకులు ముందుకురావాలని కోరారు. రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ నవనీత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యత పెంచడానికి 26 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 6,000 గ్రామాల్లో అవగాహన సదస్సులను నిర్వహించామని తెలిపారు. మహిళా పొదుపులో రాష్ట్ర స్వయం సహాయక సంఘాలు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచాయని నాబార్డు జీఎం ఎంఎస్ మూర్తి చెప్పారు. అనంతరం ప్రజలకు ఆర్థిక అవగాహన పెంచే విధంగా ఆర్‌బీఐ ముద్రించిన పోస్టర్లను మిశ్రా తదితరులు విడుదల చేశారు.

విద్య, ఇంధన రంగాలపై ఆస్ట్రేలియా ఆసక్తి

సీఎం వైఎస్ జగన్‌తో చర్చించిన ఆ దేశ ప్రతినిధుల బృందం



సాక్షి, అమరావతి: విద్యా, నైపుణ్య శిక్షణ, పునరుత్పాదక ఇంధన రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆస్ట్రేలియా ప్రతినిధులు కొనియాడారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో విక్టోరియా రాష్ట్రానికి చెందిన ఆస్ట్రేలియన్ లేబర్ పార్టీ పార్లమెంటు సభ్యులతో కూడిన వాణిజ్య ప్రతినిధుల బృందం సోమవారం సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. అనంతరం విక్టోరియా ఎంపీ లీ తరలమిస్ మాట్లాడుతూ.. పునరుత్పాదక ఇంధన వనరులైన సోలార్, విండ్ ఎనర్జీల్లో రాష్ట్ర ప్రభుత్వం పలు ఆసక్తికరమైన చర్యలను తీసుకుందన్నారు. విద్య, నైపుణ్య శిక్షణ, ఇంధన రంగాల్లో అవకాశాలపై జరిగిన చర్చలపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. రాష్ట్ర విద్యారంగంలో అమలవుతున్న పలు విధానాలు ఆస్ట్రేలియా విధానాలతో సారూప్యత కలిగి ఉన్నాయన్నారు. విద్యా, నైపుణ్య శిక్షణ రంగాల్లో పరస్పరం సహకరించుకుంటామని.. విద్యా, ఇంధన రంగాల్లో పెట్టుబడుల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు లీ తరలమిస్ తెలిపారు.

ఏపీలో పాఠశాల విద్యా విధానం భేష్

- ఢిల్లీ ఎస్‌సీఈఆర్‌టీ బృందాల అభినందనలు
- విశాఖ, కృష్ణా జిల్లాల్లో ప్రభుత్వ స్కూళ్ల పరిశీలన

పెనమలూరు/మురళీనగర్(విశాఖ ఉత్తర): ఏపీలో ప్రభుత్వం అమలు చేస్తున్న పాఠశాల విద్యా విధానం చాలా బాగుందని ఢిల్లీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (డీఎస్‌సీఈఆర్‌టీ) బృందం సభ్యులు ప్రశంసించారు. కృష్ణా, విశాఖ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం ఢిల్లీ ఎస్‌సీఈఆర్‌టీ బృందం పరిశీలించింది. మృదుల భరద్వాజ్ నేతృత్వంలోని 28 మంది సభ్యులతో కూడిన ఒక ఢిల్లీ ఉపాధ్యాయుల బృందం కృష్ణా జిల్లా పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను, ఢిల్లీ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ రామకిశోర్ పర్యవేక్షణలో మరో బృందం విశాఖలోని మధురానగర్, నరవ, నడుపూరు పాఠశాలలను పరిశీలించాయి. తరగతి గదుల్లో సౌకర్యాలు, విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌ల నిర్వహణ, అటల్ టింకరింగ్ హబ్, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాదీవెన కానుకలను బృందం సభ్యులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా నడుపూరు ఉన్నత పాఠశాల ఆవరణలో వాతావరణం చూసి వారు మంత్రముగ్ధులయ్యారు. ఈ పాఠశాలలో అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ విధానం, రెయిన్ హార్వెస్టింగ్ విధానాన్ని, డిజిల్ లెర్నింగ్, ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను చూసి ఆనందం వ్యక్తంచేశారు. విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అమలు జరుగుతున్న విద్యా విధానాలను ఢిల్లీ బృందాలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు వివరించారు. పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యా ప్రమాణాలు, అనేక పథకాలు అమలు చేయడం గొప్ప విషయమని ఢిల్లీ బృందం సభ్యులు అభినందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాలా ముందుచూపుతో అమలు చేస్తున్న పథకాలను ఢిల్లీలోని పాఠశాలల్లో కూడా అమలు చేయాలని తమ ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని చెప్పారు.



విశాఖలో పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం సభ్యుడు

శివరాత్రి ఏర్పాట్లపై నేడు డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, అమరావతి: మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఏర్పాట్లపై చర్చించేందుకు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం అన్ని ప్రముఖ శైవ ఆలయాల ఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

సైన్యం సన్నద్ధం!

▶ మొదటి పేజీ తరువాయి

వలంటీర్ల సహకారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహణపై సీఎం వైఎస్ జగన్ సమీక్షించారు. ఈ కార్యక్రమం కూడా అత్యంత కీలకమని, నిర్దేశించుకున్న విధంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం జగన్ సమావేశమయ్యారు. రానున్న రోజుల్లో పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఆ వివరాలివీ..

16 లోగా మిగిలిన నియామకాలు..

93 శాతం గృహ సారథుల నియామకం పూర్తైంది. దాదాపు 5 లక్షల మంది గృహ సారథులను నియమించుకున్నాం. అక్కడక్కడా మిగిలిపోయిన గృహ సారథుల నియామకాలను ఫిబ్రవరి 16 లోగా పూర్తి చేయాలి. పార్టీ కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలంటే గృహ సారథులు చాలా ముఖ్యం. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమాలు 387 మండలాల్లో ముగిశాయి. రెండో బ్యాచ్‌కు శిక్షణ మిగిలిన మండలాల్లో రేపటి (మంగళవారం) నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 19 వరకు కొనసాగుతుంది. మండలాల వారీగా జరిగే ఈ శిక్షణ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొనాలి. శిక్షణ ముగిసిన తర్వాత క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలి. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల రూపంలో వైఎస్సార్ సీపీకి సుమారు 5.65 లక్షల మందితో కూడిన పార్టీ సైన్యం క్షేత్రస్థాయిలో ఉంది. వీరంతా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొంటారు. దాదాపు 1.65 కోట్ల గృహాలను సందర్శిస్తారు. గత సర్కారు కంటే మనం అందించిన మెరుగైన పాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తారు. ఈ కార్యక్రమంలో గృహ సారథులను సమన్వయం (కో–ఆర్డినేట్) చేసే బాధ్యతను సచివాలయ పార్టీ కన్వీనర్లకు అప్పగించాలి.

గడప గడపకూ అత్యంత కీలకం

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అత్యంత కీలకం. ఇప్పటివరకూ దాదాపు 7,447 సచివాలయాల్లో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించాం. సగటున నెలలో సుమారు 6 సచివాలయాలను ఎమ్మెల్యేలు సందర్శించారు. కొంత మంది మాత్రం పర్యటనలో వెనుకబడ్డారు. తక్కువ గృహాలను సందర్శించారు. అలసత్వం వద్దు. ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరినీ పలకరించి వారితో కొంత సమయం గడపాలి.

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి..

సుమారు 14 నెలల్లో ఎన్నికలు వస్తున్నాయి. టీడీపీ, ఆ పార్టీకి బాకా ఊదుతున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 లాంటి వాటితో యుద్ధం చేస్తున్నాం. ఉన్నది లేనట్టుగా, లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ అవి ప్రజలకు నిరంతరం ఏదో ఒక భ్రమ కల్పించే పనులు చేస్తున్నాయి. ఆ దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ మనం ముందుకు సాగాలి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమష్టిగా గెలుద్దాం

ఐదు గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీలపై సీఎం జగన్ దిశానిర్దేశం



ఎమ్మెల్సీ అభ్యర్థులను పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పట్టభద్రులు, ఉపాధ్యాయులకు సంబంధించి ఐదు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు, పార్టీ మద్దతు ఇస్తున్న అభ్యర్థులను గెలిపించేందుకు కలసికట్టుగా కృషి చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ, ప్రాంతీయ సమన్వయకర్తలకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పని చేసి విజయం సాధించాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎస్.సుధాకర్, తూర్పు రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రనాథ్‌రెడ్డి పోటీ చేస్తున్నారని తెలిపారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎం.వి.రామచంద్రారెడ్డి పోటీ చేస్తున్నారని చెప్పారు.

జగనన్న తడాఖా బాబుకు చూపిస్తాం

- 'ఎన్టీఆర్‌ను తడిగుడ్డతో గొంతు ఎలా కోశారు?' అనే పుస్తకం వేయండి: కొడాలి నాని
- వెన్నుపోటుతో చంద్రబాబుకు సీఎం పదవి, పార్టీ అధ్యక్ష పదవి దక్కాయి
- వివేకా ఆస్తులు ఆయన కుమార్తె, అల్లుడి పేరుతో ఎలా వచ్చాయ్?

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సత్తా, తడాఖాను 2024 ఎన్నికల్లో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మరోసారి చూస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరావు(నాని) వ్యాఖ్యానించారు. 175 నియోజకవర్గాల్లో గెలుపే ధ్యేయంగా గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి అన్ని చోట్లా విజయం సాధిస్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ చేతిలో చంద్రబాబు చావుదెబ్బ తినడం ఖాయమని, అంతటితో ఆయన రాజకీయ చరిత్ర



ముగుస్తుందన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు.

- చంద్రబాబు, లోకేశ్ తెచ్చిన జగనాసుర రక్తచరిత్రను ఎవరు చదువుతారు? ఆ పుస్తకాలు చలి మంటలు కాచుకునేందుకే పనికొస్తాయి. 'ఎన్టీఆర్‌ను తడిగుడ్డతో ఎలా గొంతు కోశారు?' అనే పుస్తకాన్ని వారు విడుదలచేస్తే జనం చదువుతారు.
- మామను పొట్టనబెట్టుకుంటే చంద్రబాబుకు ముఖ్యమంత్రి పదవి, పార్టీ అధ్యక్ష పదవి వచ్చింది. సీఎం జగన్‌కి వైఎస్ వివేకానందరెడ్డి చిన్నాన్న. ఆయన్ను ఎందుకు చంపుకుంటారు? వైఎస్ వివేకా చనిపోతే సీఎం జగన్‌కు ఏమైనా ఆస్తులొచ్చాయా? వివేకా ఆస్తులు ఆయన కుమార్తె, అల్లుడి పేరుమీదకు ఎలా వచ్చాయ్? వైఎస్ వివేకా అప్పట్లో వైఎస్ జగన్‌తో కలిసి నడిచి వచ్చిన వ్యక్తి కాదు. వైఎస్ విజయమ్మపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడించే ప్రయత్నం చేశారు.
- వైఎస్ జగన్ కుటుంబం నాశనమవ్వాలని కోరుకునే వ్యక్తులు వైఎస్ వివేకా ఫ్యామిలీలో ఉన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి కుటుంబమే సీఎం జగన్ వెంట నడిచింది. వైఎస్ వివేకా బతికి ఉన్నా కడప ఎంపీ సీటును అవినాష్ రెడ్డికే సీఎం జగన్ ఇచ్చేవారు.
- మార్చి 18 నుంచి 26 వరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. చంద్రబాబు గ్రాఫిక్స్‌తో ఎలా మభ్యపెట్టారో కూడా చెబుతాం. లోకేశ్‌కు వచ్చింది ఖర్జూరనాయుడు గొంతు అయి ఉంటుంది. ఆయన బస్టాండులో జేబులు కొడుతూ తిరిగేవాడు. వర్ల రామయ్య, పట్టాభి లాంటి వాళ్లు బాబు జీతగాళ్లు.
- మూడు పట్టభద్రులు, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచి తీరాలని సీఎం ఆదేశించారు. తప్పకుండా విజయం సాధిస్తాం.

దివ్యాంగ బాలిక దారుణ హత్య

కత్తితో దాడి చేసి పరారైన సైకో.. చికిత్స పొందుతూ బాధితురాలి మృతి

- గుంటూరు జిల్లా తాడేపల్లిలో దారుణం
- నిందితుడికి టీడీపీ నేతలతో సంబంధాలు
- గంట వ్యవధిలో నిందితుడు అరెస్టు
- బాధిత కుటుంబానికి రూ.10లక్షల సాయం ప్రకటించిన సీఎం జగన్





మృతురాలు ఎస్తేరు రాణి (ఫైల్), నిందితుడు కుక్కల రాజు



బాలిక తల్లిని పరామర్శిస్తున్న వాసిరెడ్డి పద్మ

తాడేపల్లిరూరల్/లబ్బీపేట (విజయవాడ తూర్పు): బాలిక తల్లి మీద కక్ష పెంచుకున్న యువకుడు చివరికి దివ్యాంగురాలైన ఆమె కుమార్తెను వేధింపులకు గురిచేసి చివరికి హత్యచేశాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. తాడేపల్లి పట్టణం ఎన్టీఆర్ కరకట్టకు చెందిన వంగ మనోరమ కుమార్తె ఎస్తేరురాణి (17) పుట్టుకతోనే దివ్యాంగురాలు(అంధురాలు). తండ్రి యేబుతో తల్లి విడిపోవడంతో ఎస్తేరురాణి తల్లి వద్ద ఉంటోంది. మనోరమ ఇంటికి వచ్చి వెళ్లే దేవదాసు అనే యువకుడికి ఇదే ప్రాంతానికి చెందిన నాగపోగు ధనుంజయరాజు అలియాస్ కుక్కల రాజు పరిచయమయ్యాడు. మనోరమ, కుక్కల రాజుల ఇళ్లు ఎదురెదురు కావడంతో దేవదాసు రెండు ఇళ్లకూ వస్తూ పోతూ ఉంటాడు. మూడు రోజుల కిందట దేవదాసు మద్యం తాగి మనోరమ ఇంట్లో వాంతి చేసుకోవడంతో ఆయన చేతే మనోరమ ఇల్లు కడిగించింది. దీనిని కుక్కల రాజు వీడియో తీసి అందరికీ చూపడంతో కక్ష పెంచుకున్న దేవదాసు.. కుక్కల రాజును చంపుతానని బెదిరించాడు. దీంతో మొదలైన వివాదం.. కుక్కల రాజు మనోరమ చేయి పట్టుకుని లాగి ఇష్టమొచ్చినట్లు మాట్లాడేంత వరకూ వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె రాజు బంధువులకు విషయం చెప్పడంతో వారు కుక్కల రాజును మందలించారు. దీంతో కోపం పెంచుకున్న కుక్కల రాజు ఆదివారం రాత్రి ఎవరూ లేని సమయంలో మనోరమ ఇంటికి వెళ్లి అంధురాలైన ఎస్తేరురాణి చేయిపట్టుకుని లాగాడు. ఆమె ప్రతిఘటించడంతో కత్తితో ఆమె మెడపై, తలపై విచక్షణ రహితంగా నరికాడు. ఎస్తేరురాణి పెద్దగా కేకలు వేయడంతో తల్లితో పాటు అక్కడే ఉన్న బంధువులు పరిగెత్తుకుంటూ వచ్చారు. అప్పటికే కుక్కల రాజు పరారయ్యాడు. గాయపడిన ఎస్తేరురాణిని బంధువులు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఈ ఘటన వెలుగులోకొచ్చింది. దీంతో పోలీసులు కుక్కల రాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

టీడీపీ నేతల సంరక్షణలో కుక్కల రాజు

కుక్కల రాజు వివాహానంతరం విజయవాడ రాణిగారితోట నుంచి కరకట్టకు వచ్చి భార్య, తల్లితో కలసి నివాసముంటున్నాడు. 2019లో తల్లితో, భార్యతో వివాదం రావడంతో వారిని తీవ్రంగా కొట్టి గొడ్డలితో నరికేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో తల్లి, భార్య పారిపోయి తాడేపల్లి పోలీసులను ఆశ్రయించగా, కుక్కల రాజు గొడ్డలితో పోలీసులపై దాడికి పాల్పడ్డాడు. పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఈ నేపథ్యంలో తల్లీ, భార్య అతనికి దూరంగా ఉంటున్నారు. అప్పటి నుంచి కరకట్ట మీద పట్టాభిరామయ్య కాలనీకి చెందిన కొంతమంది టీడీపీ కార్యకర్తలు అతనికి ఆశ్రయం కల్పించారు. కుక్కల రాజు కుక్కలను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే టీడీపీ కార్యకర్తలకు, కుక్కల రాజుకు గొడవ జరగ్గా.. కుక్కల రాజును చేరదీసిన వారే చితకబాది, పెంపుడు కుక్కలతో కరిపించారు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మొదటి నుంచి సైకోలా వ్యవహరిస్తున్న కుక్కల రాజును పోలీసుల నుంచి కాపాడింది టీడీపీ నేతలే. ఇదిలా ఉండగా, బాధితురాలి కుటుంబ సభ్యులను సోమవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పరామర్శించారు. ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తుందని చెప్పారు.

పోలీసుల అదుపులో నిందితుడు..

ఎస్తేరు రాణిని హత్యచేసిన కుక్కలరాజును పోలీసులు గంట వ్యవధిలో అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందిన వెంటనే నార్త్‌జోన్ డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, పెదకాకాని పోలీసులను అప్రమత్తంచేసి క్రైం సిబ్బందితో జల్లెడ పట్టారు. సీతానగరం రైల్వేబ్రిడ్జి మీద నుంచి విజయవాడ వెళ్తుండగా నిందితుణ్ణి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం

మరోవైపు.. ఎస్తేరురాణి మృతిచెందడంతో ఆమె కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. తాడేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ రాంప్రసాద్ మాట్లాడుతూ ఈ విషయాన్ని మనోరమకు తెలియజేసినట్లు చెప్పారు.

విజయవాడలో టీడీపీ నేతల దాడిలో గాయపడిన మహిళకు వాసిరెడ్డి పద్మ పరామర్శ

వింబిపేట(విజయవాడపశ్చిమ): టీడీపీ నాయకులు దాడికి పాల్పడిన విజయవాడ వింబిపేట, మహాలక్ష్మి అమ్మవారి గుడివీధిలో నివాసం ఉంటున్న బాధిత మహిళను, ఆమెతో పాటు గాయపడిన కుటుంబ సభ్యులను సోమవారం వాసిరెడ్డి పద్మ పరామర్శించారు. ఆమె వెంట ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

క్లుప్తంగా...

రైతులను వలస కూలీలుగా మార్చిన బాబు

869వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: రాజధాని రైతులను వలస కూలీలుగా మార్చి వారి జీవితాలపై చంద్రబాబు కొట్టిన దెబ్బ కోలుకోలేనిదని, ఈ ప్రాంత రైతులు, ప్రజలు ఆయనను ఎప్పటికీ నమ్మరని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం 869వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 5 కోట్ల మంది ప్రజలకు న్యాయం చేయాలనే మంచి ఉద్దేశంతోనే మూడు రాజధానులు, అన్ని ప్రాంతాల సమానాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని, బాబులా రెండు నాల్కల ధోరణి అవలంబించే అలవాటు ఆయనకు లేదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో బీజేపీదే అధికారం

బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవధర్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవధర్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని ఆయన కోరారు. నగరంలోని ఓ హోటల్లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సునీల్ దేవధర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని చెప్పారు. ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించారని, ఈ ఆరేళ్ల కాలంలో ఉత్తరాంధ్ర ప్రజలకు తానిచ్చిన హామీలన్నీ పూర్తి చేసినట్లు చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడగలిగే సత్తా ఒక్క బీజేపీకే ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు ఎం.రవీంద్ర, సుహాసిని పాల్గొన్నారు.



స్వేచ్ఛ కంటే ఎక్కువగా ఎవరూ దేన్నీ ప్రేమించలేరు. ప్రేమ కూడా స్వేచ్ఛ తర్వాతే! స్వేచ్ఛ కోసం ప్రేమను త్యాగం చేయొచ్చు, కానీ ప్రేమ కోసం స్వేచ్ఛను త్యాగం చేయలేం.

– ఓషో

సాక్షి

మంగళవారం, ఫిబ్రవరి, 14

సంబరంలో దాగిన సంకటం!

వర్తమాన యుగంలో అపురూపమైన, అత్యవసరమైన ఒక ఖనిజం కోసం ప్రపంచవ్యాప్తంగా భూభౌతిక శాస్త్రవేత్తలు నిరంతరాన్వేషణలో తలమునకలైన వేళ 'నేనున్నాన'ంటూ భారత్‌లోనే అది ప్రత్యక్షం కావటం సంబరం చేసుకోవాల్సిన సందర్భమే. అందుకే జమ్మూ, కశ్మీర్‌లోని రియాసీ జిల్లాలో నాణ్యమైన లిథియం నిక్షేపాలున్నట్టు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్‌ఐ) ప్రకటించినప్పుడు చాలామంది శాస్త్రవేత్తలు సంతోషం వ్యక్తం చేశారు. నిజానికి లిథియం నిక్షేపాలు మన దేశంలో బయటపడటం ఇది మొదటిసారేమీ కాదు. 2021 ఫిబ్రవరిలో కర్ణాటకలో కూడా లిథియం ఆచూకీ కనుక్కున్నారు. అయితే ఆ నిల్వలు 1,600 టన్నులు మాత్రమే. ఇప్పుడు బయటపడిన నిక్షేపాలు దాదాపు 60 లక్షల టన్నులు. వర్తమాన ప్రపంచాన్ని నడిపిస్తున్న శిలాజ ఇంధనాలు క్రమేపీ తరిగిపోతున్నాయని, పైగా వాటి వినియోగం కారణంగా పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నదనీ అర్థమయ్యాక ప్రత్యామ్నాయాల కోసం ఆత్రుతపడటం మొదలైంది. ఆ క్రమంలో 'హరిత ఇంధనాల' పేరిట చాలానే ఉనికిలోకొచ్చాయి. అయితే వీటికున్న పరిమితులను అధిగమించటంలో ఇంకా పూర్తి స్థాయి విజయం సాధ్యం కాలేదు. ఈ తరుణంలో లిథియం–అయాన్ బ్యాటరీ రూపకల్పనకు తోడ్పడగల పరిశోధన చేసినందుకు 2019 సంవత్సరానికి ముగ్గురు శాస్త్రవేత్తలకు కెమిస్ట్రీలో నోబెల్ బహుమతి రావటం ప్రత్యామ్నాయ ఇంధన వెతుకులాటలో కీలక మలుపు. ఆ పరిశోధనల పర్యవసానంగానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ల రంగంలో ఊహించని అభివృద్ధి సాధ్యమైంది. 1991లో ఒక జపాన్ ఎలక్ట్రానిక్స్ సంస్థ లిథియం అయాన్ బ్యాటరీ అభివృద్ధి చేశాక కంప్యూటర్ ఎక్కడికైనా తీసుకెళ్లే ఉపకరణమైంది. అప్పుడప్పుడే వస్తున్న డిజిటల్ కెమెరాల సైజు గణనీయంగా తగ్గింది. సెల్‌ఫోన్‌ల ఆగమనంలో లిథియం అయాన్ బ్యాటరీ పాత్ర అసాధారణం. గత కొన్నేళ్లుగా విద్యుత్‌తో నడిచే వాహనాల తయారీ కూడా జోరందుకుంది. ఇంకా పేస్‌మేకర్లకూ, అంతరిక్ష నౌకలకూ, జలాంతర్గాములకూ లిథియం హైడ్రాక్సైడ్ కీలకం. ఇక బైపోలార్ వ్యాధి నివారణకు తోడ్పడే ఔషధాల ఉత్పత్తిలో లిథియం కార్బొనేట్ ఎంతో అవసరమని ఇటీవల కనుగొన్నారు. 2020లో ప్రపంచ లిథియం వినియోగం కేవలం 56,000 టన్నులైతే అది ఇప్పటికే రెట్టింపు దాటింది. ఏటా ఆ వినియోగం 22 లక్షల టన్నులకు చేరుకోవచ్చని ఒక అంచనా.

'తెల్ల బంగారం'గా పిలిచే లిథియంపై ఆధారపడటం ఎక్కువవుతున్న తరుణంలో దాని ఖరీదు కూడా పెరుగుతోంది. మన దేశం 2020–21లో రూ. 173 కోట్ల విలువైన లిథియంను దిగుమతి చేసుకోగా, ఆ ఏడాదే మరో 8,811 కోట్ల రూపాయల విలువైన లిథియం అయాన్ బ్యాటరీలు కొనుగోలు చేసింది. నిరుడు ఈ వ్యయం దాదాపు రెట్టింపయింది. రాగల సంవత్సరాల్లో ఇదింకా పెరగటం ఖాయం. కనుకనే లిథియం నిల్వల కోసం అన్వేషణ సాగిస్తూనే ఉంది. గత అయిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మేఘాలయల్లో 20 ప్రాజెక్టులు ప్రత్యేకించి లిథియం కోసమే పనిచేస్తున్నాయి. ఇవిగాక మూడు ప్రభుత్వ రంగ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో ఖనిజ్ బిదేష్ ఇండియా(కబిల్) పేరిట ఒక సంస్థ ఏర్పడి ఆస్ట్రేలియా, అర్జెంటీనా లిథియం గనుల్లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధపడుతోంది. ఈ నేపథ్యంలో జమ్మూ, కశ్మీర్‌లో అపారంగా లిథియం నిక్షేపాలున్నట్టు వెల్లడికావటం ఉత్సాహాన్నిచ్చేదే. ప్రపంచంలో భారీయెత్తున లిథియం నిల్వలున్న దేశం బొలీవియా అయితే...ఆ తర్వాతి స్థానాల్లో ఉన్న చిలీ, ఆస్ట్రేలియా, చైనాల తర్వాత మనమే. రాశిలో అమెరికా కన్నా కూడా మనం ఎక్కువే. ఈ నిక్షేపాల నాణ్యతనూ, వాస్తవ వినియోగ సామర్థ్యాన్నీ మరిన్ని పరీక్షల తర్వాతగానీ పూర్తిగా నిర్ధారించలేమన్నది శాస్త్రవేత్తల మాట. ఇందుకు రెండేళ్ల సమయం పడుతుంది. అంతా సవ్యంగా ఉందనుకున్నాక ఉత్పత్తి మొదలుకావడానికి మరో అయిదారేళ్లు తప్పదు.

ఈ ప్రక్రియంతా పర్యావరణ హితంగా జరగటం సాధ్యమేనా? ఎందుకంటే ఇప్పుడు నిక్షేపాలు బయటపడిన ప్రాంతం హిమాలయ పర్వత సానువుల్లో ఉంది. పర్యావరణపరంగా వచ్చే ప్రమాదం గురించి శాస్త్రవేత్తలు, పర్యావరణ ఉద్యమకారులు చేస్తున్న హెచ్చరికలు బేఖాతరుచేసి దశాబ్దాలుగా జలవిద్యుత్ ప్రాజెక్టులూ, ఇతర నిర్మాణాలూ చేపట్టిన పర్యవసానంగా ఉత్తరాఖండ్‌లోని జోషీ మఠ్ పట్టణం ఎలా కుంగిపోతున్నదో ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. భూకంప ముప్పు రీత్యా హిమాలయ పర్వత ప్రాంతాలు అత్యంత సున్నితమైనవి. లిథియం నిక్షేపాల వెలికితీత ఆ ముప్పును మరింత పెంచేలా మారకూడదు. ఉక్కు తెరల వెనక కాలక్షేపం చేసే చైనాలో లిథియం వెలికితీత వల్ల ఏర్పడుతున్న సమస్యల గురించి ప్రపంచానికి పెద్దగా తెలియకపోయినా వెనకబడిన దక్షిణ అమెరికా దేశాల్లో జనం ఎదుర్కొంటున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కాదు. ఒక టన్ను లిథియం ఉత్పత్తికి 22 లక్షల లీటర్ల నీరు అవసరం కావటంతో చిలీ, బొలీవియా, అర్జెంటీనా దేశాల్లో స్థానికంగా ఉన్న జలవనరులన్నీ హరించుకుపోతున్నాయి. నేల, చెట్టూ, చేమా దెబ్బతింటున్నాయి. దాంతో స్థానిక ప్రజలు ఉద్యమాలు చేస్తున్నారు. ఇలా పర్యావరణాన్ని కాటేసే లిథియంకు బదులు తక్కువ నష్టం ఉండే ఇనుము, సిలికాన్ వంటి లోహాలపై దృష్టిపెట్టాలన్న డిమాండ్ కూడా ప్రపంచవ్యాప్తంగా ఊపందుకుంది. ఏదేమైనా జమ్మూ, కశ్మీర్ లిథియం నిక్షేపాల విషయంలో ఆచితూచి అడుగేయటం అన్ని విధాలా శ్రేయస్కరం.

పాలనా రథానికి ప్రజలే రక్ష!



భారతీయులు 140 కోట్ల మంది తనకు రక్షా కవచంగా ఉన్నారని ప్రధాని అన్నారు. మరి అలాంటప్పుడు ఒక డాక్యుమెంటరీని ఎందుకు అంతగా ప్రభుత్వం వ్యతిరేకించింది? భారత సమాజ పరిస్థితులు, ప్రభుత్వ చర్యల గురించిన ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకోగోరే భారతీయుల హక్కుల్ని ఇది కాలరాయడం కాదా? ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నికైన నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడటం కష్టసాధ్యమని నమ్మిన నాయకులున్నారు. కానీ జాతీయోద్యమ నాయకుడైన మహావీర్ త్యాగి ప్రజలు భాగస్వాములు కాని అధికారాలు ప్రభుత్వాలకు ఉండటానికి వీల్లేదని వాదించారు. ప్రాథమిక హక్కుల్ని ప్రభుత్వాలు కాలరాచే పరిస్థితుల్లో అలాంటి ప్రభుత్వాల్ని కూలద్రోసే హక్కును ప్రజలకు దఖలు పరచాలన్నారు.

ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"నా ప్రభుత్వం పైన ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను దేశ ప్రజలు నమ్మబోరు. 140 కోట్లమంది భారతీయులూ నాకు రక్షణగా, సురక్షితమైన కవచంగా ఉన్నారు."

– ప్రధానమంత్రి నరేంద్ర మోదీ (8 ఫిబ్రవరి 2023)

గుజరాత్‌లో 2002లో మైనారిటీలపై జరిగిన మూకుమ్మడి హత్యాకాండ గురించి జాతీయ మానవ హక్కుల కమిషన్ ఒక ప్రకటన చేస్తూ– గుజరాత్ ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడటంలో గుజరాత్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనీ, ఆ తర్వాత వారాల తరబడి సాగిన హింసాకాండను అదుపు చేయలేక పోయిందనీ నిశితంగా విమర్శించింది. అంతేగాదు, గత 20 సంవత్సరాలుగానూ దేశవ్యాప్తంగా వివిధ బాధ్యతాయుత సంస్థల ప్రతినిధులు, మానవ హక్కుల నాయకులు ఈ విపరిణామాన్ని ఖండిస్తూ వచ్చారు. అయినా 2002 నాటి గుజరాత్ హింసాకాండను ప్రోత్సహించిన బాధ్యులెవరిపైనా రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకోలేదు. గుజరాత్ ఊచకోతలపై 'ఇండియా – ది మోదీ క్వశ్చన్' మకుటం కింద ఒక డాక్యుమెంటరీని 'బీబీసీ' విడుదల చేసింది. అయితే ఈ డాక్యుమెంటరీ 'భారతదేశ సార్వభౌమాధికారాన్ని, నిజాయితీని అవమాన పరుస్తోం'దన్న పేరిట సామాజిక మాధ్యమాలన్నిటి నుంచి ప్రభుత్వం తొలగించింది. భారత సమాజ పరిస్థితుల గురించి, ప్రభుత్వ చర్యల గురించి ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకోగోరే భారతీయుల హక్కుల్ని కాలరాయడం పట్ల శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు తదితర విద్వత్ సంపన్నులు 500 మందికి పైగా విస్మయం వ్యక్తం చేశారు.

పరిణామాలకు అద్దం

నిజానికి 'బీబీసీ' డాక్యుమెంటరీ వచ్చింది గుజరాత్ మారణకాండ అనంతరం 20 సంవత్సరాలకు. అంతకుముందే 2010 నాటికే రాణా అయూబ్ 'గుజరాత్ ఫైల్స్' పేరిట గుజరాత్ బీజేపీ పాలకవర్గ 'మాలోకా'న్ని ప్రత్యక్షరబద్ధంగా నమోదు చేసింది. ఈ గ్రంథానికి ఉపోద్ఘాతం రాసింది మరెవరో కాదు, సాక్షాత్తూ మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ. 'ఈశావాస్యోపనిషత్'లో కళ్లు తెరిపించే ఒక సూక్తి ఉంది: "నిజం అనే ముఖాన్ని కనపడనివ్వకుండా ఓ బంగారు కుండీలో దాచి ఉంచుతారు. అసలా జలతారు కుండీలో దాగిన నిజమేమిటి?" అలాగే నిజమనేది కట్టుకథకు అందని వాస్తవం! అలాంటి 'గుజరాత్ వాస్తవాల'ను రాణా అయూబ్ సాహసంతో బహిర్గతం చేసిందని శ్రీకృష్ణ కితాబిచ్చారు. 'అయూబ్ రచన పరిశోధనాత్మక పాత్రికేయ విధి నిర్వహణలో ఒక సాహస యాత్ర. పాలనా రంగంలో నానాటికీ పెరిగిపోతున్న నిజాయితీకి పాతరేసి, దొంగచాటు రాజకీయ కుట్రలకు మార్గం తీస్తున్న పరిణామాలకు ప్రత్యక్ష సాక్ష్యం' అని పేర్కొన్నారు.

రెండో మాట



రాజ్యాంగ రచనా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అంబేడ్కర్, భారత ప్రభుత్వం ప్రజాస్వామికంగా ఎన్నికైనందున అధికార దుర్వినియోగానికి పాల్పడటం కష్టసాధ్యమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అంబేడ్కర్ అభిప్రాయంతో జాతీయోద్యమ నాయకుల్లో ఒకరైన మహావీర్ త్యాగి(1899–1980) విభేదిస్తూ, అంబేడ్కర్ లాగా ఇలాంటి అభిప్రాయాలు కల నాయకులెవరైనా ఉంటే వారు అలాంటి ప్రకటనలు చేయబోయేముందు కొన్నాళ్లు జైలులో ఉండొస్తే మంచిదని వ్యంగ్యంగా సలహా ఇచ్చారు! ఆ పిమ్మట త్యాగి, రాజ్యాంగ రచన ముసాయిదా సంఘానికి సవాలుగా ఒక ప్రతిపాదన చేస్తూ, ప్రజలకు ఆమోదించిన ప్రాథమిక హక్కుల్ని ముందుముందు ఏర్పడబోయే ప్రభుత్వాలు కాలరాచే పరిస్థితుల్లో అలాంటి ప్రభుత్వాల్ని కూలద్రోసే లేదా మార్చేసే హక్కును ప్రజలకు దఖలు పరిచే అంశాన్ని చర్చించారా లేదా అని ప్రశ్నించారు. ప్రజలకున్న అలాంటి సహజమైన హక్కుకు మీరు గ్యారంటీ ఇవ్వలేదని త్యాగి విమర్శిస్తూ ప్రభుత్వ హక్కులతోపాటు ప్రజల హక్కుల్ని గురించి కూడా ఆలోచించాలన్నారు. ప్రజలు భాగస్వాములు కాని అధికారాలు ప్రభుత్వాలకు ఉండటానికి వీల్లేదని త్యాగి వాదించారు. అందుకు పూర్తిగా సమ్మతిస్తూ డాక్టర్ అంబేడ్కర్, ఉత్తరోత్తరా ప్రివెంటివ్ డిటెన్షన్ (ముందస్తు ఊహపై ఆధారపడి) పైన వ్యక్తుల్ని అరెస్టు చేసి జైల్లో పెట్టే స్వేచ్ఛను భావిప్రభుత్వాలకు అనుమతించే ప్రసక్తి ఉండరాదని పలుమార్లు స్పష్టం చేశారు.

దేశ స్వాతంత్ర్యం తర్వాత ప్రజాస్వామ్యం, ఎన్నికల మాటున 'ఓటు' ఎరలోనూ షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తరగతులకు ప్రత్యేకంగా ఒరిగిందేమీ లేదు. పైగా ఎన్నికల పేరిట సంపన్న వర్గాలు, కుల, మత, రాజకీయ పక్షాలూ చేసిందీ, చేస్తున్నదీ – అన్ని కులాలలోని పేదలు, అణగారిన ప్రజలు చైతన్యం పొందకుండా జాగ్రత్త పడటం మాత్రమే. అంబేడ్కర్ ముసాయిదా రాజ్యాంగ ప్రతిని వెలుగు చూడకుండా రాజ్యాంగ రచనా సంఘంలోని కొందరు సభ్యులు విశ్వ ప్రయత్నం చేశారు. అడ్డదారులలో ఎన్నికల పేరిట కుల, మత సంపన్న వర్గాల సభ్యులు హెచ్చుమంది ఎలా అనతికాలంలోనే 'కుబేర సంతానం'గా మారి భారతదేశ ఆర్థిక వ్యవస్థనే, తారుమారు చేయడానికి వెనుదీయడం లేదో ప్రజలకు ఇప్పుడు అర్థమైపోయింది. రాజ్యం కార్పొరేట్ ఎస్టేట్ వ్యాపారంగా ఎలా మారిపోయిందో రుజువైపోయింది.

స్వతంత్రంగా వ్యవహరించాలి

1951 మేలోనే కేంద్ర, రాష్ట్ర శాసన వేదికల్లోకి ప్రవేశించడానికి ఎవరెవరిని అనర్హులుగా ప్రకటించాలో 'ప్రజా ప్రాతినిధ్య బిల్లు'ను అంబేడ్కర్ ప్రవేశపెడుతూ అవసరమైన సవరణలను కూడా ప్రతిపాదించారు. వాటిలో ప్రధానమైనవి – పార్లమెంట్, ఎన్నికల చట్టం పార్లమెంట్ సభ్యుల స్వేచ్ఛను ప్రభుత్వ స్వేచ్ఛను భిన్నమైనవిగా భావించాలి. మొత్తం పార్లమెంట్‌ను అవినీతికి 'పెద్ద బిడ్డ'గా మార్చకుండా ఉండే విధంగా సభనూ, ఎన్నికల చట్టాన్నీ రూపొందించాలి. పార్లమెంట్ సభ్యులకు రాజకీయ పదవులను కట్టబెట్టడం ద్వారా లేదా ఇతర ప్రలోభాలకు లోను చేయడం ద్వారా మొత్తం పార్లమెంట్‌ను లేదా శాసన వేదికలను అవినీతిపాలు చేసేలా ప్రభుత్వానికి అవకాశం కల్పించకూడదు. దానికి తగిన విధంగా మన శాసన వేదికలు, పార్లమెంట్, ఎన్నికల చట్టమూ ఉండాలని అంబేడ్కర్ అభిలషించారు. పార్లమెంట్ లేదా శాసన వేదిక అనేది నిర్భీతిగా, ప్రభుత్వం నుంచి ఏ ప్రలోభాన్నీ ఆశించకుండా స్వతంత్రంగా వ్యవహరించలేని నాడు అలాంటి శాసన వేదికలు నిష్ప్రయోజనకరం. శాసన వేదికలు ప్రభుత్వాలు చెప్పే మాటలకు డూడూ బసవన్నలుగా, నట, గాయక వందిమాగధులుగా వ్యవహరించరాదని కూడా అంబేడ్కర్ (1951 మే 9) నిర్మొహమాటంగా పేర్కొన్నారని మరచి పోరాదు. పార్లమెంట్ ఒక స్టాక్ ఎక్స్ఛేంజీగా (వ్యాపార లావాదేవీల కేంద్రం) ఇప్పటికే (1951 నాటికే) మారిపోయిందని పండిట్ లక్ష్మీకాంత మైత్రా ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలాంటి సంప్రదాయానికి 75 ఏళ్లకు కూడా 'క్లాం' వేయడానికి పాలకులకు ఇష్టం లేదు. దీనివల్ల పాలకులు ప్రయోజనం పొందడం సహజం. కనుకనే న్యాయ వ్యవస్థ తన జడత్వాన్ని క్రమంగా వదిలించుకుని చైతన్యావస్థలోకి వచ్చి కఠినమైన నిర్ణయాలు తీసుకోగల సత్తాను సంతరించుకుంటోంది. అందుకే కవి కుమారుడు ఎంతటి కమ్మని సూక్తిని విడిచి వెళ్లాడో గదా – "బలవంతపు రాజ్యకాంక్షా ఒక పాపము జూచునే ఈశ్వరా?"! తన 'బీదతనం' దేశ దారిద్ర్యమనీ, తన మరణం లోక ప్రళయమనీ భావించి సంచరించే అహంకారుల గురించి సుమతీ శతకకారుడు హెచ్చరించలేదూ?!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇలా కూడా ఉంటారు...



మా అన్నను రోజూ స్కిన్ కేర్ ఎలా చేసుకుంటావని అడిగాను. స్కిన్‌కు ప్రత్యేకంగా కేర్ తీసుకోవడం ఏమిటని బదులిచ్చాడు.

– అనంతికా శర్మ, ఎంబీబీఎస్ డాక్టర్

ఇట్టే వచ్చేశాను!



చెన్నై– బెంగళూరు ప్రయాణాల విషయంలో జరిగిన అత్యుత్తమ విషయం ఏమిటంటే, వందే భారత్ రైళ్లు రావడం. బెంగళూరు స్టేషన్‌కు 10.10 కల్లా వచ్చాను. పదకొండు కల్లా ఆఫీసులో ఉన్నాను. రైల్వే మంత్రిత్వ శాఖ వర్గాలకు జేజేలు.

– శ్రీరామ్ వి., ఆంత్రప్రెన్యూర్

వాస్తవం



మనకు తెలిసిన పదార్థాల్లో విటమిన్ బీ12 ఉండేది వీటిల్లో మాత్రమే (అన్ని విలువలూ 100 గ్రాముల ఆహారానికి మైక్రోగ్రాముల్లో): లివర్ (90), మటన్ (2.8), చేప (1.4–6), గుడ్డు (1.8), బీఫ్ (1.7), చికెన్(0.3), పాలు (0.14). రోజువారీగా తీసుకోవాల్సింది 1.2 మైక్రో గ్రాములు. మనకు తెలిసిన ఏ మొక్కలోనూ బీ12 లేదు.

– సిల్వియా కర్పగం, కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్

వ్యతిరేక ప్రచారం



రష్యా ఎప్పుడూ ఆఫ్రికా మీద దాడి చేయలేదు. చెప్పాలంటే, వలసవాదానికి వ్యతిరేకంగా ఆఫ్రికాతో నిలబడింది. ఆయుధాలు పంపింది. స్వాతంత్ర్య సమర యోధులకు శిక్షణ ఇచ్చింది. కానీ ఇప్పటి మీడియా ప్రచారం మమ్మల్ని రష్యాను ద్వేషించాలని కోరుతోంది.

– అడేమోలా, పాన్–ఆఫ్రికనిస్ట్

వీవీఐపీల జోరు



బీజేపీ పాలనలో వీవీఐపీ సంస్కృతి ఇండియాలో సజీవంగా ఉండటమే కాదు, ఇంకా పెరుగుతోంది. తన మొదటి పదవీ కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని తగ్గించడానికి నిజంగానే ప్రయత్నించారు. కానీ ఇప్పుడు చేతులు ఎత్తేశారు. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?

– ఫ్రాంకోయిస్ గౌటియర్, జర్నలిస్ట్

భవిష్యవాణి తెలీదు



నేను భవిష్యవాణిని చెప్పలేను, మార్మికుడిని కాను, ప్రవక్తను అంతకంటే కాను. టర్కీ మీడియాలో కొందరు సూచిస్తున్నట్టు, పెద్ద భూకంపాలకు కచ్చితమైన తేదీలు ఇవ్వను. నేను పరిశోధకుడిని. భూకంపాలకూ, గ్రహాల స్థితిగతులకూ ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేస్తున్నాను. దానికోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ రూపొందించాను.

– ఫ్రాంక్ హూగర్‌బీట్స్, నెదర్లాండ్స్ పరిశోధకుడు

ఆయనేం చేయాలి?



భూమి లేదు, బిల్డింగ్ లేదు, డాక్టర్ లేదు, ఎంబీబీఎస్ విద్యార్థి లేదు, రోగి కూడా లేదు. కానీ దర్భంగా (బిహార్) ఎయిమ్స్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాత్రం నియమితులయ్యారు. క్షేత్రస్థాయిలో ఏ పనీ చేయకుండా, కేవలం ఓటర్లను ఆకర్షించడానికి జిల్లా పట్టణాల్లో కొత్త ఎయిమ్స్‌లను రాజకీయ పోటీ కోసం ప్రకటించిన ఫలితం ఇది.

– జ్యోతి యాదవ్, జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.నవమి రా.2.43 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** అనూరాధ రా.9.36 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.2.58 నుండి 4.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.47 నుండి 9.33 వరకు, **అమృతఘడియలు:** ప.11.29 నుండి 1.02వరకు.

సూర్యోదయం : 6.32
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సారాంశం

సరికొండ చలపతి

అ – అమ్మ, ఆ – ఆవు

నేడు ఆవు కథ చెప్పుకునే సందర్భం..

..కానీ ముందు గాడిద కథతో మొదలు పెడదాం.

ఓ ఊర్లో ఒక రైతు, ఆయనకొక గాడిద ఉంది. అది బరువు పనులలో ఆయనకు సాయం చేస్తుంటుంది. రోజంతా దానితో పని చేయించుకుని సాయంత్రం ఓ చెట్టు కింద కట్టేస్తుంటాడు. ఆ చెట్టు పైనుంచి ఈ తతంగాన్ని చూస్తున్న దెయ్యం ఓ రోజు గాడిద కట్టు విప్పేసింది.

దానితో, గాడిద ఒళ్లు విరుచుకుని బయటకి పరిగెత్తి పక్కనే ఉన్న పొలంపై పడింది. దొరికిందల్లా తినేసింది. అక్కడే ఉన్న పొరుగు రైతు భార్య కోపంతో కర్ర పట్టుకుని గట్టిగా కొట్టడంతో గాడిద నెత్తిపై తాకి.. గట్టిగా ఓండ్ర పెడుతూ చనిపోయింది. దాని కేక విని బయటికి వచ్చిన గాడిద యజమాని పొరుగు రైతు భార్యను తిడుతూ ఆమె పైకి పెద్దరాయి విసిరాడు.. అది ఆమె ఆయువు పట్టుపై తాకి ఆమె మరణించింది. దాంతో సీన్ మరింత సీరియస్ అయ్యింది. విషయం తెలిసిన ఆమె భర్త అక్కడికి చేరుకుని కోపంతో, దుఃఖంతో చేతిలో ఉన్న గునపంతో గాడిద యజమానిని ఒక్క పోటు పొడిచాడు.. దానితో ఆయన కూడా హరీమన్నాడు. పరిస్థితి ముదిరింది. విషయం ఊరంతా పాకింది.

గాడిద యజమాని కొడుకులు అక్కడికి చేరుకున్నారు, అప్పటికే గాడిద యజమాని భార్య అగ్గి మీద గుగ్గిలం అవుతోంది. ఆమె కొడుకులతో కలిసి పొరుగింటి రైతు ఇంటిని తగుల బెట్టేశారు.

ఇదంతా చూసిన పొరుగు రైతు ఆగ్రహం పట్టలేక గాడిద యజమాని, కొడుకులపై దాడి చేసి వారిని చంపినంత పని చేసి చెట్టుకింద కూచుంటాడు. అంతా కోల్పోయిన దుఃఖంతో ఉన్న ఆయన ఆ చెట్టు పైన చిద్విలాసంగా నవ్వుతున్న దెయ్యాన్ని చూసి , దీనంతటికి అసలు కారణం అదే అని గ్రహించాడు.

'.. ఎంత పని చేశావు , మేం నీకేం అపకారం చేశాం. నువ్వు ఇక్కడుంటున్నావని తెల్సీ మేమెవ్వరం నీ జోలికి రాలేదు.. ఇంత విధ్వంసానికి కారణమయ్యా ఎలా నవ్వుతున్నావ్.. ' అని దుఃఖంతో, కోపంతో ప్రశ్నించాడు.

దెయ్యం చెప్పిన సమాధానం ఏమిటనేది తర్వాత.. ఇప్పుడు ఆవు వ్యాసం చూద్దాం.

కల్చరల్ యాంగిల్..

అ – అమ్మ, ఆ – ఆవు.. మనం ఓనమాల నుంచే నేర్చుకున్నది. ఇవి కేవలం ఓనమాలు మాత్రమే కావు.. మన సంస్కృతి అమ్మ తర్వాత ఆవుకు ఇచ్చిన స్థానం అది.

ఇంతకీ విషయం ఏమిటంటే, వాలెంటైన్స్ డే –ఫిబ్రవరి 14 న 'కౌ హగ్ డే'గా జరుపుకోవాలని ఆ రోజు ఆవును కౌగిలించుకోవాలని కేంద్ర పశుసంరక్షక బోర్డు (ఏడబ్ల్యూబీఐ) ప్రకటన జారీ చేసింది,. ఇది స్వచ్ఛందమేనని చెప్పిందనుకోండి. గోవు భారత సంస్కృతికి , గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అనీ, ఆవును కౌగిలించుకుంటే పాజిటివ్ ఎనర్జీ వస్తుందనీ వివరించింది. ఆ మరుసటి రోజే కేంద్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాలా ఈ నిర్ణయాన్ని సమర్థించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల మంత్రులు ఈ నిర్ణయాన్ని ఆహ్వానించారు. ఈ ప్రకటనకు వ్యతిరేకంగా సోషల్‌మీడియాలో మోత మోగింది, మీమ్‌ల వర్షం కురిసింది. రాజకీయవర్గాల్లో కూడా సర్వత్రా విమర్శలు రావడంతో ఆ ప్రకటనను ప్రభుత్వం వెనక్కు తీసుకుంది.

'సోషల్' రెస్పాన్స్...

అయితే ఈ ప్రకటన జారీ, విత్ డ్రా వెనుక అందరిలో అనుమానాలు కనిపించాయి. ఆవును గౌరవించడం, ప్రేమించడం పట్ల ఎవరికీ అభ్యంతరాలు లేవు కానీ, ఈ ప్రకటన వెనుక సాంస్కృతిక, ఆరోగ్య కారణాల కన్నా రాజకీయ అంశాలే ఎక్కువగా ఊహించారు.

- "మదర్స్‌డే, ఫాదర్స్‌డే, లవర్స్‌డే.. లాంటి పాశ్చాత్య సంస్కృతి వద్దు అనుకుంటే వాటిపై చిన్నప్పటి నుంచి పిల్లల్ని సెన్సిటైజ్ చేద్దాం. కౌ హగ్‌డే లాంటి ప్రయత్నాలు మరో ఉన్మాదానికి దారి తీస్తాయి...'
- 'ఇప్పటికే మన దేశంలో ఆవు చుట్టూ ఎన్ని కాంట్రవర్సీస్ డెవలప్ అవుతున్నాయో చూస్తున్నాం కదా.. ఇప్పుడిలాంటి ప్రయత్నాలు వాటికి మరింత ఆజ్యం పోస్తాయి..'
- 'నేను పెట్ లవర్ని, మీరు అన్నట్లుగా కొను హగ్ చేసుకుని సోషల్ మీడియాలో పోస్టు చేస్తా.. మీరన్నట్టుగా ప్రకృతిని, ఆవునూ ప్రేమిస్తా.. ఈ విషయాన్ని ఇంత కన్నా దూరం తీసుకువెళ్లే ప్రయత్నం మాత్రం చెయ్యవద్దు.. మేం గమనిస్తూనే ఉంటాం..'



హెల్త్ యాంగిల్....

విదేశాల్లో ఇప్పటికే ఈ ట్రెండ్ ఉంది. పెట్స్‌ను గానీ, ఆవును గానీ మనం హగ్ చేసుకుంటే ఆక్సిటోసిన్ విడుదలై ఒత్తిడి తగ్గుతుంది. వ్యాయామం, మెడిటేషన్, యోగా, మ్యూజిక్ వినడం లాంటిదే ఈ హగ్ థెరపీ కూడా! అమెరికా, నెదర్లాండ్స్ లాంటి దేశాల్లో ఈ పద్ధతి చాలా కాలంగా ఉంది. గోవులతో కూడిన ఫామ్‌లలో వెల్‌నెస్ సెంటర్‌లు కూడా అక్కడ ఉన్నాయి. ఈ ఫామ్‌లో కుందేళ్లు, రకరకాల పెట్స్ కూడా ఉంటుంటాయి,

పొలిటికల్ యాంగిల్...

కానీ, ఇండియాలో గోవు చుట్టూ ఎన్ని సున్నితాంశాలు, మతపర విషయాలు నెలకొని ఉన్నాయో మనకు తెలుసు. పశుసంరక్షక బోర్డు నుంచి ప్రకటన వెలువడగానే సోషల్ మీడియాలో ఈ కామెంట్స్ వినిపించాయి

- 'బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారం మొదలయ్యిందన్న మాట..'
- " రాజకీయాలెంతైనా చేసుకోండి. ఎవరి దారి వారిది .. మనం ఎంతగానో ఇష్టపడే, గౌరవించే భారతీయ సంస్కృతిని రాజకీయ వీధుల్లో నిలబెట్టి, ఎన్నికల సరుకుగా మార్చితే సమంజసం కాదు.'

ఓ నెటిజెన్ ఇంకాస్త అడుగు ముందుకు వేసి ఇలా అంటున్నారు

'ప్రపంచవ్యాప్తంగా కొంత కాలంగా దేశ సంస్కృతి, మతపర జాతీయవాదం ఎన్నికలలో కనిపిస్తున్నాయి. టర్కీ, లాటిన్ అమెరికా, పశ్చిమ యూరప్, ఒకనాడు సోవియట్ యూనియన్‌లో భాగంగా ఉన్న దేశాలలో దీని ప్రభావం బాగా కనిపిస్తోంది. భిన్న మతాలు , భిన్న సంస్కృతులు ఉన్న భారతదేశంలో ఇలాంటి పోకడలను మేధావులు నిశితంగా పరిశీలించి ఎప్పటికప్పుడు ప్రజలను అలర్ట్ చేయాల్సి ఉంది...'

ఇక దెయ్యం సమాధానం

నవ్వుతూనే దెయ్యం ఇలా జవాబు చెప్పింది

'.. నేనేం తప్పు చేశాను! చాలా కాలంగా గాడిదతో పనిచేయించుకుని కట్టిపడేస్తున్నారు. పెద్ద మనసుతో గాడిద కట్టువిప్పి దానికి సాయం చేశాను. నేను గాడిదను చంపానా, నీ భార్యను చంపానా, లేక నీ ఇల్లు తగులబెట్టానా, గాడిద యజమానిని చంపానా, వారి భార్యాపిల్లలను చితక్కొట్టానా..? .. చేసుకుందంతా మీరే. పైగా నన్నంటారేమిటీ..' – అని ఎదురు ప్రశ్నించింది.

ఇంకొంచెం చిద్విలాసంగా... 'నేను ఒక్క గాడిద కట్లు విప్పినందుకే ఇలా కొట్టుకు చచ్చారు. గోవులాంటి అనేక సున్నితాంశాలను మీ మధ్యకు వదిలే ప్రయత్నం చేస్తున్నారు. అదెటు దారితీస్తుందో మీకు అర్థం అవుతోంది కదా?...' అని మాయమయ్యింది.

....

కేంద్ర పశుసంరక్షక బోర్డు కౌ హగ్‌పై ప్రకటన జారీ చేశాక, ఆ వార్త వెలువరించిన వీడియోల కింద మెసేజ్‌లు, సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయిన మీమ్స్ చూడండి..

కత్తులు నూరుతున్న శబ్దం వినిపిస్తుంది.

సున్నితాంశాలు కట్లు తెంపుకుని వచ్చినా, ఎవరైనా కట్లు తెంపి పంపినా ఈ కత్తులకు మరింత పదును పెరిగే ప్రమాదం ఉంది.

నా ఇంటి తలుపులు తెరిచే ఉంచా...



ఎవరైనా నీ హృదయాన్ని పగులగొట్టినపుడు
ఎవరైనా నిన్ను ఒంటరిగా వదిలేసినపుడు
ప్రియా నేను నీకు ఆహ్వానం పలుకుతాను
నా ఇంటి తలుపులు తెరిచి ఉంచా నీ కోసమే
ఎపుడు తెరిచే ఉంటాయి నీ కోసమే

ఇపుడు నా అవసరం లేదు నీకు
ప్రేమించేవారు ఎందరో నీకు
అందమైన ప్రవాహం నువ్వు
కావాలని కోరుకుంటే నువ్వు
వికసించవా ఎన్నో కలువలు

అద్దంలో నీ నీడ భయపెడితే
నీ యవ్వనం వసివాడుతుంటే
ప్రియా నేను నీకు ఆహ్వానం పలుకుతాను
నీకు నేను ఎపుడు అభివాదం చేస్తూనే ఉంటాను

ప్రేమకు షరతులు ఉండవు
నీ ప్రేమ షరతులతో నిండింది
నీ చూపులో నక్షత్రాలవెలుగు నిండింది
నీ దృష్టిలో నువ్వు పడిపోయినపుడు
నీ అంధకారంలో నువ్వే కూరుకున్నపుడు
ప్రియా నేను నీకు ఆహ్వానం పలుకుతాను
నేను దీపాలు వెలిగించి ఉంచాను నీ కోసమే

– అరుణ డేనియల్



"నడత హుందాగా ఉండాలి..నడకలో హొయలొలకాలి..రంగు మెరిపించాలి.. పొంగు భళా అనిపించాలి.." ఇవి గ్లామర్ కాంటెస్ట్‌లో పోటీపడే బ్యూటీలకు కావాల్సిన అర్హతలని చదువుతుంటేనే అర్థమైపోతుంది. అయితే ఆ అందం గంప కింద నుంచి రావాలి అనే కొత్త రూల్ చదివితే మాత్రం మైండ్ బ్లాంకైపోతుంది. అవును.. ఆ గంప కింద ఉన్న కోడి ఇప్పుడు అందాల ర్యాంప్‌పైన కూస్తోంది. తోటి కోళ్లతో పోటీపడి మరీ వయ్యారాలొలకబోస్తోంది. అందాల కోడి కిరీటం కోసం 'సై' అంటోంది. కోడేమిటి? అందాల పోటీలేమిటి? సమాధానమే ఈ కథనం..ఎన్నో ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుందామా మరి..



కొక్కొరొకో.. ఎంత సొగసో...

ఒంగోలు డెస్క్

అందాల పోటీలకు సై అంటున్న కోడిపుంజులు

- పోటీల కోసం రెండేళ్లపాటు ప్రత్యేకంగా పెంపకం
- బలమైన ఆహారంతో బాడీబిల్డర్‌లాంటి దేహ దారుఢ్యం
- తమిళనాడు, కేరళకే పరిమితమైన పోటీలు మన రాష్ట్రంలోనూ..



కొమరోలు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ బాష ..పక్షి ప్రేమికుడు. ఇతని వద్ద రకరకాల పక్షులతోపాటు వివిధ రకాల కోడి పుంజులు, పెట్టలు ఉన్నాయి. ప్రత్యేకంగా కనిపిస్తున్న పుంజుల గురించి అడగగా.. ఇవి అందాల పోటీల కోళ్లని చెప్పడంతో ఆశ్చర్యపోయాం.. వాటి గురించి తెలుసుకోవాలన్న కుతూహలం పెరిగింది. అందాల పోటీలా? ఎక్కడ జరుగుతున్నాయి..? ఏంటి ప్రత్యేకతలు అని ప్రశ్నించాం.. మనకు సంప్రదాయబద్ధంగా సంక్రాంతికి గోదారోళ్లు నిర్వహించే కోడి పందేల్లా..తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో దాదాపు 50 సంవత్సరాలుగా అందాల పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పాడు. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఈ పోటీలకు హాజరవుతున్నాం. ఈ సారి రాష్ట్రంలోని పెంపకందారులం అందరం కలసి అసోసియేషన్‌గా ఏర్పడ్డాం. అనంతపురం జిల్లాలో తొలిసారిగా సంక్రాంతికి కోడి అందాల పోటీలు నిర్వహించారని చెప్పాడు. తమిళనాడు, కేరళ, కర్నాటక, చత్తీస్‌ఘడ్, ఒడిసా, పాండిచ్చేరి తదితర రాష్ట్రాల వారు కూడా ఈ పోటీల్లో పాల్గొన్నారు. వయ్యారాలొలకబోసే కోడి పుంజుల ప్రత్యేకతలు తెలుసుకుందాం..

ఆహార్యం.. అద్భుతం

ఈ పోటీల్లో పాల్గొనే పుంజులు ప్రత్యేక ఆహార్యాన్ని కలిగి ఉండాలి. తల నుంచి బాడీ, తోక, కాళ్ల వరకూ అన్నీ విభిన్నంగా ఉండాల్సిందే. మెడ నిటారుగా 90 డిగ్రీలో బాడీ ఉండాలి. తెల్ల కళ్లు బెస్ట్ క్వాలిటీ..తలపై భాగం జుట్టు ఎర్రగా ఉండి గుండ్రంగా గులాబి రేకుల్లా ముద్దగా పువ్వు అతికించినట్టుగా ఉండాలి. బాడీ దృఢంగా ఉండి కాళ్లు..కాళ్ల మధ్య ఎడం ఉండాలి. బాడీ బిల్డర్ ఎలా నడుస్తాడో అలా నడకలో స్టైల్ ఉండాలి. కాళ్ల వేళ్లు పొడవుగా చక్కగా ఉండాలి. తోక అందంగా ఉండి ఈకలు దుబ్బుగా ఉండాలి. తెలుపు, రెడ్, బ్లాక్ కిరీ ఇలా కోడి మొత్తం ఫ్యాన్సీ కలర్‌లో ఉంటే అందరూ ఇష్టపడతారు.

పౌష్టికాహారం...

ఈ పోటీలకు సిద్ధం చేసే పుంజులకు ఆహారం ప్రత్యేకంగా ఉంటుంది. జొన్నలు, రాగులు, గోధుమలు, సజ్జలు, మొక్కజొన్న, పెసలు, గుడ్లు, ఖర్జూరం, పిస్తా, బాదం, జీడిపప్పు, పండ్లు తినిపిస్తారు. రోజూ మూడు విడతలుగా ఆహారం ఇస్తారు. అరటి, ద్రాక్ష, దానిమ్మ, సమ్మర్‌లో వేడి తగ్గించేందుకు పుచ్చకాయ పెడతారు. ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది వరకూ కొలత ప్రకారం జొన్నలు, రాగులు, సజ్జ, మొక్కజొన్న, పెసలు, గోధుమలు ఇస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు కోడి గుడ్లు, నానబెట్టిన డ్రై ఫ్రూట్స్ తినిపిస్తారు. ఆహారం సులభంగా జీర్ణం అయ్యేందుకు అరటి, దానిమ్మ, ద్రాక్ష పండ్లు ఇస్తారు. ఇలా క్రమం తప్పకుండా ఆహారం ఇవ్వడంతో శరీరం బలిష్టంగా ఉంటుంది. అందాల పోటీలకు ఒక కోడిని తయారు చేసేందుకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చవుతుంది. చిన్నప్పటి నుంచి మంచి ఆహారాన్ని ఇస్తే ఎదుగుదల బాగుంటుంది.

ఎంపిక ఇలా..

అందాల పోటీల ఎంపిక ఇలా ఉంటుంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన కోళ్లను ముందుగా నిర్వాహకులు పరిశీలిస్తారు. అర్హమైన వాటిని గుర్తిస్తారు. వాటికి నంబర్‌తో కూడిన ట్యాగ్‌లు ఇస్తారు. ఐదుగురు న్యాయనిర్ణేతలు ఉంటారు. అందులో ప్రభుత్వాధికారులు (పశుసంవర్ధకశాఖకు చెందిన) కూడా ఉంటారు. మధ్యలో ఒక టేబుల్ ఏర్పాటు చేస్తారు. నంబర్ ప్రకారం పిలుస్తారు. టేబుల్‌పై ఉంచిన పుంజును జడ్జిలు పరిశీలించి మార్కులు ఇస్తారు. ఒకరు ముక్కు నుంచి మెడ వరకూ ఎంత దూరం ఉంది అని పరిశీలిస్తారు. మరొకరు బాడీ స్టైల్, రంగు, కాళ్లు, కళ్లు ఇలా అన్నీ పరిశీలిస్తారు. ఈ ఐదుగురు ఇచ్చిన మార్కులను కలుపుతారు. అందులో ఎక్కువ మార్కులు వచ్చిన పుంజును విజేతగా ప్రకటిస్తారు.



పోటీకి సిద్ధమైన తెల్ల పుంజు





క్రాస్ బ్రీడింగ్..

తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఉండే బ్రీడర్ దగ్గర నుంచి బ్రీడ్ తెచ్చుకుంటారు. ఇక్కడ పెట్టలతో క్రాస్ బ్రీడ్ చేస్తారు. అలా వచ్చిన పుంజులను రెండేళ్లపాటు పెంచుతారు. వీటి గుడ్లు కూడా చాలా విలువైంది. నాణ్యతను బట్టి రేటు ఉంటుంది. మన జిల్లాలో రూ.1000 ఉంటుంది. తమిళనాడులో అయితే రూ.5 వేల వరకూ ఉంటుంది. చిన్న చిన్న పిల్లలను ఆసక్తి ఉన్నవారికి విక్రయిస్తుంటారు.



ప్రత్యేక శిక్షణ:

పుంజులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. పోటీలకు మూడు నెలల నుంచి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ శిక్షణ ఇస్తారు. బెదురు పోయేందుకు బాడీని నిమురుతారు. అలాగే నీళ్లతో తడుపుతారు. ఇసుకలో పొర్లిస్తారు. ఇలా చేయడం ద్వారా ఈక ఒత్తుగా ఉంటుంది. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ రెండేళ్లు పెంచుతారు. పోటీలకు సిద్ధమయ్యే పుంజులు ఏడు నుంచి ఎనిమిది కేజీల బరువు ఉండేలా చూసుకుంటారు. డబుల్ బాడీ వచ్చేలా ఫీడింగ్ ఇస్తారు. గంభీరంగా బాడీబిల్డర్‌లా ఉంటుంది. కాళ్లు దృఢంగా, పాదాలు పెద్ద పెద్దగా ఉండేలా చూసుకుంటారు. వీటిని ఎక్కువగా అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో పెంచుతారు.



ఆసక్తితోపాటు ఆదాయం..

చిన్నప్పటి నుంచి పక్షులను పెంచడం హాబీగా ఉండేది. తమిళనాడులో అందాల పోటీలు నిర్వహిస్తున్నారని మిత్రుడు చెప్పాడు. ఒకసారి వెళ్లి చూసి వచ్చిన తర్వాత కోడి పుంజులను పెంచాలన్న ఆసక్తి నెలకొంది. మంచి బ్రీడ్‌లను తీసుకొచ్చాను. అలా పుంజులను పోటీలకు సిద్ధం చేస్తున్నా. అనంతపురంలో తొలిసారిగా నిర్వహించిన పోటీలకు పుంజును తీసుకువెళ్లా. ఈ పోటీల్లో నాలుగో స్థానం వచ్చింది. వీటిని పెంచి ఆసక్తి ఉన్నవారికి విక్రయించడం ద్వారా ఉపాధి కూడా ఉంటోంది.

– సయ్యద్ బాష, రాజుపాలెం, కొమరోలు మండలం

పాఠశాల భవనాన్ని కూల్చేసిన టీడీపీ నేత

- రూ.30 లక్షలు విలువ చేసే స్థలంపై కన్ను.. అడ్డొచ్చిన స్థానికులపై దౌర్జన్యం
- విశాఖ 4వ వార్డులో ఘటన పోలీసులకు ఎంఈవో ఫిర్యాదు

కొమ్మాది: రూ.30 లక్షలు విలువ చేసే పాఠశాల స్థలంపై కన్నేసిన ఓ టీడీపీ నేత.. అందులో ఉన్న స్కూల్ భవనాన్ని జేసీబీలతో నేలమట్టం చేయించాడు. స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారిపై దౌర్జన్యానికి దిగాడు. ఈ దారుణం ఆదివారం అర్ధరాత్రి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో నాలుగో వార్డులో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ రెవెన్యూ పాతపరదేశిపాలెంలో మండల ప్రాథమిక పాఠశాల ఉంది. ఇది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. అప్పట్లో ఈ ప్రాంతంలో కమ్మలపాకలో పాఠశాలను నిర్వహించేవారు. అది ప్రమాదవశాత్తు కాలిపోయింది. దీంతో స్థానికుడు మద్దుల బుచ్చిరాజు 1988లో పాఠశాల నిమిత్తం 200 గజాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. 1989లో పాఠశాల భవనం నిర్మించి అందులో తరగతులు ప్రారంభించారు. కాలక్రమేణా విద్యార్థుల సంఖ్య పెరగడం, భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వేరే చోటుకు పాఠశాలను తరలించారు. సుమారు పదేళ్ల నుంచి ఈ భవనం ఖాళీగా ఉంది. స్థానికులు దీన్ని ఒక సామాజిక భవనంగా ఉపయోగించుకుంటున్నారు. వివిధ దేవుళ్ల మాలలు వేసుకునే టప్పుడు పీఠాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ స్థలం విలువ రూ.30 లక్షలు ఉంది. దీంతో ఇదే ప్రాంతానికి చెందిన టీడీపీ నేత పట్నాల మరిడయ్యరెడ్డి కన్ను దీనిపై పడింది. అందులోనూ అతడు రియల్టర్ కూడా కావడంతో దాన్ని ఎలాగైనా కబ్జా చేయాలనుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేసి.. రెండు జేసీబీలతో భవనాన్ని పూర్తిగా నేలమట్టం చేయించాడు. స్థానికులు అడ్డుకోవడంతో వారిపై టీడీపీ నేత పట్నాల మరిడయ్య రెడ్డి దౌర్జన్యానికి దిగాడు. స్థానికుల ఫిర్యాదుతో సోమవారం ఉదయం తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈవో కె.బాలామణి, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ కొండబాబు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ భవనం ప్రస్తుతం మండల పరిషత్ ఆధీనంలో ఉందని తహసీల్దార్ తెలిపారు. రాత్రి సమయంలో భవనాన్ని కూల్చివేసిన టీడీపీ నేత మరిడయ్యరెడ్డిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఘటనపై పోలీసులకు ఎంఈవో ఫిర్యాదు చేశారు.

పెళ్లిరోజే వరుడి రక్తదానం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పట్టణానికి చెందిన వరుడు సూర్యతేజ తన పెళ్లి రోజే రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. సోమవారం స్థానిక రాజారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బ్లడ్ మోటివేటర్ బాపూజీనాయక్ ఆధ్వర్యంలో శుభ కార్యానికి వచ్చిన బంధువులు, మిత్రులతో కలసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వరుడు మాట్లాడుతూ గతంలో 15 సార్లు రక్తదానం చేశానని, రక్తదానం వల్ల పలువురి ప్రాణాలను కాపాడిన వారమవుతామని అన్నారు. పెళ్లికి వచ్చిన వారిలో పదిమందికి పైగా రక్తదానం చేశారు.

ప్రింట్ కాపీలను జాతీయ గ్రంథాలయానికి పంపించాలి

సాక్షి, అమరావతి: రచయితలు, ప్రచురణకర్తలు తమ ముద్రించిన కాపీల్లో ఒక ప్రింట్ కాపీని తప్పనిసరిగా జాతీయ గ్రంథాలయానికి అందించాలని ప్రధాన గ్రంథాలయ, సమాచార అధికారి శివప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ది డెలివరీ ఆఫ్ బుక్స్ చట్టం–1954', సవరణ చట్టం 'ది డెలివరీ ఆఫ్ బుక్స్ అండ్ న్యూస్ పేపర్స్ (పబ్లిక్ లైబ్రరీస్)–1956' ప్రకారం ప్రతి ప్రచురణకు చెందిన ఒక కాపీని జాతీయ గ్రంథాలయానికి సమర్పించాల్సి ఉందని పేర్కొన్నారు. చాలా మంది రచయితలు, ప్రచురణకర్తలు దీనిని పాటించట్లేదని తెలిపారు. ఈ క్రమంలో విజయవాడలో నిర్వహిస్తున్న 33వ జాతీయ పుస్తక మహోత్సవంలో జాతీయ గ్రంథాలయం ప్రత్యేకంగా 'పుస్తకాల సేకరణ కేంద్రం' ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఇందులో 20వ తేదీ వరకు రచయితలు, ప్రచురణ కర్తలు తమ ముద్రణ కాపీలను అందించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో పోస్టు ద్వారా కలకత్తాలోని జాతీయ గ్రంథాలయం తెలుగు విభాగానికి పంపించాలని కోరారు.

విజయవాడ–ధర్మవరం రైలు మచిలీపట్నం వరకు పొడిగింపు

చిలకలపూడి (మచిలీపట్నం): విజయవాడ– ధర్మవరం రైలు మచిలీపట్నం వరకు పొడిగించినట్లు బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను గతంలో రైల్వేశాఖ మంత్రిని కలిసి ఈ విషయమై విజ్ఞప్తి చేశానని, దీనికి ఆయన అంగీకరించి ఈ రైలు మచిలీపట్నం వరకు పొడిగింపునకు ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా విజయవాడ రైల్వేస్టేషన్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. మచిలీపట్నంలో సాయంత్రం 7.40 నిమిషాలకు ఈ రైలు బయలు దేరి విజయవాడ – గుంటూరు, వినుకొండ – గిద్దలూరు– నంద్యాల – ప్రొద్దుటూరు – తాడిపత్రి – అనంతపురం మీదుగా ధర్మవరం చేరుకుంటుందని పేర్కొన్నారు. అడిగిన వెంటనే మచిలీపట్నం వరకు రైలును పొడిగించినందుకు రైల్వేశాఖ మంత్రి, అధికారులకు ఎంపీ బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు.

రామలింగేశ్వరుని సేవలో హైకోర్టు సీజే



సీజే ప్రశాంత్‌కుమార్‌మిశ్రాకు ఆలయ ఫొటోను బహూకరిస్తున్న అర్చకుడు సాగర్, ఈవో గంగాధరరావు.

పెనమలూరు: కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానాన్ని సోమవారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్‌కుమార్ మిశ్రా సందర్శించారు. ఆయన ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్, కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు ప్రధాన న్యాయమూర్తిని శేషవస్త్రాలతో సత్కరించి ఆలయ ఫొటోను బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కొత్తపేటలో 22 అడుగుల పోతన కాంస్య విగ్రహం

- వుడయార్ శిల్పశాలలో తయారు చేయనున్న శిల్పి రాజ్‌కుమార్
- నమూనా విగ్రహాన్ని పరిశీలించిన కాకతీయ హెరిటేజ్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ పాండురంగారావు



కొత్తపేటలో పోతన నమూనా విగ్రహాన్ని పరిశీలిస్తున్న కాకతీయ ట్రస్టీ పాండురంగారావు

కొత్తపేట: శ్రీమద్భాగవతం తెలుగు అనువాదకుడు, కవి బమ్మెర పోతనామాత్యుని 22 అడుగుల కాంస్య విగ్రహం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో తయారవుతోంది. వుడయార్ శిల్పశాలలో 'కూర్చుని తాళపత్రాలపై ఘంటంతో రచిస్తున్న' పోతన నమూనా విగ్రహానికి ప్రముఖ అంతర్జాతీయ శిల్పి రాజ్‌కుమార్ వుడయార్ తుది మెరుగులు దిద్దుతున్నారు. అయోధ్య రామజన్మ భూమి టెంపుల్ ఫౌండేషన్స్ రీ డిజైనర్, రామప్ప టెంపుల్ ప్రపంచ వారసత్వ సంపద కింద గుర్తింపు తీసుకువచ్చిన ప్రొఫెసర్ పాండురంగారావు కాకతీయ ట్రస్ట్–తెలంగాణ ప్రభుత్వం తరఫున సోమవారం వుడయార్ శిల్పశాలను సందర్శించారు. పోతన విగ్రహాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ, శిల్పికి స్వల్ప మార్పులను సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోతన జన్మస్థలం తెలంగాణ రాష్ట్రం జనగామ జిల్లా బమ్మెర గ్రామంలో 4.75 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.16 కోట్ల వ్యయంతో పోతన స్మృతివనం నిర్మిస్తున్నట్టు తెలిపారు. అక్కడ ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించి, మే నెలలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు చెప్పారు.

ఇప్పటికీ రాయితీ ఎందుకు ఇవ్వడం లేదు?

- రైళ్లలో వృద్ధులకు రాయితీ పునరుద్ధరణపై కౌంటర్ వేయండి
- కేంద్రానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: కరోనా ఉధృతి తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైళ్లలో వృద్ధులకు రాయితీని ఎందుకు పునరుద్ధరించడం లేదో తెలియచేయాలని హైకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రైల్వేశాఖ కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రైళ్లు, ఆర్టీసీ బస్సు చార్జీల్లో వృద్ధులకు గతంలో ఇస్తూ వచ్చిన రాయితీని కోవిడ్ సమయంలో రద్దు చేశారని, ఆ తరువాత దానిని పునరుద్ధరించలేదని, ఈ విషయంలో అధికారులకు తగిన ఆదేశాలు ఇవ్వాలంటూ శ్రీకాకుళంకు చెందిన జీఎస్ కుమార్ గత ఏడాది హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సోమవారం సీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎస్.హరినాథ్ కౌంటర్ దాఖలుకు కొంత గడువు కోరారు.

విజయవాడలో పోలీసులే ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నారు

- హైకోర్టులో న్యాయవాది పిల్

సాక్షి, అమరావతి: విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాల్సిన పోలీసులే అడ్డదిడ్డంగా బారికేడ్లు, పోలీస్ బూత్‌లు ఏర్పాటు చేస్తూ సమస్యలను సృష్టిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా పలు వ్యాపార సంస్థలు భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదంటూ న్యాయవాది కొల్లి జయశ్రీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. ఇందులో ప్రతివాదులుగా ఉన్న హోంశాఖ ముఖ్య కార్యదర్శి, రహదారులు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి, విజయవాడ పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వీరిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ వక్కలగడ్డ రాధా కృష్ణ కృపాసాగర్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేశారు.

కొల్లేరు సమస్యపై సీఎంను కలుస్తా

- సీఎంను కలిసిన తర్వాత రాజకీయ నిర్ణయం తీసుకుంటా
- కైకలూరు టీడీపీలో ఐదుగురిని బరిలో ఉంచారు
- ఇది సరైన పద్ధతి కాదు
- టీడీపీ కైకలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జయమంగళ వెంకటరమణ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కొల్లేరు ప్రాంత సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పిస్తానని తెలుగుదేశం పార్టీ ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జయమంగళ వెంకటరమణ చెప్పారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. కొల్లేరు మూడో కాంటూరు వరకు కుదింపు, ఆక్వాజోన్ పరిధిలో మరిన్ని చెరువులు చేర్చటం, ఈబీసీలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందించడం తదితర అంశాలతో ముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తానని, ఆయన స్పందనను బట్టి రాజకీయ నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలో టీడీపీలో ఐదుగురిని బరిలో నిలిపి వారితో పనిచేయిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని చెప్పారు. వైఎస్సార్ హయాంలో అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందే 250 నియోజకవర్గాలకు అభ్యర్థులను నిర్ణయించారని, అది సరైన విధానమని తెలిపారు. నియోజకవర్గంలో ఐదుగురు నాయకులు ఉండటం వల్ల చివర్లో ఒకరికి టికెట్ వస్తే మిగిలినవారు వెన్నుపోటుదారులుగా మారుతున్నారని విమర్శించారు. 1999 నుంచి తెలుగుదేశం పార్టీలో సేవ చేస్తున్నానని, ఈ క్రమంలో అనేక సమస్యలు ఎదుర్కొన్నానని వివరించారు. ఓ పౌరుడిగా ముఖ్యమంత్రిని కలిసే హక్కు ఉంటుందని, తాను గతంలో నలుగురు సీఎంలను కలిసి కొల్లేరు సమస్యలను విన్నవిస్తే అందరూ సానుకూలంగా స్పందించారని చెప్పారు. తనపై ఇటీవల హత్యాయత్నం జరిగితే రక్షణ కావాలని ప్రభుత్వానికి లేఖ రాశానని, అందుకే గన్‌మెన్‌ను కేటాయించారని ఆయన తెలిపారు.

నేడు ధ్యాన బుద్ధ వనం ప్రారంభం

- హాజరుకానున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అమరావతి: ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన అమరావతిలో సుమారు రూ.15 కోట్లతో నిర్మించిన ధ్యాన బుద్ధ వనాన్ని కేంద్ర పర్యాటక శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం ప్రారంభిస్తారని పర్యాటక శాఖ ఈఈ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రి ఉదయం అమరేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని, తర్వాత ధ్యాన బుద్ధ వనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం అమరావతిలోని భారత పురావస్తు ప్రదర్శనశాలను సందర్శించి అక్కడ బౌద్ధ మత విశిష్టతను తెలుసుకుంటారని తెలిపారు.

హైకోర్టులో ఉద్యోగాల పరీక్షల ఫలితాలు 23లోపు విడుదల

సాక్షి, అమరావతి: హైకోర్టులో సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, కంప్యూటర్ ఆపరేటర్, ఓవర్సీర్, అసిస్టెంట్, ఎగ్జామినర్, టైపిస్ట్, కాపీయిస్ట్, అసిస్టెంట్ ఓవర్సీర్, డ్రైవర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను ఈ నెల 23లోపు వెల్లడిస్తామని రిజిస్ట్రార్ (అడ్మిన్) ఎ.గిరిధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం ఈ నెల 13నే పరీక్షా ఫలితాలను వెల్లడించాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. హైకోర్టులో 241 పోస్టుల భర్తీకి గత ఏడాది అక్టోబర్ 21న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: యువగళం పాదయాత్రలో మృతి చెందిన కానిస్టేబుల్ రమేష్ కుటుంబానికి ఎస్పీ రిశాంత్‌రెడ్డి సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఐడీఆర్ ఫండ్ నుంచి రూ.1,00,000, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25,000, విడో ఫండ్ నుంచి రూ.50,000 చెక్కు రూపంలో తక్షణ సాయంగా రమేష్ సతీమణి ఎ.లతకు అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జగదీష్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయకుమార్ పాల్గొన్నారు.

వీసీగా బాధ్యతలు స్వీకరించిన బాబ్జీ

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ (వీసీ)గా డాక్టర్ కోరుకొండ బాబ్జీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాబ్జీని వీసీగా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన బాబ్జీకి రిజిస్ట్రార్ డాక్టర్ రాధిక రెడ్డి, సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు.



వీసీ బాబ్జీకి మొక్క అందజేస్తున్న రిజిస్ట్రార్ రాధిక రెడ్డి

క్లుప్తంగా...

ఏ చర్యలకైనా సిద్ధం!

చైనా నిఘా బెలూన్లపై సునాక్



లండన్: తమ దేశాన్ని భద్రంగా ఉంచేందుకు ఎటువంటి చర్యకైనా వెనుకాడబోమని బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్ అన్నారు. అట్లాంటిక్ మిత్ర దేశాలతో నిత్యం టచ్‌లో ఉంటూ, రక్షణపరంగా సన్నద్ధతతో ఉన్నట్లు ఆయన తెలిపారు. సోమవారం ఆయన ఉత్తర ఇంగ్లండ్‌లోని ఓ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశాన్ని సురక్షితంగా ఉంచేందుకు అవసరమైన ఎటువంటి చర్యలకైనా సిద్ధంగా ఉన్నామని ప్రజలు గ్రహించాలని కోరారు. తమ దేశ గగనతలాన్ని కాపాడుకునేందుకు టైఫూన్ యుద్ధ విమానాలను అప్రమత్తంగా ఉంచామన్నారు. అనుమానిత చైనా నిఘా బెలూన్లను అమెరికా సైన్యం కూల్చివేయడం, యూకేకు కూడా బెలూన్ల బెడద ఉందన్న వార్తలపై రిషి పై విధంగా స్పందించారు.

ఆకాంక్షలను నెరవేర్చండి

కొలీజియం సిఫార్సులపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీల నియామకం, బదిలీల విషయంలో కొలీజియం ఆకాంక్షలను(సిఫార్సులను) చాలావరకు నెరవేర్చాలని(ఆమోదించాలని) కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. కొలీజియం సిఫార్సులను ఆమోదించకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ దాఖలైన రెండు పిటిషన్లపై జస్టిస్ ఎస్‌కే కౌల్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. జడ్జీల నియామకానికి సంబంధించి కొన్ని అంశాల పట్ల తాము ఆందోళన చెందుతున్నట్లు ధర్మాసనం వ్యాఖ్యానించింది. విచారణకు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి హాజరు కాలేదు. కొలీజియం సిఫార్సులను చాలావరకు ఆమోదించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని అటార్నీ జనరల్‌కు తెలియజేయాలని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను మార్చి 2వ తేదీకి వాయిదా వేసింది.

మేమొస్తే త్రిపుర అభివృద్ధి: మోదీ

అగర్తల: బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల లబ్ధి పొందని కుటుంబం త్రిపురలో లేనే లేదని ప్రధాని మోదీ అన్నారు. ప్రశాంతత, అభివృద్ధి కావాలంటే బీజేపీకే ఓటేయాలని ప్రజలను కోరారు. అగర్తలాలో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. విశ్వాసపాత్రుడైన సేవకుని మాదిరిగా బీజేపీ త్రిపుర అభివృద్ధికి పనిచేస్తుందని చెప్పారు. కాంగ్రెస్, సీపీఎంలు అధికారంలోకి వస్తే రాష్ట్రం వెనుకబాటుకు గురవుతుందన్నారు.

ఎవరీ ప్రభాకరన్?



బతికే ఉన్నాడన్న ప్రకటనతో కలకలం

ప్రత్యేక తమిళ రాజ్యం కోసం శ్రీలంకలో నెత్తుటేర్లు

హతమార్చినట్టు 2009లోనే ప్రకటించిన లంక సైన్యం



వేలుపిళ్లై ప్రభాకరన్. తమిళులకు ఆరాధ్యుడు. శ్రీలంక ప్రభుత్వం దృష్టిలో రక్తపుటేర్లు పారించిన ఉగ్రవాది. భారత్ దృష్టిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని పొట్టన పెట్టుకున్న హంతకుడు. 2009లో శ్రీలంక సైన్యం దాడిలో హతమైనట్టు ప్రపంచమంతా నమ్ముతుండగా, ఆయన బతికే ఉన్నారంటూ తమిళ నేత నెడుమారన్ తాజాగా చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది...

పెద్దపులిగా పేరుబడ్డ ప్రభాకరన్‌ది ఆద్యంతం ఆసక్తికర ప్రస్థానం. శ్రీలంకలోని తమిళులకు ప్రత్యేక దేశం కావాలన్న ఆశయ సాధనకు మూడు దశాబ్దాలకు పైగా లంక సైన్యంపై సాయుధ పోరాటం సాగించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులకు ఆరాధ్య నాయకుడిగా కీర్తి పొందిన ప్రభాకరన్ 1954 నవంబర్ 26న శ్రీలంకలోని ఉత్తర తీర ప్రాంత పట్టణం వల్వెత్తితురైలో జన్మించారు. ఆయన తండ్రి ప్రభుత్వ అధికారిగా పనిచేశారు. స్థానిక సింహళీయులు, లంక సైనికుల అరాచకాలను కళ్లారా చూసిన ప్రభాకరన్ తట్టుకోలేకపోయారు. బడి మానేసి విప్లవోద్యమం వైపు అడుగులేశారు.

ఎల్టీటీఈ... 'త్రివిధ' ఉగ్ర సంస్థ!

ప్రభాకరన్ తొలుత తమిళుల ఆందోళన కార్యక్రమాలు, నిరసనల్లో పాల్గొన్నారు. నెమ్మదిగా తమిళ యువకులను చేరదీసి 1972లో 'తమిళ్ న్యూ టైగర్స్' పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేశారు. 1975లో దాని పేరును లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్టీటీఈ)గా మార్చారు. అప్పటినుంచి మూడు దశాబ్దాల పాటు ఎల్టీటీఈ పేరు ప్రపంచమంతటా మారుమోగింది. టైగర్స్, సీ టైగర్స్ (నావికాదళం), ఎయిర్ టైగర్స్ (వైమానిక దళం) పేరిట త్రివిధ దళాలున్న ఏకైక ఉగ్రవాద సంస్థగా ఎల్టీటీఈ చరిత్ర సృష్టించింది! అంతేగాక ఎల్టీటీఈలో ఆత్మాహుతి దళాలను, 'సైనేడ్ మరణాల'ను ప్రవేశపెట్టి ప్రభాకరన్ సంచలనం సృష్టించారు. తమిళులకు ప్రత్యేక దేశం కోసం లంక సైన్యంతో ఎల్టీటీఈ దళాలు ఏళ్ల తరబడి హోరాహోరీ తలపడ్డాయి. ఈ యుద్ధంలో లక్ష మందికి పైగా బలయ్యారు. బాధితుల్లో సింహళ జాతీయులతో పాటు తమిళులు కూడా ఉన్నారు. తమిళులు ముద్దుగా 'తంబి' అని పిలుచుకొనే ప్రభాకరన్ ఆయుధాలతో పాటు కొన్నిసార్లు దౌత్య మార్గాన్ని కూడా ప్రయత్నించి విఫలమయ్యారు. 1985లో భారత చొరవతో, 2002లో నార్వే మధ్యవర్తిగా శ్రీలంక ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. ఇంటర్‌పోల్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా పలు దర్యాప్తు సంస్థలు ప్రభాకరన్‌ను మోస్ట్ వాంటెడ్‌గా ప్రకటించాయి.

రాజీవ్ హత్య

ప్రముఖ నేతలను పాశవికంగా పొట్టన పెట్టుకున్న తీరు ఎల్టీటీఈ రక్తచరిత్రలో ఓ ప్రత్యేక అధ్యాయం. భారత ప్రధాని రాజీవ్‌గాంధీ శాంతి పరిరక్షణ పేరిట లంకకు భారత సైన్యాన్ని పంపడంతో ప్రభాకరన్ తీవ్రంగా మండిపడ్డారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబదూరులో మానవ బాంబు దాడితో ఆయనను బలి తీసుకున్నారు. అనంతరం 1993లో శ్రీలంక అధ్యక్షుడు రణసింఘె ప్రేమదాస కూడా ఎల్టీటీఈ ఆత్మాహుతి బాంబు దాడికి బలయ్యారు. అంతేగాక చంద్రికా కుమారతుంగ, మైత్రిపాల సిరిసేన సహా పలువురు లంక అధ్యక్షులను, ప్రధానులను హతమార్చేందుకు ఎల్టీటీఈ విఫలయత్నం చేసింది. ఇక దాని దాడుల్లో బలైన శ్రీలంక మంత్రులు, రాజకీయ నాయకులు, సైనిక ఉన్నతాధికారుల జాబితాకైతే అంతు లేదు!

వెంటాడి, వేటాడి...

దశాబ్దాలపాటు నెత్తుటేర్లు పారించిన ఎల్టీటీఈపై మహింద రాజపక్సె హయాంలో లంక సైన్యం ఉక్కుపాదం మోపింది. ముప్పేట దాడితో సంస్థను నిర్వీర్యం చేసింది. మిగిలిన కొద్దిమందీ చెల్లాచెదురయ్యారు. ప్రభాకరన్ కూడా మారుమూల ప్రాంతాల్లో తలదాచుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది! ఆయన కోసం సైన్యం కనీవినీ ఎరగని రీతిలో వేటకు దిగింది. చివరికి 2009 మే 18న శ్రీలంకలోని ముల్లైతీవులో హోరాహోరీ పోరాటంలో ప్రభాకరన్‌ను మట్టుబెట్టినట్టు ప్రకటించింది. మృతదేహం ఫొటోలను కూడా విడుదల చేసింది. దాడిలో అతని కుమారుడు బాలచంద్రన్ కూడా చనిపోయినట్టు పేర్కొంది.

కొడుకు, కూతురు సజీవమే?

ప్రభాకరన్ వ్యక్తిగత జీవితం గురించి బయటి ప్రపంచానికి పెద్దగా తెలియదు. 1984 అక్టోబర్ 1న చెన్నై సమీపంలోని తిరుపోరూర్‌లో మదివదనిని ఆయన పెళ్లి చేసుకున్నారు. వారికి కుమార్తె ద్వారక, కుమారులు చార్లెస్ ఆంథోనీ, బాలచంద్రన్ ఉన్నారు. బాలచంద్రన్ లంక సైనికుల చేతిలో మరణించగా మిగతా వారి ఆచూకీ తెలియదు. వారు లంకలో లేరని, విదేశాల్లో తలదాచుకుంటున్నారని తమిళులు నమ్ముతుంటారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ప్రభాకరన్ బతికే ఉన్నారు

- త్వరలోనే జనం ముందుకొస్తారు
- తమిళ జాతీయోద్యమ నేత నెడుమారన్

సాక్షి, చెన్నై/తంజావూర్: లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈళం(ఎల్టీటీఈ) అధినేత వేలుపిళ్లై ప్రభాకరన్ బతికే ఉన్నారని తమిళ జాతీయోద్యమ నేత పాళ నెడుమారన్ సంచలన ప్రకటన చేశారు. "ప్రభాకరన్ గురించి కొందరు పథకం ప్రకారం రేకెత్తించిన అనుమానాలకు నేను తెరదించుతున్నా. భార్యా కూతురితో సహా ప్రభాకరన్ క్షేమంగా ఉన్నారు. ఆయన జనం ముందుకు రావడానికి ఇప్పుడు పూర్తి అనుకూల వాతావరణముంది'' అని నెడుమారన్ సోమవారం తమిళనాడులో మీడియాకు వెల్లడించారు. "శ్రీలంకలో ఈళం తమిళుల పునఃప్రవేశంపై ప్రభాకరన్ త్వరలోనే ప్రకటన చేయబోతున్నారు. నేను చెప్పిందంతా వంద శాతం నిజమే'' అని ఉద్ఘాటించారు. ప్రభాకరన్ ఇప్పుడెక్కడ ఉన్నదీ మాత్రం ఇప్పుడే చెప్పనన్నారు. శ్రీలంకతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులంతా ఒక్కతాటిపైకి వచ్చి ప్రభాకరన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎల్టీటీఈ ఏనాడూ భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించలేదన్నారు. ప్రభాకరన్ బతికుంటే అంతకన్నా సంతోషకరమైన వార్త మరొకటి ఉండదని డీఎండీకే అధినేత వైగో, పలు పార్టీల నేతలన్నారు.

పెద్ద జోక్: శ్రీలంక

కొలంబో: ప్రభాకరన్ బతికే ఉన్నాడనడాన్ని పెద్ద జోక్‌గా శ్రీలంక రక్షణ శాఖ అధికార ప్రతినిధి నళిన్ హెరాత్ అభివర్ణించారు. "ప్రభాకరన్ 2009 మే 18న హతమయ్యాడు. ఇది డీఎన్‌ఏ పరీక్షలోనూ నిర్ధారణ అయింది'' అన్నారు.

ఆకాశంలో సగమైనా... నాగాలాండ్‌లో మాత్రం శూన్యం

అసెంబ్లీలో మహిళలకు ఒక్కసారీ దక్కని ప్రాతినిధ్యం

ఎస్.రాజమహేంద్రారెడ్డి

ఆమె. ఎందులోనూ తక్కువ కాదు. ఆకాశంలో సగం. అన్నింటా కూడా సగం. ఇంటికే పరిమితమనేది గతించిన మాట. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ పురుషులకు దీటుగా, ధాటిగా తనను తాను నిరూపించుకుంటోంది. మహిళలు అన్ని రంగాల్లోనూ గణనీయమైన పురోగతి సాధిస్తున్నారు. కానీ నాగాలాండ్‌లో మాత్రం మహిళలు ఒక విషయంలో మరీ వెనకబడ్డారు. ఇక్కడా తప్పు వారిది కాదు... అక్కడి పురుషాధిక్య సమాజానిది. ఆ రాష్ట్రంలో చదువులో, ఉద్యోగాల్లో లేని కట్టుబాటు రాజకీయాలకు వచ్చేసరికి మాత్రం పెద్ద అడ్డుకట్టగా మారింది. నాగాలాండ్ శాసనసభకు ఇప్పటిదాకా ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా ఎన్నిక కాలేదు!



నాగాలాండ్ 1963లో రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాత ఇప్పటిదాకా శాసనసభకు 13 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ 13 సభల్లోనూ మహిళలకు అసలే ప్రాతినిధ్యం దక్కలేదు. 13 ఎన్నికల్లోనూ బరిలో దిగిన మహిళల సంఖ్య కేవలం 20 మాత్రమే. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా ఐదుగురు మహిళలు పోటీ చేశారు. కానీ వీరిలో ముగ్గురికి డిపాజిట్ కూడా దక్కలేదు. ఓవరాల్‌గా ఇప్పటిదాకా బరిలో దిగిన 20 మందిలో చాలామంది మహిళలకూ అదే ఫలితం దక్కింది! మహిళలు ప్రధాని అవడమే గాక ముఖ్యమంత్రి పదవి కూడా చేపట్టిన మన దేశంలో ఒక్క నాగాలాండ్‌లోనే ఎందుకీ దుస్థితి? అక్కడేమన్నా అక్షరాస్యత తక్కువగా ఉందా అంటే, ఆ సమస్యే లేదు. రాష్ట్రంలో మహిళల్లో కూడా అక్షరాస్యత ఏకంగా 76.11 శాతం. ఇది దేశ సగటు అక్షరాస్యత (64.6 శాతం) కన్నా ఎక్కువ. ఇంత అక్షరాస్యత ఉన్నా నాగా మహిళలు సాటి మహిళలకు ఓటేసేందుకు సుముఖంగా లేరు! రాష్ట్ర మొత్తం ఓటర్ల సంఖ్య 13.17 లక్షలు. వీరిలో మహిళా ఓటర్ల సంఖ్య దాదాపు సగం, అంటే 6.56 లక్షలు. అయినా ఎందుకీ చిన్నచూపు?

ఎందుకీ వివక్ష?

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 2017లో నాగాలాండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమై నిరసనలు, ఆందోళనల దాకా వెళ్లింది! అక్కడ మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యంపై ఎంత వ్యతిరేక భావన ఉందో దీన్నిబట్టే అర్థమవుతోంది. ఈ రిజర్వేషన్లను నిరసిస్తూ పెద్ద ఎత్తున చెలరేగిన హింసలో ఇద్దరు ప్రాణాలు కూడా కోల్పోయారు! రాజ్యాంగంలోని 371 (ఎ) ఆర్టికల్‌లో పేర్కొన్న ప్రత్యేక హక్కులకు ఇది విరుద్ధమన్నది నిరసనకారుల వాదన. నిర్ణయాధికారాల్లో మహిళలకు ప్రాతినిధ్యం ఉండకూడదన్నది వారి డిమాండ్. నాగాలాండ్‌లో అత్యధిక శాతం ప్రజలు దీన్ని బలంగా విశ్వసిస్తారు. దీన్ని మార్చేందుకు మహిళల సాధికారత కోసం గళమెత్తే పలు స్వచ్ఛంద సంస్థలు ఎంత కృషి చేసినా లాభం లేకపోయింది. మహిళలకు సమాన హక్కులు కల్పించాలని ముఖ్యమంత్రి నిఫ్యూ రియో పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నా పెద్దగా ఫలితమైతే లేదు. ఆయన తన నేషనల్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ తరఫున ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు మహిళలకు టికెటిచ్చారు. కానీ మొత్తం 60 సీట్ల శాసనసభలో రెండే టికెట్లివ్వడం ఏ మేరకు సమన్యాయం చేసినట్టవుతుందో! కాంగ్రెస్, బీజేపీ అయితే మహిళలకు ఒక్కో టికెట్‌తోనే సరిపెట్టాయి. ప్రజలతో పాటు పార్టీలు కూడా మహిళల రాజకీయ ప్రాతినిధ్యానికి సరైన ప్రాధాన్యమివ్వడం లేదని ఈ సీట్ల కేటాయింపు చెప్పకనే చెబుతోంది. పార్లమెంటులో కూడా నాగాలాండ్ మహిళలకు దక్కిన ప్రాతినిధ్యం స్వల్పాతిస్వల్పం. అప్పుడెప్పుడో 1977లో రానో షైజా లోక్‌సభకు ఎన్నికవగా, తాజాగా 2022లో ఫంగ్నోన్ కొన్యాక్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. ప్రజలతో పాటు పార్టీల వైఖరి కూడా మారినప్పుడు మాత్రమే నాగాలాండ్ అసెంబ్లీలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం దక్కుతుంది.

నాగాలాండ్ అసెంబ్లీకి మేఘాలయ, త్రిపురలతో పాటు ఈ నెలాఖర్లోగా పోలింగ్ పూర్తవుతుంది. త్రిపురకు ఫిబ్రవరి 16న, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీలకు 27న పోలింగ్ జరగనుంది. కేవలం ఆరుగురు మహిళలు మాత్రమే నామినేషన్ వేశారు. వారిలో ఇద్దరు అధికార ఎన్డీపీపీ అభ్యర్థులు, బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఒక్కో అభ్యర్థి మిగలగా మరో ఇద్దరు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఆ నలుగురిలో ఒక్కరైనా నెగ్గి చరిత్ర సృష్టిస్తారో లేదో చూడాలి. కనీసం సగం మందైనా గెలిస్తే మహిళల రాజకీయ ప్రాతినిధ్యంపై నాగాలాండ్ ప్రజల్లో ఉన్న విముఖత మెల్లమెల్లగా తొలగిపోతున్నట్టు భావించవచ్చు. ఈ ప్రశ్నకు సమాధానం మార్చి 2న వెలువడే ఫలితాల్లో లభిస్తుంది.

భూకంప మృతులు 35,000



అదియామాన్: తుర్కియే, సిరియాలో వారం రోజుల క్రితం సంభవించిన భారీ భూకంపంలో మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇప్పటి దాకా 35,000 మందిపైగా మరణించారని అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. కొందరు శిథిలాల్లో చిక్కుకొని సజీవంగా బయటపడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా తుర్కియేలోని దక్షిణ హతాయ్ ప్రావిన్స్‌లో 13 ఏళ్ల బాలుడు క్షేమంగా బయటపడ్డాడు. తుర్కియేలో ఉష్ణోగ్రత మైనస్ 6 డిగ్రీలకు పడిపోయింది. దీంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు వాపోతున్నారు. భూకంపం వల్ల తుర్కియేకు 84.1 బిలియన్ డాలర్లకుపైగా నష్టం వాటిల్లినట్లు టర్కిష్ ఎంటర్‌ప్రైజ్ అండ్ బిజినెస్ కాన్ఫెడరేషన్ అంచనా వేసింది.

'అదానీ'పై అదే దుమారం

తొలి విడత బడ్జెట్ సమావేశాలకు తెర.. మార్చి 13 నుంచి మలి విడత

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ తొలి విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ముగిశాయి. రెండో విడత సమావేశాలు మార్చి 13న ప్రారంభం కానున్నాయి. అదానీ వ్యవహారంపై సోమవారం కూడా రాజ్యసభలో విపక్ష ఆందోళనలు కొనసాగాయి. సభ ప్రారంభానికి ముందే 14 విపక్ష పార్టీలు సమావేశమై దీనిపై చర్చించాయి. కాంగ్రెస్ సహా డీఎంకే, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, జేడీయూ తదితర పార్టీల నేతలు హాజరయ్యారు. జేపీసీ గానీ సుప్రీం న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ కమిటీకి డిమాండ్ చేయాలని నిర్ణయించాయి. అనంతరం బీఆర్ఎస్ సహా పలు విపక్ష పార్టీల ఎంపీలు సభలో వాయిదా తీర్మానాలిచ్చారు. సభ ప్రారంభమైన వెంటనే ఈ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. జేపీసీకి డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించాయి. దీనిపై చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అభ్యంతరం తెలిపారు. జేపీసీ వేయాలని నినాదాలు చేస్తున్న 8 మంది సభ్యుల పేర్లను సైతం చదివి వినిపించారు. అయితే, వారిపై ఎలాంటి చర్యలను ప్రకటించలేదు. సభను నడిపేందుకు ఇది మార్గం కాదని, ఇప్పటికే చాలా సమయం వృథా అయిందని, సభ్యులు సహకరించాలని కోరారు. విపక్ష ఎంపీలు ఆందోళన విరమించకపోవడంతో సభను 11.50 గంటలకు వాయిదా వేశారు. సభ ఆరంభం అయ్యాక సైతం విపక్షాలు ఏమాత్రం వెనక్కి తగ్గకపోవడంతో చివరికి మార్చి 13వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అదానీ గ్రూప్‌లో అవకతవకలు జరిగాయంటూ హిండెన్‌బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదికపై ప్రతిపక్షాల ఆందోళనలతోనే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి భాగమంతా గడిచిన విషయం తెలిసిందే. ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం, ఆ తర్వాత బడ్జెట్, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సాధారణ బడ్జెట్‌పై చర్చ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం మినహా ఇతర కార్యకలాపాలేవీ జరగలేదు.

'హిండెన్‌బర్గ్ నివేదిక'పై కమిటీకి ఓకే

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్‌లో మోసాలను అరికట్టడానికి నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయాలన్న సుప్రీంకోర్టు సూచన పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అదానీ గ్రూప్ కంపెనీలపై హిండెన్‌బర్గ్ నివేదిక, అనంతర పరిణామాలను మదింపు చేసేందుకు ప్రభుత్వ నియంత్రణ సంస్థ అయిన సెబీకి పూర్తి సమర్థత ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం సుప్రీంకోర్టుకు నివేదించారు. దీనిపై సుప్రీంకోర్టు సూచించిన మేరకు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో నిపుణుల కమిటీ ఏర్పాటుకు కేంద్రానికి అభ్యంతరం లేదని వెల్లడించారు. అదానీ ఉదంతంపై చర్యలు తీసుకోవాలంటూ లాయర్లు విశాల్ తివారీ, ఎంఎల్ శర్మ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. మార్కెట్ ఒడిదుడుకులతో నష్టపోకుండా మదుపరుల ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరముందని పేర్కొంది. నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో నిపుణుల కమిటీ వేయాలని సూచించింది. అయితే విచారణ జరిపే క్రమంలో సెబీ పాత్ర, ప్రాధాన్యాలకు భంగం వాటిల్లకుండా చూస్తే అందుకు అభ్యంతరం లేదని మెహతా తెలిపారు. నివేదికను సీల్డ్ కవర్లో సమర్పించేందుకు అనుమతించాలని కోరారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో ప్రమాణం చేయిస్తున్న సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

ఇద్దరు సుప్రీంకోర్టు జడ్జీల ప్రమాణం

న్యూఢిల్లీ: నూతనంగా నియమితులైన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సోమవారం ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ రాజేశ్ బిందాల్ ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో 34 మంది న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు ఇక పూర్తి స్థాయిలో పనిచేయనుంది.

దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడు

తమ కోస్టుగార్డ్‌పైకి లేజర్ బీమ్స్‌ను ప్రయోగించిందన్న ఫిలిప్పీన్స్

మనీలా: దక్షిణ చైనా సముద్రంపై పెత్తనం తమదేనంటున్న డ్రాగన్ దేశం దుందుడుకు చర్యకు పాల్పడింది. వివాదాస్పద జలాల్లోని ఫిలిప్పీన్స్ కోస్టుగార్డ్ ఓడపైకి చైనా కోస్టుగార్డ్ షిప్ మిలటరీ గ్రేడ్ లేజర్ కిరణాలను ప్రయోగించింది. దీంతో అందులోని తమ సిబ్బందిలో కొందరికి కొద్దిసేపు కళ్లు కనిపించకుండా పోయాయి. ఈ చర్యతో చైనా తమ సార్వభౌమ హక్కులకు తీవ్ర భంగం కలిగించిందని ఫిలిప్పీన్స్ ఆరోపించింది. తమ ఓడ బీఆర్‌పీ మలపస్కువాను దగ్గర్లోని రాతి దిబ్బ వైపు వెళ్లకుండా చైనా ఓడ అడ్డుకుందని తెలిపింది. ఈ క్రమంలో ప్రమాదకరంగా 137 మీటర్ల అతి సమీపానికి చేరుకుందని వివరించింది.

మరో వస్తువును కూల్చివేసిన అమెరికా

వాషింగ్టన్/బీజింగ్: తమ గగనతలంలో మరో గుర్తు తెలియని వస్తువును అమెరికా కూల్చివేసింది. మిషిగాన్ రాష్ట్రంలోని లేక్ హురోన్‌పైన 20 వేల అడుగుల ఎత్తులో ఎగురుతున్న అష్టభుజి ఆకారమున్న వస్తువును ఆదివారం ఉదయం గుర్తించారు. అధ్యక్షుడు బైడెన్ ఉత్తర్వులతో ఎఫ్–16 యుద్ధ విమానం నుంచి ఏఐఎం9ఎక్స్ క్షిపణిని ప్రయోగించి దాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్ తెలిపింది. ఆ వస్తువుకు నిఘా సామర్థ్యమున్నదీ లేనిదీ తెలియాల్సి ఉంది. అమెరికా ఇప్పటి వరకు మొత్తం నాలుగింటిని కూల్చి వేసింది. సౌత్ కరోలినా వద్ద కూల్చివేసిన భారీ బెలూన్‌కు మాత్రమే నిఘా సామర్థ్యమున్నట్లు అమెరికా తెలిపింది. ఇలా ఉండగా, ఏడాదిగా తమ గగనతలంలో అనుమతి లేకుండా అమెరికాకు చెందిన 10కి పైగా బెలూన్లు ఎగిరాయని చైనా సోమవారం ఆరోపించింది. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే విషయం తెలపలేదు. అమెరికా బెలూన్లు ఇతర దేశాల గగనతలంలోకి అనుమతి లేకుండా ప్రవేశించడం సర్వసాధారణ విషయమని వ్యాఖ్యానించింది. దీనిపై అమెరికా అధ్యక్ష భవనం స్పందించింది. చైనాపైకి తాము ఎలాంటి నిఘా బెలూన్లను ప్రయోగించలేదని పేర్కొంది.

రష్యా నుంచి తక్షణమే వచ్చేయండి

తమ పౌరులకు అమెరికా ప్రభుత్వం హెచ్చరిక

వాషింగ్టన్: రష్యాలో ఉంటున్న, అక్కడికి ప్రయాణం చేస్తున్న తమ పౌరులు తక్షణమే వెనక్కి వచ్చేయాలని అమెరికా కోరింది. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా అకారణంగా అమెరికా పౌరులను అరెస్టు చేసి వేధించే ప్రమాదముందని హెచ్చరించింది. 'రష్యా భద్రతా సంస్థలు అమెరికా పౌరులపై నిరాధార ఆరోపణలు చేసి, నిర్బంధంలో ఉంచుతున్నాయి. వారికి న్యాయసాయం, అవసరమైన వైద్య చికిత్సలను సైతం అందకుండా చేస్తున్నాయి. రహస్య విచారణలు జరుపుతూ, ఎటువంటి రుజువులు లేకుండా దోషులుగా ప్రకటిస్తున్నాయి. మత ప్రచారకులైన అమెరికా పౌరులపై సైతం గూఢచర్యం కేసులను మోపి, విచారణల పేరుతో వేధిస్తున్నాయి' అని అందులో పేర్కొంది. సైన్యంలోకి రిక్రూట్‌మెంట్లను ప్రారంభించాలన్న రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తర్వుల నేపథ్యంలో గత ఏడాది సెప్టెంబర్‌లో అమెరికా తమ పౌరులకు ఇదే విధమైన హెచ్చరికలు చేసింది.

రక్షణ రంగంలో మేటిగా భారత్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

- రక్షణ ఉత్పత్తుల తయారీలో అగ్రగామిగా ఎదుగుతున్నాం
- 75 దేశాలకు రక్షణ పరికరాలు ఎగుమతి చేస్తున్నాం... బెంగళూరులో 'ఏరో ఇండియా–2023' ప్రారంభం
- ఆసియాలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన
- అలరించిన దేశ విదేశీ విమానాల విన్యాసాలు



ఏరో ఇండియా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

సాక్షి, బెంగళూరు: రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ అప్రతిహత వేగంతో ముందుకు దూసుకుపోతోందని, ఈ విషయంలో ప్రపంచంలోని అగ్రదేశాల సరసన చేరబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. మన దేశంలో గత తొమ్మిదేళ్లలో రక్షణ ఉత్పత్తులు భారీగా పెరిగాయని ఉద్ఘాటించారు. సానుకూల ఆర్థిక విధానాలతోనే ఇది సాధ్యమైందని అన్నారు. ఆసియాలోనే అతిపెద్ద వైమానిక ప్రదర్శన 'ఏరో ఇండియా–2023'ను ప్రధాని మోదీ సోమవారం కర్ణాటక రాజధాని బెంగళూరు శివారులోని యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్షణ పరికరాల కోసం ఒకప్పుడు దిగుమతులపై ఆధారపడిన భారత్ ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని అన్నారు. 75 దేశాలకు రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తున్నామని వివరించారు. విదేశీ పరికరాలకు మన దేశాన్ని ఒక మార్కెట్‌గా పరిగణించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. శక్తివంతమైన రక్షణ భాగస్వామిగా భారత్ తన సామర్థ్యాన్ని చాటుకుంటోందని పేర్కొన్నారు.

5 బిలియన్ డాలర్ల ఎగుమతులు

రక్షణ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని, ఎన్నెన్నో ఘనతలు సాధించామని నరేంద్ర మోదీ తెలియజేశారు. మిలటరీ హార్డ్‌వేర్ ఉత్పత్తి విషయంలో మన దేశం పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందని చెప్పారు. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులను 1.5 బిలియన్ డాలర్ల నుంచి 2024–25 నాటికి 5 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసుకున్న 'తేజస్ లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్, ఐఎన్ఎస్ విక్రాంత్'లు రక్షణ ఉత్పత్తుల రంగంలో మన అసలైన ప్రతిభా పాటవాలకు చక్కటి ఉదాహరణలని వెల్లడించారు. రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ప్రైవేట్ సెక్టార్‌ను ఆహ్వానిస్తున్నామని ప్రధానమంత్రి అన్నారు. ఏరో ఇండియా ప్రదర్శనలో వివిధ దేశాల వైమానాలు, హెలికాప్టర్ల విన్యాసాలు ఆహూతులను విశేషంగా అలరించాయి. లైట్ కాంబాట్ హెలికాప్టర్‌లో ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే, తేజస్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ప్రయాణించారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు త్రివిధ దళాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐదు రోజులపాటు జరిగే 'ఏరో ఇండియా'లో దాదాపు 100 దేశాల రక్షణ శాఖ మంత్రులు, ప్రతినిధులు, దేశ విదేశాలకు చెందిన 800కు పైగా డిఫెన్స్ కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. రక్షణ రంగంలో రూ.75,000 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 250 ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని భారత రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు.

ప్రధాని మోదీతో ప్రముఖుల భేటీ



సినీ నటులు యశ్, రిషబ్ శెట్టీలతో మోదీ

'ఏరో ఇండియా'ను ప్రారంభించేందుకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీతో బెంగళూరులో పలువురు ప్రముఖులు భేటీ అయ్యారు. కన్నడ సినీ నటులు యశ్, రిషబ్ శెట్టీ, దివంగత పునీత్ రాజ్‌కుమార్ భార్య అశ్వినీ, మాజీ క్రికెటర్లు అనిల్ కుంబ్లే, జవగళ్ శ్రీనాథ్, వెంకటేశ్ ప్రసాద్, యువ క్రికెటర్లు మయాంక్ అగర్వాల్, మనీశ్ పాండేతోపాటు పలు రంగాల పెద్దలు మోదీని కలుసుకున్నారు. ఆదివారం రాత్రి రాజ్‌భవన్‌లో డిన్నర్ సందర్భంగా ఈ సమావేశం జరిగింది. భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు, గుర్తింపును మరింత ఇనుమడింపజేసేందుకు దక్షిణాది సినీనటులు కృషి చేయాలని ప్రధాని మోదీ సూచించినట్లు తెలిసింది.

ప్రత్యేక ఆకర్షణగా అమెరికా ఎఫ్-13ఏ ఫైటర్ జెట్లు

ఏరో ఇండియా ప్రదర్శనలో అమెరికాకు చెందిన ఐదో తరం సూపర్‌సానిక్ మల్టీరోల్ ఎఫ్–35ఏ యుద్ధవిమానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎఫ్–35ఏ లైట్నింగ్–2, ఎఫ్–13ఏ జాయింట్ స్ట్రైక్ ఫైటర్ అమెరికాలోని ఎయిర్‌బేస్‌ల నుంచి సోమవారం బెంగళూరుకు చేరుకున్నాయి. అమెరికా వైమానిక దళానికి చెందిన ఈ అత్యాధునిక ఫైటర్ జెట్లు భారత్ గడ్డపై అడుగుపెట్టడం ఇదే మొదటిసారి. అంతేకాకుండా ఎఫ్–16 ఫైటింగ్ ఫాల్కన్, ఎఫ్/ఎ–18ఈ, ఎఫ్/ఎ–18ఎఫ్ యుద్ధ విమానాలు సైతం అమెరికా నుంచి వచ్చాయి.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 14 ఫిబ్రవరి : 2023

పాఠశాలల్లో నైతిక విద్య అమలు చేస్తాం

- గుడ్ల పంపిణీ ఆగదు: మంత్రి నాగేశ్

బనశంకరి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విద్యను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, శాకాహారం గురించి ఎలాంటి ప్రతిపాదన లేదని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి బీసీ నాగేశ్ స్పష్టం చేశారు. సోమవారం విధాన పరిషత్‌లో మాట్లాడుతూ తమ ప్రభుత్వం వ్యతిరేకత వచ్చినప్పటికీ లెక్కచేయకుండా మొదట పౌష్టికత తక్కువగా ఉన్న జిల్లాలో గుడ్లు అందించడం మొదలైంది, అక్కడ అపౌష్టికత తగ్గినట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు గుడ్లు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నామని ఏడాదిలో 46 రోజులు గుడ్లు ఇస్తున్నామని చెప్పారు. గుడ్లు తినని పిల్లలకు అరటిపండు ఇస్తున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

మాకళి కొండపై కార్చిచ్చు



మాకళిదుర్గం పర్యాటక ప్రాంతం (ఫైల్)

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలో పర్యాటక స్థలంగా ప్రసిద్ధి చెందిన మాకళిదుర్గం కొండపై కార్చిచ్చు వ్యాపించింది. ఆదివారం రాత్రి కొండ పైకి వెళ్లిన కొందరు తాగుబోతులు కొండమీద నిప్పంటించినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మాకళికొండ అనేక జాతుల పక్షులకు నిలయంగా ఉంటోంది. ఎన్నో రకాల ఔషధ వనమూలిక మొక్కలు ఈ కొండమీద ఉన్నాయి. ముఖ్యంగా మాకళి కొండపై వేలాదిగా నెమళ్లు నివసిస్తున్నాయి. చిరుతలు కూడా ఉన్నాయి. సోమవారం తెల్లవారుజామున కూడా కొండపై మంట మండుతూనే ఉంది. స్థానికులు సమాచారం ఇచ్చినా అగ్నిమాపక దళం సిబ్బంది సమయానికి రాలేదని ఆరోపించారు. అటవీశాఖ అధికారులు కూడా స్పందించలేదని చెప్పారు. ఎండాకాలం సమీపించడంతో అడవులకు అగ్ని ప్రమాదాల బెడద ఏర్పడింది.

లాయర్‌ల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయండి



ధర్నా చేస్తున్న లాయర్లు

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో లాయర్లకు రక్షణ కల్పించేందుకు లాయర్‌ల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ దొడ్డ పట్టణంలో సోమవారం లాయర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సోమవారం ఉదయం విధులు బహిష్కరించి బయటకు వచ్చిన లాయర్లు కోర్టు ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన లాయర్లు రాష్ట్రంలో ఇటీవల లాయర్లపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. న్యాయం కోసం వాదించే లాయర్లకు భద్రత లేకపోవడం విషాదకరమన్నారు. ఈ నేపథ్యంలో లాయర్ల పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చినా అది అమలు కాకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికయినా ప్రభుత్వం లాయర్ల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు.

పోషించడం భర్త బాధ్యత

శివాజీనగర: భార్యాబిడ్డలను పోషించటం భర్త బాధ్యతని హైకోర్టు జడ్జి జస్టిస్ ఎం.నాగప్రసన్న ధర్మాసనం ఒక కేసులో తీర్పు చెప్పారు. భరణం కేసు విచారణ సందర్భంగా, పనిచేసే సామర్థ్యం కలిగిన భర్త.. పని లేకున్నా పనులు వెతుక్కొని భార్యా బిడ్డలను పోషించాలి. అది భర్త బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కేసులో భార్యకు నెలకు రూ.6000, బిడ్డకు రూ.4000 భృతి ఇవ్వాలని ఆదేశించారు.

బీజేపీ ఎమ్మెల్యేకి జైలుశిక్ష

- చెక్కు బౌన్స్ కేసులో కోర్టు తీర్పు

యశవంతపుర: చెక్కుబౌన్స్ కేసులో మూడిగెరె బీజేపీ ఎమ్మెల్యే ఎంపీ కుమారస్వామికి కోర్టు నాలుగేళ్ల జైలుశిక్షను విధిస్తూ సోమవారం తీర్పు చెప్పింది. హూవప్పగౌడ అనే వ్యక్తి నుంచి కుమారస్వామి రూ.1.35 కోట్లను అప్పుగా తీసుకున్నారు. అప్పు తీర్చడానికి కుమారస్వామి 8 చెక్కులను ఇచ్చారు. చెక్కులు బ్యాంకులో వేయగా అవి చెల్లలేదు. దీంతో బాధితుడు ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో కేసు దాఖలు చేశారు. కేసు విచారణ చేసిన కోర్టు కుమారస్వామికి నాలుగేళ్ల శిక్షను విధిస్తూ తీర్పు చెప్పింది.

గగనాన సంభ్రమం

- ఆర్భాటంగా ఏరో ఇండియా ప్రదర్శన మరూ
- అబ్బురపరిచిన విమానాల విన్యాసాలు

సాక్షి, బెంగళూరు: రెండేళ్లకు ఒకసారి జరిగే ఏరో ఇండియా ప్రదర్శన ప్రారంభోత్సవం ఆర్భాటంగా సాగింది. యుద్ధ విమానాల విన్యాసాలు ఆహూతులను సంభ్రమానికి గురిచేశాయి. భీకర గర్జనలతో ఆకాశంలో సుడులు తిరుగుతూ పొగలు విరజిమ్ముతూ దూసుకెళ్తూ దేశ విదేశీ అతిథులను అబ్బురపరిచాయి. ప్రధాని నరేంద్ర మోదీ సైతం సంతోషంతో చప్పట్లు కొట్టి హర్షం వ్యక్తం చేశారు. ప్రదర్శనకు వేదికపై యలహంకా వైమానిక స్థావరం లోహ విహంగాల విన్యాసాలు, అతిథులతో కళకళలాడింది. ఏరో ఇండియా ప్రదర్శనకు సోమవారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీ నాంది పలికారు. ఈ సందర్భంగా వినీలాకాశంలో యుద్ధ విమానాలు చేసిన విన్యాసాలు విశేషంగా అలరించాయి. ఇక సూర్యకిరణ్ జెట్లు విన్యాసాల్లో ముందు నిలిచాయి.



ప్రదర్శనలో వివిధ లోహ విహంగాలు


ప్రారంభోత్సవంలో ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే వీటితో పాటు సుఖోయ్, తేజస్ విమానాలు ఆకాశంలో వైవిధ్య విన్యాసాలు ప్రదర్శించి ఔరా అనిపించాయి.

ప్రధానికి సీఎం బొమ్మై కృతజ్ఞతలు

భారతదేశం విశ్వగురువుగా ఎదగడంలో కర్ణాటక రాష్ట్రం అత్యంత ప్రముఖ పాత్ర వహిస్తోందని సీఎం బొమ్మై అన్నారు. ఎయిర్ షోలో ఆయన ప్రసంగిస్తూ ఏరో ఇండియా ప్రదర్శన మళ్లీ మళ్లీ బెంగళూరులో జరగడానికి అవకాశం కల్పిస్తున్న ప్రధాని మోదీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎయిర్ షో ద్వారా భారతదేశం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి నిరూపించిందన్నారు. ఈసారి ఏరో ఇండియాలో భాగస్వాముల సంఖ్య ఎంతో పెరిగిందని చెప్పారు.

ప్రముఖులతో రాజ్‌భవన్లో విందు

శివాజీనగర: ఏరో ఇండియా కోసం నగరానికి చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ, రాజ్‌భవన్‌లో బస చేశారు. ఈ సందర్భంగా సినీ, వాణిజ్య, క్రీడా రంగాల ప్రముఖులతో భోజన సమావేశం నిర్వహించారు. మాజీ క్రికెటర్లు అనిల్ కుంబ్లే దంపతులు, జవగల్ శ్రీనాథ్, వెంకటేశ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనిల్ కుంబ్లే దంపతులు ప్రధానితో ఫోటో తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ భేటీలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు.



ఏరో ఇండియా ప్రారంభోత్సవంలో ప్రధాని



సూర్యకిరణ్ విమానాల విన్యాసం



సూర్యకిరణ్ విమానాల పాటవం



దూసుకెళ్తున్న భారత యుద్ధ విమానాలు



అబ్బురంగా తిలకిస్తున్న దేశ విదేశీ ఆహూతులు

రక్షణ చట్టం కోసం లాయర్ల ధర్నా



సోమవారం బెంగళూరులో.. ఆందోళనకు దిగిన వకీళ్లను అడ్డుకుంటున్న పోలీసులు

బనశంకరి: రాష్ట్రంలో లాయర్లకు రక్షణ కల్పించేందుకు లాయర్ల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండు చేస్తూ రాష్ట్ర న్యాయవాదులు సంఘం ధర్నాకు దిగింది. న్యాయవాదులు రక్షణ కోసం చట్టం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిటీ సివిల్ కోర్టు ఆవరణలో వేలాది సంఖ్యలో ధర్నాకు దిగారు. విధాన సౌధను ముట్టడించడానికి ప్రయత్నించారు. కోర్టు ఆవరణ ముందుభాగం, కేఆర్.సర్కిల్ వద్ద పోలీసులు భారీ భద్రత కల్పించారు. ఇటీవల రోజుల్లో న్యాయవాదులపై దాడులు, దౌర్జన్యాలు అడ్డుకోవడానికి ప్రత్యేక రక్షణ చట్టం అమల్లోకి తీసుకురావాలని న్యాయవాదులు సంఘం డిమాండ్ చేసింది.



పోలీసులతో మహిళా లాయర్ల వాగ్వాదం

పరిషత్‌లో మంత్రుల గైర్హాజరు

బనశంకరి: మంత్రుల గైర్హాజరుతో సోమవారం విధానపరిషత్‌లో కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. ఉదయం సభాపతి బసవరాజ హొరట్టి మాట్లాడుతూ పలువురు మంత్రులు ఎయిర్ షో సహా పలు కారణాలతో గైర్హాజరుకు అనుమతి తీసుకున్నారని తెలిపారు. జేడీఎస్ సభ్యుడు ఎల్ఎస్ భోజేగౌడ ప్రశ్నలు అడగ్గా, సంబంధిత మంత్రి శ్రీనివాస పూజారి లేకపోవడంతో గైర్హాజరు చర్చకు వచ్చింది. విమానాల రద్దు వల్ల పలువురు మంత్రులు రాలేకపోయారని హొరట్టి ప్రకటించారు. మంత్రులు రోడ్డు మార్గంగా ప్రయాణిస్తున్నారని, మధ్యాహ్నంకల్లా వస్తారని అన్నారు. భోజేగౌడ దీనిపై స్పందిస్తూ ఎయిర్ షో వల్ల విమానాలు రద్దైనట్లు మంత్రులకు తెలియదా?, ఆదివారం రాత్రే వచ్చి ఉండవచ్చు కదా అని ప్రశ్నించారు. చివరకు మధ్యాహ్న భోజన విరామం వరకూ వాయిదా వేశారు.

రాజకీయాల నుంచి విశ్రమించలేదు : యడ్డి

శివాజీనగర: తాను రాజకీయాల నుంచి రిటైర్ కాలేదని, మరో 5 నుంచి 10 పదేళ్ల పాటు రాజకీయాల్లో ఉంటానని మాజీ సీఎం యడియూరప్ప ప్రకటించారు. సోమవారం శివమొగ్గలో మాట్లాడిన ఆయన, తాను రాజకీయాల నుంచి రిటైర్మెంట్ ప్రకటించలేదు. మరో రెండు పర్యాయాలు క్రియాశీల రాజకీయాల్లో ఉంటాను. రానున్న ఎన్నికల్లో బీజేపీ 140–150 స్థానాల్లో గెలుపొందుతుందన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర పర్యటన ఆరంభిస్తానన్నారు.

రాజకీయాల్లోకి రాలేను: కిచ్చ

యశవంతపుర: నటుడు కిచ్చ సుదీప్ రాజకీయాల్లోకి వస్తాడంటూ వస్తున్న వదంతులపై స్పష్టత వచ్చింది. రాజకీయాల్లోకి రావాలనే విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సుదీప్ స్పష్టం చేశారు. డీకే శివకుమార్, సుధాకర్, సీఎం బొమ్మై, రమ్యా నా స్నేహితులే. రెండు వైపులా అప్తులు ఉండటం వల్ల రాజకీయ నిర్ణయం తీసుకోవటం చాలా కష్టమన్నారు. ఇటీవల డీకే శివకుమార్, సుదీప్‌ను కలవడంతో ఆయన రాజకీయాల్లోకి వస్తున్నట్లు జోరుగా చర్చ జరిగింది. రాజకీయాల్లోకి రాలేనని ఈ తాజా చర్చకు సుదీప్ తెరదించారు.

రూ.2.60 కోట్ల వజ్రాల పట్టివేత

బనశంకరి: మంగళూరు విమానాశ్రయంలో కోట్లాది రూపాయల విలువచేసే వజ్రాలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్‌కి వెళుతున్న భట్కళవాసులు అనాస్, అమ్మర్ అనే ఇద్దరు తమ బూట్లు, బ్యాగుల కింద అనుమానం రాకుండా వజ్రాలను తీసుకెళ్తుండగా తనిఖీలు చేశారు. అధికారులకు సమాచారం అందడంతో వారిని, లగేజీని క్షుణ్ణంగా వెతికారు. బూట్ల లోపల, బ్యాగులో రహస్యంగా దాచి ఉంచిన కొన్ని వజ్రాలను గుర్తించి సీజ్ చేశారు. వీటి విలువ రూ 2.60 కోట్లు ఉంటుందని తెలిపారు. ఇద్దరినీ అరెస్టు చేశారు.

వైవిధ్య పక్షిధామం నాగరహోళె

- 290 రకాల పక్షిజాతుల గుర్తింపు

మైసూరు: మైసూరు జిల్లాలోని హుణసూరు తాలుకా పరిధిలో ఉన్న నాగరహోళె పులుల అభయారణ్యంలో నాలుగు రోజుల పాటు పక్షుల గణన నిర్వహించారు. ఇందులో సుమారు 290 జాతులకు చెందిన పక్షులు ఉన్నట్లు లెక్క తేలింది. సుమారు 8 రాష్ట్రాల నుంచి వచ్చిన పక్షుల నిపుణులు, పక్షి ప్రేమికులు, విద్యార్థులు, స్వయం సేవకులు 118 మంది పాల్గొన్నారు. వారితో పాటు అటవీ సిబ్బంది కలిసి అడవిలో పర్యటించారు. అంతరసంతె, డి.బి.కుప్పె, మేటికుప్పె, నాగరహోళె, కల్లహళ్ళ, ఆనెచౌకూరు, హుణసూరు, విరన హొసహళ్ళి వన్యజీవుల విభాగంలో పక్షులను గాలించారు. సుమారు 290 రకాల జాతులకు చెందిన పక్షులను గుర్తించారు. ఇందులో నెమళ్లు, కోయిలలు, కాకులు, పిచ్చులతో పాటు పట్టిగలె, హెబ్బాతు, మల్‌బార్ ఉడ్‌ష్రైజ్, కెందలె రణగద్ద, తెల్లటి వెన్నుగద్దలు, నల్ల గిడుగ, నాబ్ బిల్డ్ డక్ వంటి అనేక రకాల అరుదైన పక్షిజాతులు కంటబడ్డాయి.



నాగరహోళె అడవుల్లో నెమలి

బ్రహ్మచారుల నడక మలె మహాదేశ్వరుడి వైపు

- పెళ్లి కోసం త్వరలో పాదయాత్ర

శివాజీనగర: పెళ్లి కోసం పాదయాత్ర చేపట్టిన బ్రహ్మచారుల నడక మలె మహాదేశ్వరుడి వైపు సాగనుంది. 30 ఏళ్లు దాటిన అబ్బాయిలకు పెళ్లిల్లు కావడం లేదు. దీంతో మండ్య నుంచి పలువురు బ్రహ్మచారులు చామరాజనగర మలె మహాదేశ్వర ఆలయం వరకు 3 రోజుల పాటు జరగనున్న పాదయాత్రలో సుమారు 250 మంది పాల్గొనే అవకాశముంది. పాల్గొనేవారు అధికంగా వ్యవసాయం, వ్యాపార రంగాల నుంచి వచ్చినవారు. వారికి వివిధ కారణాలతో వధువులు లభించలేదు. పాల్గొనేవారికి వయోపరిమితిని నిర్ధారించడంతో ఈ యాత్ర ప్రత్యేకతను సంతరించుకుందని, పాదయాత్రను ఏర్పాటు చేసిన మళవళ్లి తాలూకా కాగెపుర శివప్రభు (34) సోమవారం మీడియాకు తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు పాదయాత్ర జరుగుతుందని, తొలి రోజు 40 కి.మీ. రెండో రోజు 45 కి.మీ, మిగతా దూరాన్ని ఆఖరి రోజు పాదయాత్రలో పూర్తి చేయనున్నారని తెలిపారు.

తాతా మనవన్ని బలిగొన్న పులి

- కొడగు జిల్లాలో ఘోరం

మైసూరు: పెద్ద పులి దాడిలో తాతా మనవడు మృత్యువాత పడ్డారు. మరొకరు గాయపడ్డారు. ఈ దుర్ఘటన కొడగు జిల్లాలోని గోణి కొప్పలు తాలూకాలో జరిగింది. వివరాలు.. నాగరహోళె అభయారణ్యం పరిధిలోని కేబాడగ గ్రామానికి చెందిన చేతన్ (12), ఇతని తండ్రి మధు (43), మధు తండ్రి రాజు (75) ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో కొడగు జిల్లా గోణికొప్పలు తాలూకా చోరికాడు గ్రామంలో ఒక కాఫీ తోటలో కూలీ పనికి వెళ్లారు. ఈ సమయంలో చేతన్ పైన తోటలో దాగి పెద్ద పులి దాడి చేయడంతో బాలుడు మరణించగా, తాత, తండ్రి అడ్డుకోబోగా వారి మీద కూడా విరుచుకుపడింది. తాత రాజు ప్రాణాలు కోల్పోగా, మధుకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారి కేకలతో సమీపంలోని వారు వచ్చేలాగా పులి పరారైంది. క్షతగాత్రుడు మధు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అటవీ అధికారులు నరహంతక పులి కోసం గాలింపు చేపట్టారు.

కిడ్నాపర్ల ముఠా ఆటకట్టు

- నంజనగూడులో ఈ నెల 6న వ్యాపారవేత్త, తనయుడు అపహరణ
- రూ. 35 లక్షలు వసూలు చేసి విడుదల
- దుండగులను పట్టుకున్న పోలీసులు

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడు తాలూకాలోని అడకనహళ్లి పారిశ్రామిక ప్రాంతంలో ఈ నెల 6వ తేదీన వ్యాపారవేత్త, అతని కుమారున్ని దుండగులు కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేసి వదిలిపెట్టడం తెలిసిందే. దర్యాప్తు చేసిన పోలీసులు ఈ కేసులో 10 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు రూ. 21.10 లక్షల నగను స్వాధీనం చేసుకున్నారు.

కోటి డిమాండ్ చేసి రూ. 35 లక్షలు వసూలు

కేసు గురించి సోమవారం మైసూరు జిల్లా ఎస్పీ సీమా లాట్కర్ మీడియాతో మాట్లాడారు. హర్ష ఇంపెక్ట్ యజమాని దీపక్, అతని కుమారుడు హర్షలు ఆఫీసులో ఉండగా దుండగులు చొరబడి వారి కారులోనే కిడ్నాప్ చేశారు. దీపక్ మొబైల్ ద్వారా దుండగులు వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మీవారిని వదలాలి అంటే వెంటనే కోటి రూపాయలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు రూ. 35 లక్షలను చెల్లించి ఇద్దరినీ విడిపించుకున్నారు.



ఎస్పీ సీమా లాట్కర్

మొబైల్‌ఫోన్ల ఆధారంగా నిఘా

అదే రోజు పోలీసులు అన్నిచోట్లా గాలింపు సాగించారు. వ్యాపారవేత్త కారు చాముండికొండ సమీపంలో సుత్తూరు మఠం వద్ద కనిపించింది. ఉదయం వారిని అపహరించిన దుండగులు రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో డబ్బులు అందగానే వదిలివేశారు. తండ్రీ కొడుకులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. నంజనగూడు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొని 3 బృందాలతో గాలింపు చేపట్టారు. దుండగులు ఉపయోగించిన మొబైల్ ఫోన్ల ఆధారంగా నిఘా వేసి 10 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 21.10 లక్షల నగదును, ఒక కారు, మూడు బైకులు, 8 పెద్ద కత్తులు, 11 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా సూత్రధారి మండ్యకు చెందినవాడు కాగా, పలు నేరాలకు పాల్పడి 11 ఏళ్లు జైల్లో ఉండి వచ్చాడు. ఈ ముఠా ఆగడాలపై లోతుగా విచారణ చేపట్టారు.



క్లుప్తంగా

హోరాహోరీగా కుస్తీ పోటీలు



తలపడుతున్న పహిల్వాన్లు

శివమొగ్గ: శివమొగ్గ జిల్లా సాగర పట్టణంలో జరుగుతున్న శ్రీ మారికాంబ అమ్మవారి జాతరలో కుస్తీపోటీలు ఆకట్టుకుంటున్నాయి. మూడు రోజుల నుంచి సాగుతున్న పోటీల్లో సోమవారం ఫైనల్స్ జరిగాయి. జిల్లాతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచీ మల్లయోధులు పాల్గొన్నారు. మహారాష్ట్ర, హరియాణా, మధ్యప్రదేశ్, పంజాబ్ లాంటి రాష్ట్రాల నుంచి కూడా కుస్తీవీరులు పాల్గొని సత్తా చాటారు.

సమస్యల సాధనకు దీక్ష



శివమొగ్గ: దళితులపై దాడులకు అడ్డుకట్ట వేయాలని దళిత సంఘర్ష సమితి (అంబేద్కర్ వాద) నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ ముందు సోమవారం నుంచి నిరాహార దీక్షను ప్రారంభించారు. టి.హెచ్. కాలేషప్ప నాయకత్వంలో బైఠాయించారు. సమస్యలను పరిష్కారం చేసే వరకు నిరసనను వదిలేది లేదని చెప్పారు. ఎస్‌సీపీటీఎస్‌సీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అక్రమాలపై విచారణ చేయాలని, ఈ నిధులను ఇతర పథకాలకు బదిలీ చేయరాదని కోరారు. శివమొగ్గ నగరంతో పాటు తాలూకాలో ఎస్‌సి, ఎస్టి కాలనీలలో రద్దు, మంచినీటి వసతి కల్పించాలని కోరారు.

బీజేపీలో చేరనున్న నెక్కంటి సూరిబాబు



నెక్కంటి సూరిబాబు

గంగావతి రూరల్: కొప్పళ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు నెక్కంటి సూరిబాబు బీజేపీలో చేరనున్నట్లు ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం తాలూకా కేంద్రానికి రానున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నళీన్ కుమార్ కటీల్ సమక్షంలో నెక్కంటిసూరిబాబుతోపాటు మరికొందరు ప్రముఖులు బీజేపీలో చేరతారని తెలిపారు.

సదుపాయాలు కల్పించకపోతే ఎన్నికల బహిష్కరణ



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయచూరు రూరల్: దేవదుర్గ తాలుకాలో పీఎం ఆదర్శ గ్రామంగా ఎంపికైన హోన్నటిగిలో సదుపాయాలు కల్పించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సంచాలకులు మారెప్ప మాట్లాడుతూ మూడేళ్లుగా అధికారులు గ్రామంవైపు కన్నెత్తి చూడలేదని, నిధులు కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామన్నారు. అనంతరం అధికారి హీరేమఠ్‌కు వినతిపత్రం అందించారు.

హెచ్‌ఎం ఆత్మహత్య

రాయచూరు రూరల్: పాఠశాల హెడ్‌మాస్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన విజయపుర జిల్లా సిందగి తాలూకా సానబాళలో చోటు చేసుకుంది. ఇదే తాలూకా కొరవారకు చెందిన బసవరాజ్ మల్లప్ప సానబాళలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తూ అదే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. అయితే తనను సీఆర్‌పీ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారంటూ సూసైడ్ నోట్ రాసి సోమవారం తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

స్వామీజీ దీక్షకు మద్దతు



స్వామీజీతో హెచ్‌ఆర్ శ్రీనాథ్

గంగావతి: వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కూడల సంగమ పీఠం జగద్గురు బసవజయ మృత్యుంజయ మహాస్వామి బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో చేపట్టిన దీక్షకు మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్.శ్రీనాథ్ మద్దతు ప్రకటించారు. తాము కూడా పోరాటంలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు.

సంత్ సేవాలాల్ జయంతికి రండి

గంగావతి: ఈ నెల 21న జరిగే సేవాలాల్ జయంతికి హాజరు కావాలని బంజార సమాజం నాయకులు ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లికి ఆదివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కాగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు రూ.50 వేలు అందజేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

వైమానిక ప్రదర్శనకు జనప్రవాహం



లోహ విహంగాల విన్యాసాలను తిలకిస్తున్న సందర్శకులు



హాజరైన దేశ విదేశీ ప్రతినిధులు

- లోపలకు వెళ్లేందుకు అనుమతి లేక రోడ్డుపైనుంచే వీక్షించిన సామాన్యులు
- వాహనాలతో రోడ్లు నిండటంతో స్తంభించిన ట్రాఫిక్
- విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు

సాక్షి బెంగళూరు: వైమానిక ప్రదర్శనకు వేదికైన యలహంక ఎయిర్‌స్టేషన్ సమీపంలోని ప్రాంతాలు సోమవారం జనసంద్రమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఏరో ఇండియాకు వేలాదిగా జనం తరలివచ్చారు. తొలి మూడు రోజులు ప్రముఖులు, ఎగ్జిబిటర్లు, దేశ, విదేశాంగా ప్రతినిధులు, అధికారులకు మాత్రమే వ్యాపార, వాణిజ్య ఒప్పందాల కోసం అనుమతి ఉంది. అయితే ఊహించని విధంగా ప్రదర్శనకు జనప్రవాహం మొదలైంది. ఆకాశంలో చక్కర్లు కొట్టే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను దగ్గరగా చూసేందుకు జనం పోటీ పడ్డారు. ఎయిర్ బేస్‌లోకి అనుమతి లేకపోవడంతో రోడ్డు బయట, ఇళ్లపై నుంచి తిలకించారు. జాతీయ రహదారి హుణసమారమహళ్లి వద్ద వేలాది మంది ప్రజలు గూమిగూడారు. విమాన విన్యాసాలను మొబైళ్లలో బంధించేందుకు పోటీ పడ్డారు. కాగా యలహంక ఎయిర్‌బేస్ బెంగళూరు విమానాశ్రయ రహదారిపై ఉంది. ఎయిర్ షోను తిలకించేందుకు జనం వాహనాల్లో వేలాదిగా తరలివచ్చి బారులు తీరారు. దీంతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ స్తంభించి విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రద్దీని తొలగించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

కర్ణాటక శౌర్యపరాక్రమాలకు పుట్టినిల్లు.

సాక్షి బెంగళూరు: కర్ణాటక ఆధ్యాత్మిక, శౌర్యపరాక్రమాల పుట్టినిల్లు అని, అంతటి ఈ చారిత్రక స్థలంలో ఏరో ఇండియా నిర్వహిస్తుండడం సంతోషంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కితాబిచ్చారు. ఏరో ఇండియా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎడిషన్ మారేకొద్దీ ఈ ప్రదర్శనపై దేశ ప్రజల్లో మక్కువ పెరుగుతోందన్నారు. గతంలో ఉన్న అన్ని రికార్డులను ఈ ఎడిషన్ ఏరో ఇండియా బ్రేక్ చేస్తోందన్నారు. ఇప్పటివరకు జరిగిన అన్ని ఎడిషన్ల కంటే ఈ ఏడాది జరిగే ఏరో ఇండియా అతి పెద్ద షో అని తెలిపారు. భారత సమగ్రత, అభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృషి అభినందనీయమన్నారు.

కంప్లి ఉత్సవం మరుపురాని ఘట్టం



గాయకుడిని సన్మానిస్తున్న మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే గణేష్



భరత నాట్యం చేసిన చిన్నారులతో ఎమ్మెల్యే గణేష్

కంప్లి: కంప్లి ఉత్సవం కంప్లి చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. రెండు రోజులుగా జరుగుతున్న కంప్లి ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలకు సహకరించిన పట్టవాసులు, సంఘ సంస్థలు, కళాకారులకు అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి శ్రీరాములతో కలిసి కళాకారులకు జ్ఞాపికలు అందజేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ఉత్సవాల ముగింపు సందర్భంగా నృత్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దివంగత పునీత్‌రాజ్‌కుమార్ నటించిన సినిమాల్లోని పాటలను గాయకులు ఆలపించగా ప్రేక్షకులు ఈలలు వేస్తూ డ్యాన్స్‌లు చేశారు. కన్నడ ప్రముఖ గాయకుడు విజయ్ ప్రకాష్ పాటలకు ఎమ్మెల్యే గణేష్ స్టెప్పులు వేశారు. మహిళా గాయకురాలు అనురాధాభట్ ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం గాయకులను మంత్రి, ఎమ్మెల్యే సన్మానించారు.

మలబార్ నగల పండుగ



ప్రదర్శనలో వినూత్న ఆభరణాలు

సాక్షి, బెంగళూరు: దేశంలోని అతిపెద్ద బంగారు, వజ్రాల రిటైల్ చైన్‌లలో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ జ్యువెలరీ ఫెస్టివల్‌ను ప్రారంభించింది. విలువైన రత్నాలు, అన్ కట్ డైమండ్స్‌తో పొదిగిన స్వచ్ఛమైన బంగారు ఆభరణాల ప్రత్యేక శ్రేణిని ప్రదర్శించడానికి జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్‌ని తీసుకొచ్చింది. కర్ణాటకలోని అన్ని స్టోర్లలో ఈ నెల 20 వరకు ఈ ప్రదర్శన సాగనుంది. సహజమైన, ధ్రువీకరించిన రత్నాలతో కూడిన వినూత్న డిజైన్లను పరిచయం చేయడం సంతోషంగా ఉందని సంస్థ చైర్మన్ ఎంపీ అహమ్మద్ అన్నారు.

నదిలో మునిగి ఇద్దరు బాలల మృతి

మైసూరు: కావేరి నదిలో చేపల పట్టడానికి వెళ్లిన ఇద్దరు బాలలు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన కుశాలనగర తాలూకాలోని కొడ్లూరు గ్రామంలో జరిగింది. బాలలు పృథ్వీ (7), ప్రజ్వల్ (6)లు సోమవారం మధ్యాహ్నం భోజనం కట్టుకుని సమీపంలోని కావేరి నదిలో చేపలను పట్టాలని వెళ్లారు. నదిలోకి దిగిన ఇద్దరికీ ఈత రాక పోవడంతో మునిగి మృత్యువాత పడ్డారు. సాయంత్రమైనా ఇంటికి రాక పోవడంతో తల్లిదండ్రులు గాలించగా నదిలో బాలల శవాలు ఉన్నట్లు తెలిసి పరుగున వెళ్లారు. ఈతగాళ్లు బాలల మృతదేహాలను వెలికితీశారు. కుశాల నగర పోలీసులు కేసు నమోదు చేశారు.

పొలంలోకి దూసుకెళ్లిన బస్సు

రాయచూరు రూరల్: కేఎస్ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన తెలంగాణలోని గద్వాల జిల్లా ఐజ మండలం మిట్టదొడ్డి వద్ద జరిగింది. రాయచూరు డిపోకు చెందిన బస్సు సోమవారం ఐజ నుంచి రాయచూరుకు వస్తుండగా మిట్టదొడ్డి వద్దకు రాగానే స్టీరింగ్ విరిగిపోయింది. బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన పొలంలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ప్రమాదంలో బస్సు ముందు అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు.

సమస్యలు పట్టని అధికారులు

రాయచూరురూరల్: సమస్యలు పట్టని రాయచూరు తాలూకా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మహేష్‌పై చర్యలు తీసుకోవాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంచాలకుడు హనుమంతు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయకపోవడంతో కట్టెల పొయ్యిలో వంటలు చేయాల్సి వస్తోందన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర అధ్యక్షుడు నళీన్‌కుమార్ కటీల్



మాట్లాడుతున్న నళీన్‌కుమార్ కటీల్

హొసపేటె: రాష్ట్రంలో బీజేపీ బలిష్టంగా ఉందని, రానున్న ఎన్నికల్లో అధికారంలో రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నళీన్‌కుమార్ కటీల్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నగరంలో నిర్వహించిన విజయసంకల్ప యాత్రలో ఆయన పాల్గొన్నారు. అనంతం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 70 సంవత్సరాలుగా జరగని అభివృద్ధి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే జరిగిందన్నారు. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. మంత్రులు ఆనంద్‌సింగ్, శశికలా జొల్లె, జిల్లా అధ్యక్షుడు చెన్న బసవనగౌడ తదితరులు పాల్గొన్నారు.

పులి దాడిపై అసెంబ్లీలో ఆగ్రహం

యశవంతపుర: కొడగు జిల్లాలో ఇద్దరిని పులి బలిగొన్న ఘటనపై అసెంబ్లీలో ఆగ్రహం వ్యక్తమైంది. సోమవారం బీజేపీ ఎమ్మెల్యే కేజీ బోపయ్య మాట్లాడుతూ పులి దాడి ఘటనలో అటవీ అధికారుల నిర్లక్ష్యం ఉందని ఆరోపించారు. జిల్లా డీఎఫ్ఓను తక్షణం సస్పెండ్ చేయాలన్నారు. పులి సంచారంపై ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోని కారణంగా ఇద్దరిని పొట్టనపెట్టుకుందన్నారు. అధికారుల నిర్లక్ష్యం కనపడితే కఠిన చర్యలు తీసుకొంటామని మంత్రి మాధుస్వామి హామీ ఇచ్చారు.

హెచ్‌ఎంను బదిలీ చేయాలని ధర్నా

రాయచూరురూరల్: తాలుకాలోని వడ్లూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పార్వతిని బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సోమవారం తాలుకా విద్యాశాఖాధి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. పాఠాలు బోధించడం లేదని, ఇదేమని అడిగితే తన భర్త పోలీసు అని, లాఠీలతో కొట్టిస్తానని బెదిరిస్తోందని విద్యార్థులు ఆరోపించారు. తమపై దొంగతనం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెను బదిలీ చేయాలని విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

గుణాత్మక విద్యను బోధించాలి

కంప్లి: విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశం ఉందని ఎమ్మిగనూరు మఠాధిపతి వామదేవ శివాచార్యులు అన్నారు. రాంసాగర గ్రామంలోని ప్రాథమిక పాఠశాల శతమనోత్సవంలో భాగంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కన్నడ భాషపై పట్టు సాధించాలన్నారు. గ్రామ ప్రముఖులు హెచ్.లింగనగౌడ మాట్లాడుతూ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమిని విరాళంగా ఇస్తామన్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్ ఖుర్షీద్ బేగం, గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు బీఎం.శివలీల, ఉపాధ్యక్షులు ఏకే చైత్రి, పీడీఓ కేహెచ్.శశికాంత్, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు బీ.బసవరాజ్, ఉపాధ్యక్షుడు మాళ్లిపద్మ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక, యువతి అనుమానాస్పదమృతి

రాయచూరు రూరల్: బాలిక, యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన రాయచూరు జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సింధనూరు తాలూకా ఆర్.హెచ్.క్యాంప్-3కి చెందిన లోతిక(20), నేహారిక(5) ఇంటి పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. బాలికతో కలిసి లోతిక స్నానం చేసేందుకు చెరువు వద్దకు వెళ్లింది. అయితే నేహరిక ఆదివారం చెరువులో శవమై కనిపించింది. మరో వైపు లోతిక తన ఇంటిలో ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. బాలిక మృతి విషయం తనపైకి వస్తుందనే భయంతో లోతిక ఆత్మహత్య చేసుకొని ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకటప్ప నాయక్ తెలిపారు.

పుట్టినరోజున అన్నదానం

బొమ్మనహళ్లి: బొమ్మనహళ్లి బీజేపీ నాయకుడు, సమాజ సేవకుడు హెచ్. శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పుట్టినరోజు సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అరికెరె వార్డు పరిధిలో ఉన్న హులిమావులో స్థానిక నాయకుడు మంజునాథ్ ఆధ్వర్యంలో శ్రీ సోమేశ్వర స్వామివారి సన్నిధిలో పూజలు చేసి అన్నదానం చేశారు. కరవే నాయకులు మహేశ్వర రెడ్డి, ఎస్.రాజేష్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

కోలారు వార్తలు...

జేడీఎస్‌కు సానుకూల పరిస్థితులు



సమావేశాన్ని ప్రారంభిస్తున్న నిఖిల్‌కుమార్‌స్వామి

కోలారు: జిల్లాలో జేడీఎస్‌కు సానుకూల పరిస్థితులు ఉన్నాయని, వచ్చేఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయబావుట ఎగురవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర యువ అధ్యక్షుడు నిఖిల్‌కుమార్ స్వామి అన్నారు. తాలూకాలోని తిప్పేనహళ్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోలారు అభ్యర్థి సిఎంఆర్ శ్రీనాథ్ సేవా కార్యక్రమాలతో ప్రజలకు దగ్గరయ్యారు. ఆయన్ను మంచి మెజార్టీతో గెలిపించాలన్నారు. జేడీఎస్ ప్రచారం చేస్తున్న పంచరత్న పథకాలను విమర్శిస్తున్న మాజీ సీఎం సిద్ధుకు కోలారులో ఓటమి తప్పదన్నారు. ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజులు, జేడీఎస్ అభ్యర్థి సిఎంఆర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

పథకాలు సామాన్యుల అవసరాలు తీర్చాలి



పుస్తకాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

కోలారు: పథకాలు సామాన్యుల అవసరాలు తీర్చినప్పుడే వారి జీవితాలు సాఫీగా సాగుతాయని ఎస్పీ ఎం. నారాయణ అన్నారు. రచయిత డాక్టర్ శివప్ప అరివు రచించిన నెలద కనసు జిల్లా అవసరాలు పుస్తకాన్ని సోమవారం నగరంలోని టి చన్నయ్య రంగమందిరంలో ఎస్పీ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తీసుకు రావాల్సి ఉందని అన్నారు. సాహితీవేత్తలు కోటిగానహళ్లి రామయ్య మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణపై ప్రభుత్వాలకు శ్రద్ధ లేదన్నారు. రఘునాథ్, అరివు శివప్ప, కోముల్ డైరెక్టర్ కాడేనహళ్లి నాగరాజ్, జేడీఎస్ నాయకుడు సిఎంఆర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడం కాంగ్రెస్‌కు చేతకాదు

- అది జేడీఎస్‌తో సాధ్యం
- మాజీ సీఎం కుమారస్వామి



మాట్లాడుతున్న కుమారస్వామి

హుబ్లీ: కాంగ్రెస్ వల్ల బీజేపీని ఓడించడం దుర్లభమేనని, అయితే అది జేడీఎస్‌తో సాధ్యపడుతుందని మాజీ సీఎం కుమారస్వామి అన్నారు. హుబ్బీడ ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి మాజీ సీఎం సిద్ధరామయ్య కారకుడని అన్నారు. మిశ్రమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ప్రభుత్వ పతనం గురించి మాట్లాడారని సిద్దుపై మండిపడ్డారు. బీజేపీ అక్రమాలను వెలుగులోకి తెచ్చింది తానేనని, సిద్ధరామయ్య కాదన్నారు. సిద్ధరామయ్య అపద్ధాల రామయ్య అని కుమారస్వామి ఎద్దేవా చేశారు. గోవాలో బీజేపీ నేతలు వివాదం చేశాని, ఎన్నికల సాకుతో ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బెంగళూరులో ఎయిర్ షోకు ప్రధాని మోదీ వస్తే పేదరికం తొలుగుతుందా ?అని మండిపడ్డారు. ముంబై కర్ణాటకలో పంచరత్న యాత్ర మార్చి 23 వరకు కొనసాగుతుందన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో రైల్వేలో ఉద్యోగం

- 32 సంవత్సరాల తర్వాత వెలుగులోకి

హుబ్లీ: బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంతో రైల్వేలో ఉద్యోగం సాధించిన ఘటన 32 ఏళ్ల తర్వాత వెలుగులోకి వచ్చింది. ప్రకాశం జిల్లా గిద్దలూరు తాలూకా పాదిలాకుంట పల్లెకు చెందిన మండ్లచక్రధర వెంకటసుబ్బయ్య వాల్మీకి సముదాయానికి చెందిన వ్యక్తి. అయితే కర్ణాటకలో వాల్మీకులు ఎస్టీలుగా ఉండటంతో ఇతను 1991 డిసెంబర్‌లో హుబ్లీ తహసీల్దార్‌కు నకిలీ పత్రాలు అందించి ఎస్టీ కుల ధ్రువీకరణపత్రం పొంది నైరుతి రైల్వేలో ఉద్యోగం పొందాడు. అతను ఉద్యోగంలో చేరి 32 సంవత్సరాలైంది. అతను సమర్పించిన పత్రాలు నకిలీవని తేలింది. దీంతో మండ్లచక్రధర వెంకటసుబ్బయ్య, తహసీల్దార్, ఆర్ఐ, గ్రామ లెక్కాధికారితో పాటు 15 మందిపై హుబ్లీ ఉపనగర పోలీసు ఠాణాలో కేసు దాఖలైంది.

పిల్లల హక్కులను పరిరక్షించాలి



జ్యోతి వెలిగిస్తున్న రూపాలి బెనర్జి

రాయచూరు రూరల్: పిల్లల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జాతీయ పిల్లల హక్కుల రక్షణ కమిషన్ సభ్యురాలు రూపాలి బెనర్జి అన్నారు. జిల్లా పంచాయతీ సభాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలను అరికట్టడం, పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా న్యాయమూర్తి దయానంద, పిల్లల హక్కుల రక్షణ కమిషన్ రాష్ట్రాధ్యక్షుడు నాగన గౌడ, జిల్లాధికారి చంద్ర శేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ శశిధర్, ఎస్పీ నిఖిల్, డిప్యూటీ డైరెక్టర్లు కుమార, మన్సూర్, వృషభేంద్రయ్య, సురంద్రబాబు పాల్గొన్నారు.

నివేదిక అందజేస్తాం

కల్యాణ కర్ణాటకలో బాలల హక్కుల ఉల్లంఘనలపై 2వేల వరకు ఫిర్యాదులు అందాయని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని పిల్లల హక్కుల రక్షణ కమీమిషన్ రాష్ట్రా ద్యక్షుడు నాగన గౌడ తెలిపారు. రాయచూరులో జరిగిన శిబిరంలో 150 ఫిర్యాదులు అందాయన్నారు.

వెల్లివిరిసిన మానవత్వం

- హిందూమతానికి చెందిన వృద్ధురాలికి ముస్లింల అంత్యక్రియలు

బనశంకరి: హిందూమతానికి చెందిన వృద్ధురాలికి ముస్లింలు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటారు. చామరాజనగర 5వ వార్డులో హిందూ కుటుంబానికి చెందిన నంజమ్మ(75) నివాసం ఉంటోంది. ఆమె ఇతర కులానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకోవడంతో కుటుంబసభ్యులు ఆమెను దూరంగా పెట్టారు. కొద్ది సంవత్సరాల క్రితం భర్త మృతి చెందగా సంతానం లేని ఆమె ఒంటరిగా నివాసం ఉంటోంది. సోమవారం నంజమ్మ మృతి చెందగా అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు ముందుకు రాలేదు. దీంతో నగరసభ సభ్యురాలు తౌసియాబాను, ఆమె భర్త ఇస్తార్‌పాషా, ఉమర్, రుమాన్, సమీవుల్లా కలిసి హిందూసంప్రదాయం ప్రకారం నంజమ్మకు అంత్యక్రియలు నిర్వహించారు.

నాగవల్లిలో అమానుషం

మానవత్వానికి మచ్చ తెచ్చే ఘటన చామరాజనగర తాలూకా నాగవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రంగశెట్టి (65) ఆదివారం మృతి చెందారు. అయితే గ్రామం నుంచి రంగశెట్టి కుటుంబాన్ని బహిష్కరించారనే కారణంతో అంత్యక్రియలకు వారి సముదాయానికి చెందిన ప్రజలు ముందుకు రాలేదు. పైగా షామియానాను అద్దెకు తీసుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. చివరకు ఎలాగో అంత్యక్రియలు నిర్వహించామని మృతుడి భార్య మహదేవమ్మ కన్నీరుపెట్టింది. ఘటనపై తహసీల్దార్ విచారించగా మేము ఎలాంటి బహిష్కరణ చేయలేదని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై నిజానిజాలు వెలుగులోకి తెస్తామని సీఐ శ్రీకాంత్ తెలిపారు.

ప్రేమికులకు గులాబీలు..రైతులకు కాసులు



గులాబీలను కట్టలుగా కడుతున్న దృశ్యం



రవాణాకు సిద్ధం చేస్తున్న దృశ్యం

- ప్రేమికుల రోజుకు సిద్ధమైన గులాబీలు

మాలూరు: ప్రేమను వ్యక్తం చేయడంలో, తమ మనసులో ఉన్న మాటను ప్రేయసికి చెప్పడంలో గులాబీల పాత్ర ఎంతో ఉంది. అందుకే ప్రేమికుల రోజు వచ్చిందంటే గులాబీలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. మంగళవారం ప్రేమికుల దినోత్సవానికి కోలారు జిల్లా నుంచి వివిధ రకాల గులాబీ పుష్పాలు సిద్ధం చేశారు. మాలురు తాలూకా లక్కూరు ఫిర్కాలో వేల ఎకరాల విస్తీర్ణంలో రెడ్ గులాబి, బ్లాక్ మ్యూసిక్, పింక్, తాజ్ మహల్, కార్‌పెట్, షకీరా, రాయల్ స్టాండర్డ్, నెబ్‌లెస్, గ్రాండ్, సమురాయ్, డచ్, హాట్యాట్, ఫైవ్‌స్టార్ తదితర రకాల పూలను అధికంగా పండిస్తున్నారు. 20 గులాబీలను కట్టగా చేసి రైతులు వ్యాపారులకు విక్రయిస్తారు. వ్యాపారులు వీటిని బాక్సులు, సంచులలో నగర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.

అధికారంలోకి వస్తే రుణపరిమితి పెంపు

- కాంగ్రెస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు
- మాజీ సీఎం సిద్ధరామయ్య



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ సిద్ధరామయ్య

కోలారు: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు అందిస్తున్న రూ.50 వేల వడ్డీ రహిత రుణాలను రూ.లక్షకు పెంచుతామని, రైతులకు ఇస్తున్న రూ. 3 లక్షల రుణాలను రూ. 10 లక్షలకు పెంచుతామని మాజీ సీఎం సిద్ధరామయ్య హామీ ఇచ్చారు. కోలారు తాలూకాలోని వేమగల్‌లో సోమవారం నిర్వహించిన మహిళా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోలారులో ఏపీఎంసీ మార్కెట్‌కు 100 ఎకరాల స్థలాన్ని మంజూరు చేస్తామన్నారు. టమాట, మామిడి గ్రేడింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. కోలారు నుంచి పోటీ చేయాలని తీవ్రంగా ఒత్తిడి రావడం వల్లనే ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు. కోలారులో బీజేపీ, జేడీఎస్‌లు ఒక్కటైనా తనకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కోలారులో తనకు వ్యతిరేకంగా కొంతమంది దళిత నాయకులు కరపత్రాలు పంచడం వెనుక ఆర్ఎస్ఎస్ నాయకుల కుట్ర ఉందన్నారు. రాష్ట్రానికి నరేంద్రమోదీ, అమిత్‌షా వంద సార్లు వచ్చి వెళ్లినా కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రమేష్‌కుమార్, కృష్ణబైరేగౌడ, శ్రీనివాసగౌడ, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురాతత్వ సంపదను కాపాడుకోవాలి

శ్రీనివాసపురం : పురాతత్వ సంపదను రక్షించి భావితరాలకు అందించాలని డీఈఓ కృష్ణమూర్తి విద్యార్థులకు సూచించారు.సాక్షరతా శాఖ, మైసూరు పురాతత్వ సంగ్రహాలయాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సుభాష్ పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాలూకా స్థాయి పోటీలు నిర్వహించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. విషయ పరీక్షకులు శంకరేగౌడ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, కార్యదర్శి ధన్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి


రక్తదానం చేస్తున్న దృశ్యం

మైసూరు: అత్యవసర సమయాల్లో ప్రాణాలను నిలబెట్టే రక్తదానం ఎంతో గొప్పదని, యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని మైసూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుస్వామి అన్నారు. సోమవారం కళాశాలలో జీవధార రక్తనిధి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెద్ద సంఖ్యలో యువకులు, విద్యార్థులు రక్తదానం చేశారు.

బోనులో చిక్కిన చిరుత



శివమొగ్గ: శివమొగ్గ తాలూకా మల్లాపురం గ్రామంలో కొన్ని రోజులుగా ప్రజలకు చెమటలు పట్టిస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. రెండు చిరుతలు సమీప గ్రామాల్లో కనిపిస్తున్నాయి. దీంతో రైతులు పొలాల వైపు వెళ్లడానికి భయపడిపోతున్నారు. ఇటీవల అటవీ సిబ్బంది పలుచోట్ల బోనులు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి ఆహారం కోసం వచ్చిన ఓ చిరుత బోనులో చిక్కింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు చిరుతను తరలించారు. మరో చిరుత కోసం గాలింపు ముమ్మరం చేశారు.

మగ్గాల ఇంట్లో చోరీ


చోరీకి గురైన ఇల్లు

దొడ్డబళ్లాపురం: మగ్గాల ఇంట్లో జొరబడ్డ దొంగలు ముడిసరుకు అపహరించిన సంఘటన దొడ్డ పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ పరిధిలోని ముత్తాంబిక నగర్ 4వ క్రాస్‌లో ఉంటున్న ప్రశాంత్‌రావ్ అనే వ్యక్తికి చెందిన మగ్గం ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం తెల్లవారుజామున ఈ చోరీ జరిగినట్టు సమాచారం. మగ్గం ఇంటి తలుపుల తాళాన్ని పగలగొట్టి లోపల జొరబడ్డ దొంగలు రూ.20 వేల విలువైన చీరల తయారీ ముడిసరుకు అపహరించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి కార్మికుడు ఆత్మహత్య

- భార్య కూడా ఆత్మహత్యాయత్నం

మైసూరు: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన కార్మికుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోగా, విషయం తెలుసుకున్న అతని భార్య అదే చెరువులో ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మడికేరి సమీపంలో ఉన్న హోరూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికంగా ఉంటున్న విజయ్ (32), సౌమ్య (29) భార్య భర్తలు. ఇటీవల ఇద్దరి మధ్య తీవ్ర మనస్పర్థలు వచ్చినట్లు సమాచారం. కొన్ని రోజుల నుంచి తీవ్ర మనస్తాపంతో ఉన్న విజయ్ సోమవారం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త మృతి విషయం తెలుసుకున్న భార్య కూడా అదే చెరువులో దూకింది. అక్కడ ఉన్న వారు ఆమెను రక్షించి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జేడీఎస్‌దే అధికారం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిఖిల్

తుమకూరు: వచ్చే శాసనసభ ఎన్నికల్లో జేడీఎస్ అధికారం చేపట్టడం ఖాయమని ఆ పార్టీ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి అన్నారు. సోమవారం తుమకూరు నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆవరణంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ... జేడీఎస్ పార్టీ పేదల పార్టీ అని, మైనార్టీలు సైతం జేడీఎస్ వైపు ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో అధికారం చేపడుతామని అన్నారు. ముఖ్యమంత్రిగా కుమారస్వామి బాధ్యతలు చేపట్టిన వెంటనే పంచరత్న పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రచారం చేపట్టాలన్నారు.

ఒంటరి మహిళ దారుణహత్య

శివాజీనగర: బెంగళూరులో ఒంటరి మహిళను ఓ కిరాతకుడు దారుణంగా హత్య చేశాడు. నగరంలోని నంజప్ప సర్కిల్ వద్ద ఓ ఇంట్లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంట్లోకి చొరబడి దుండగులు కౌర్ ముబీనా (34)ను గొంతుకోసి అతి కిరాతకంగా హత్య చేశాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి హత్యకు కారణాలను అన్వేషిస్తున్నారు.

భర్త హత్యకు భార్య సుపారీ

- తుమకూరు జిల్లాలో దారుణం

తుమకూరు: జీవితాంతం తోడునీడగా ఉంటానని పెళ్లిలో ప్రమాణం చేసిన భార్య దారి తప్పి కట్టుకున్నోడిని కడతేర్చింది. పిన్ని కుమారుడితో అక్రమ సంబంధం పెట్టుకుని భర్తను హత్య చేయడానికి రౌడీషీటర్లకు భార్య రూ. 5 లక్షల సుపారీ ఇచ్చి పరలోకానికి పంపించిన వైనమిది.

తుమకురు జిల్లాలోని కుణిగల్ తాలూకాలోని సీనప్పనహళ్ళి గ్రామానికి చెందిన మంజునాథ్ హత్యకు అతని భార్య హర్షిత (20) కిరాయి ఇచ్చింది. ఈ కేసులో ఆమెను, ఆమె పిన్ని కుమారుడు రఘు, ఇతని మిత్రుడు రవికిరణ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం మంజునాథ్ ఫిబ్రవరి 3వ తేదీన కుణిగల్ పట్టణంలో స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని మళ్లీ సీనప్పనహళ్ళి గ్రామంలోని సొంత ఇంటికి వచ్చి నిద్రపోయాడు.


భర్త మంజునాథ్‌తో భార్య హర్షిత (ఫైల్)


పోలీసుల అదుపులో నిందితులు

అర్ధరాత్రి బయటకు పిలిచి హత్య..

అతనికి అర్ధరాత్రి ఫోన్ రావడంతో మాట్లాడుతూ బయటికి వెళ్లిపోయాడు. ఆపై మళ్లీ ఇంటికి రాలేదు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కిత్నమంగళ చెరువులో మంజునాథ్ శవమై తేలాడు. దీంతో మంజునాథ్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేసి భార్య హర్షితను అరెస్టు చేశారు. ఆమె చెప్పిన వివరాలతో మిగతా ఇద్దరిని పట్టుకున్నారు. భార్యే ఈ హత్య చేయించిందని గ్రామస్తులు కూడా ఆరోపించారు. రఘు, రవికిరణ్‌లు మంజునాథ్‌కు ఫోన్ చేయించి చెరువు వద్దకు పిలిపించారు. అక్కడ అతన్ని హత్య చేసి చెరువులో పడేసి వెళ్లినట్లు ఒప్పుకున్నారు. కేసు విచారణలో ఉంది.

22 ఏళ్ల క్రితం విడిపోయి.. మళ్లీ ఒక్కటై...

- లోక్ అదాలత్‌లో దండలు మార్చుకున్న జంట


జడ్జి సమక్షంలో ఒక్కటైన దంపతులు

పావగడ: ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 22 ఏళ్ల క్రితం విడిపోయిన ఓ జంట మళ్లీ ఒక్కటైన అరుదైన ఘటన స్థానిక మున్సిఫ్ కోర్టులో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు...తాలూకాలోని హలిబెట్ట తండాకు చెందిన చిట్టిబాయి, శిరాద నాగరాజ నాయక్ దంపతులు కొన్నేళ్ల క్రితం సీనియర్ సివిల్ కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్నుంచి కేసు కొనసాగుతూనే ఉంది. పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహించారు. కొన్నేళ్లుగా ఈ విడాకుల కేసు కొనసాగుతుండటంతో సీనియర్ సివిల్ న్యాయమూర్తి హరిణి ప్రత్యేక శ్రద్ధ చూపారు. కోర్టుకు వచ్చిన ఇద్దరితో సావధానంగా మాట్లాడారు. దంపతుల మధ్య ఆర్థిక ఇబ్బందులు, గొడవలు సహజమేనని, సర్దుకుని పోవాలని, విడిపోతే కష్టనష్టాలను ఎదుర్కోవాల్సి, పిల్లలు భవిష్యత్‌ను కూడా చూడాలని వారికి సూచించారు. దీంతో చిట్టిబాయి, శిరాద నాగరాజ దంపతులు కలిసి ఉండటానికి న్యాయమూర్తి ముందు అంగీకరించారు. అనంతరం న్యాయమూర్తి సమక్షంలో ఇద్దరు దండలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాది యజ్ఞ నారాయణ శర్మ, ఏఎస్ రఘునందన్, శిరాజ్ జాఫర్, ప్రభాకరరెడ్డి, రమేశ్‌లు తదితరులు పాల్గొన్నారు.

లారీ- కారు ఢీ, డ్రైవర్ మృతి


ప్రమాదంలో స్తంభించిన ట్రాఫిక్

మైసూరు: కారు– లారీ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో కారు డ్రైవర్ మరణించగా ముగ్గురు గాయపడ్డారు. ఈ ప్రమాదం కొడగు జిల్లా మడికెరిలోని గోణికొప్ప కుక్కేరి వద్ద సోమవారం జరిగింది. మృతుడు సదన్ చంగప్ప (49) గుర్తించారు. మధ్యాహ్నం విరాజపేటె వైపు నుంచి మైసూరుకు వస్తున్న లారీ, గోణికొప్ప నుంచి విరాజపేటెకు వెళుతున్న వ్యాగనార్ కారు ఢీకొన్నాయి. కారు డ్రైవర్ అక్కడికక్కడే మరణించగా, అందులోని ముగ్గురికి గాయాలు అయ్యాయి. గోణికొప్ప పోలీసులు వచ్చి బాధితులను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

కారును ఢీకొన్న బస్సు

చిన్నారి మృతి.. నలుగురికి గాయాలు

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా కడబ తాలూకా మధ్యాళ వద్ద బస్సు కారును ఢీకొన్న ఘటనలో చిన్నారి మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం ఉప్పినంగడి–సుబ్రమణ్య రాష్ట్ర రహదారి మధ్యాళ వద్ద జరిగింది. మధ్యాళ నుంచి సుబ్రమణ్యకు వెళ్తున్న కారును కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొంది. కారులో వెళ్తున్న వారు బెంగళూరుకు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. నలుగురు క్షతగాత్రులను కడబ ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పుత్తూరు ఆస్పత్రికి తరలించారు.

ఆడిట్ కోసం వచ్చి మృత్యువాత

మండ్య: చెన్నై నగరం నుంచి మండ్య జిల్లాలోని మళవల్లి పట్టణంలో ఉన్న కర్ణాటక బ్యాంక్ ఆడిటింగ్ కోసం వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. మృతుడిని కర్ణాటక బ్యాంక్ ఆడిటర్ లక్ష్మి నరసింహ (59)గా గుర్తించారు. ఇదే ఘటనలో మరో ఇద్దరు గాయపడ్డారు. ఉదయం బ్యాంకులో ఆడిట్ చేసిన లక్ష్మీ నరసింహ మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇద్దరు సిబ్బందితో కలిసి బయటకు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా ఓ బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన లక్ష్మీ నరసింహను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నిందితుడికి ఎస్‌డీపీఐ టికెట్ ?

శివాజీనగర: బీజేపీ కార్యకర్త ప్రవీణ్ నెట్టారు హత్య కేసు ఆరోపణలు ఎదుర్కొంటున్న శాఫీ బెళ్లారకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌డీపీఐ పార్టీ నుంచి పుత్తూరు టికెట్ ప్రకటించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు కార్యాచరణ రూపొందిస్తున్న ఎస్‌డీపీఐ, హత్య కేసులో జైలుపాలైన శాఫీ అనే వ్యక్తికి టికెట్ ప్రకటించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతను కేంద్ర దర్యాప్తు సంస్థ ఆధీనంలో ఉన్నాడు. గత ఏడాది జులైలో ప్రవీణ్ హత్యకు గురైన విషయం తెల్సిందే.

అలరించిన నాట్యం


నాట్య ప్రదర్శన

బనశంకరి: నగరంలోని నయన ఆడిటోరియంలోని ఆదివారం రాత్రి కన్నడ భవనంలో కళాయాన నృత్య పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన నృత్యపర్వ కార్యక్రమంలో భరతనాట్య ప్రదర్శనలు సభికులను అలరించాయి. దేవరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పురందర దాసకీర్తన గజవదనా బేడువె ప్రార్థనతో ప్రారంభమైన బాలికల నృత్యం తదుపరి నగరంలో వివిధ నాట్య పాఠశాలల వారు నృత్యాలను ప్రదర్శించారు. ప్రియాంకరావ్, దీప్తి రాధాకృష్ణ, డా రక్షాకార్తీక్, బాలవిశ్వనాథ్, పద్మినిశ్రీధర్, డా మాలాశశికాంత్‌లు వివిధ కీర్తనలకు నాట్యం చేశారు. డా రక్షాకార్తీక్ త్యాగరాజు చరిత్రపై అభినయించిన నృత్య రూపకం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. అతిథులుగా విచ్చేసిన శీలాచంద్రశేఖర్, చంద్రులు కళాకారులను అభినందించారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరు యువకులు...

కెలమంగలం: ప్రభుత్వ ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. వివరాలు.. డెంకణీకోట తాలూకా తళి నుంచి ప్రయాణికులను తీసుకొని హోసూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును మదగొండపల్లి వద్ద బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై వెళ్తున్న కర్ణాటకలోని హాసన జిల్లా కోనసూరు గ్రామానికి చెందిన రాజేష్ (21) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తీవ్ర గాయాలేర్పడిన చిక్కబళ్లాపుర యువకుడు విజయ్ (20) ని హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక మృతి చెందాడు. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని తెలిసింది. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు తళి పోలీసులు తెలిపారు.

జానపదాలు గ్రామీణుల జీవనాడి

గౌరిబిదనూరు: జానపద గీతాలు గ్రామీణ ప్రజల జీవనాడి అని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 దాకా డా.హెచ్‌ఎన్ కళా భవనంలో గడి అభివృద్ధి ప్రాధికార, చిరంత ట్రస్ట్, జనపద గాయన కళా పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ జానపద కళాకారుల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రదేశాలలో వరినాట్లు, కోతల సమయంలో, ధాన్యం దంచేటపుడు, రాగులు విసిరేటపుడు లయబద్ధంగా జనపద పాటలు పాడడం ఆనవాయితీ అన్నారు. సవితక్క, జయంతి శ్రీనివాస్, కుణిగల్ రామచంద్ర, అశ్వత్థ, పద దేవరాజ్, సిద్దరాజు, దివ్యా, ఆనంద్ కళాకారుల జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దప్పు కళాకారుడు పద్మశ్రీ పిండిపాపనహళ్లి వెంకటప్పను న్మానించారు. కార్యక్రమంలో నగరసభ సభ్యులు డిజె చంద్రమోహన్, మార్కెట్ మోహన్, దేవీ మంజునాథ్, బాలాజీ, సీఐ సత్యనారాయణ, బైసాని అశోక్,ఎస్‌ఎస్ నవీన్, డా కెవి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వ్యాపారిని హత్య చేసిన వైద్యుడు అరెస్ట్

శివాజీనగర: ఆర్థిక లావాదేవీల విషయంలో జరిగిన గొడవ హత్యతో అంతమైంది. బంగారు వ్యాపారి నుంచి అప్పు తీసుకున్న వైద్యుడు అతన్నే కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటన బెళగావి జిల్లా గోకాక్‌లో చోటు చేసుకుంది. వైద్యుడు సచిన్‌ను గోకాక్ పోలీసులు అరెస్ట్ చేశారు. బంగారు వ్యాపారి రాజు అదృశ్యమైన కేసును పసిగట్టిన పోలీసులకు వైద్యుడే హంతకుడని తేలింది. డాక్టర్ సచిన్ శిరగావి, వ్యాపారి రాజు మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవ జరిగింది. డాక్టర్ సచిన్.. రాజు నుంచి నగదు తీసుకున్నట్లు తెలిసింది. అప్పు చెల్లించాలని అడిగినపుడు గొడవ ఆరంభమైంది. ఇదే విషయంపై మాట్లాడేందుకు రావాలని చెప్పి డాక్టర్ సచిన్, రాజును ఆసుపత్రికి పిలిపించుకొన్నాడు. ఆసుపత్రికి వెళ్లిన రాజు ఆదృశ్యమయ్యాడు. ఈ విషయంపై గోకాక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. డాక్టర్ సచిన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా రాజును కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు, ఆ తరువాత శవాన్ని కాలువలోకి పారవేసినట్లు నోరు విప్పాడు. సచిన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

రక్తదానం మహాదానం

- మంత్రి ఆర్ అశోక్

బనశంకరి: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం దానం చేయడం మహాదానమని రెవెన్యూశాఖామంత్రి ఆర్.అశోక్ తెలిపారు. సోమ వారం పద్మనాభనగరలోని బీఎస్‌కే జీవాశ్రయ రక్త కేంద్రాన్ని మంత్రి ఆర్.అశోక్ ప్రారంభించి మాట్లాడారు. నేడు రక్తం అమూల్యమైందని, ఆరోగ్యవంతులు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. ఎమ్మెల్సీ టీఏ.శరవణ మాట్లాడుతూ...ప్రమాదాల్లో గాయపడిన వారికి రక్తం ఎంతో అవసరమవుతుందని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. సతీశ్‌గౌడ, ఎంఎస్.వినోద్ పీ.గౌడ, వెంకట్ కే.రెడ్డి, శంకర్‌రెడ్డి,సునీల్ పద్మయ్య కోట్యాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలయేసు వార్షికోత్సవం



విజయపుర(బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలోని బాలయేసు ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయేసు విగ్రహాన్ని క్రైస్తవులు ఊరేగించారు. ఊరేగింపులో ధర్మ గురువులు ఫాదర్ వాలెంటైన్, ఆంథోణి రాజ్, సీఎంఎఫ్ ధార్మిక సభ్యుడు గురు రఘువీర్ మాణవత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి హోంగసంద్రలో ఉన్న హోలీ పోరాన్ చర్చ్ వార్షికోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. వేడుకలను ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి చర్చ్ ఫాదర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం చిన్నారులతో పాటు పెద్దలు దైవగీతాలను ఆలపించారు. అనంతరం సతీశ్‌రెడ్డిని మైసూరు పేటాతో సన్మానించారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజలు



తుమకూరు: తుమకూరు జిల్లా శిరా తాలూకా హులికుంటె సమీపంలో ఉన్న క్యాదిగుంటె గ్రామ శివాలయంలో నంది ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజలను సోమవారం స్ఫటికపురి మహాసంస్థాన మఠానికి చెందిన పీఠాధ్యక్షుడు డాక్టర్. శ్రీ నంజావదూత మహా స్వామీజీ నెరవేర్చారు. కార్యక్రమంలో సమాజ సేవకుడు క్యాదగుంటె తిప్పేస్వామి, మీనాక్షి తిప్పేస్వామి, పంచాయతీ సభ్యుడు నాగేష్, డైరి రంగనాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

యశవంతపుర: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన సోమవారం బెంగళూరు కబ్బన్ పార్క్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. నగరంలోని ఎంజీ రోడ్డులో ఓ వాహనం నుంచి ఆయిల్ లీక్ అయ్యింది. అదే రోడ్డుపై ఓ మహిళ బైక్‌పై వెళ్తుండగా వాహనం స్కిడ్ అయ్యింది. దీంతో ఆమె రోడ్డుపై పడిపోవడంతో వెనక వస్తున్న టిప్పర్ లారీ దూసుకెళ్లింది. బలమైన గాయలతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. నాణ్యతలేని హెల్మెట్ ధరించటం వల్ల తలకు బలమైన గాయలైనట్లు తెలిసింది. కబ్బన్‌పార్క్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుని విచారణ చేస్తున్నారు.

లాయర్ల ఆందోళన

చింతామణి: దేశంలో లాయర్లపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి లాయర్ల పరిరక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చింతామణి లాయర్లు సోమవారం విధులు బహిష్కరించి ఆందోళన చేశారు. లాయర్ల సంఘం అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ...తెలంగాణ, కర్ణాటకలోని హోసపేట కోర్టు ఆవరణలోనే లాయర్లను హత్య చేశారని తెలిపారు. అనేక ప్రాంతాల్లో నిరంతరం దాడులు జరుగుతున్నాయని, దీంతో రక్షణ కరువైందన్నారు. వెంటనే చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో లాయర్లు ప్రసాద్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓకు వీడ్కోలు



చిక్కబళ్లాపురం: బదిలీపై వెళ్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. సోమవారం ఇక్కడి పాలక మండలి ఆడిటోరియంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో శివశంకర్ మాట్లాడుతూ... రెండున్నరేళ్లు జిల్లాలో పనిచేశానని, సంతోషంగా, సంతృప్తికరంగా విధులు నిర్వర్తించానన్నారు. సిబ్బంది కూడా ఎంతో సహకరించారని అందరికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు కొత్త సీఈఓ ప్రకాశ్‌కు స్వాగతం పలికారు. అనంతరం శివశంకర్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. కలెక్టర్ నాగరాజు, ఏడీసీ తిప్పేస్వామి, సబ్ కలెక్టర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15 వాహనాలకు జరిమానా

దొడ్డబళ్లాపురం: చింతామణి నుంచి 15 క్యాంటర్లలో 200 జీవాలను తరలిస్తుండగా దొడ్డ పట్టణ పరిధిలోని టీబీ సర్కిల్లో స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంగతి తెలిసిందే. సోమవారం అన్ని డాక్యుమెంట్లను పరిశీలించిన పోలీసులు నిబంధనలు పాటించని కారణంగా వాహనదారులకు జరిమానా విధించి వాటిని వదిలేసారు.

అడవికి నిప్పు.. ఐదుగురు అరెస్ట్


పట్టుబడిన నిందితులు

మండ్య: మండ్య జిల్లా హలగూరు సమీపంలో ఉన్న ధనగూరు వద్ద ఉన్న శింషా అటవీ ప్రాంతానికి నిప్పు పెట్టిన ఐదుగురిని అటవీ అధికారులు అరెస్ట్ చేశారు. నిందితులు హలగూరు సమీపంలో ఉన్న బుయ్యనదొడ్డి గ్రామానికి చెందిన నందన్‌శర్మ, నవీన్ శర్మ, గోవిందస్వామి, బెంగళూరుకు చెందిన ఆసీఫ్ ఖాన్, బాష్షు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి చేపల వల, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా 14 రోజులు జుడీషియల్ కస్టడీకి తరలించారు.

హోసూరు వార్తలు..

చికిత్స పొందుతూ రైతు మృతి

హోసూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బేరికె పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని ముగలపల్లి గ్రామానికి చెందిన రైతు తిమ్మరాయప్ప (42). ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా అకస్మాత్తుగా అదుపుతప్పి కిందపడ్డాడు. క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఇద్దరు మహిళల ఆత్మహత్య

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి, సింగారపేట ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకొన్నారు. వివరాల మేరకు క్రిష్ణగిరి మారియమ్మన్ ఆలయ వీధికి చెందిన మురుగేషన్ భార్య వళ్లి (55) కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. క్రిష్ణగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సింగారపేట సమీపంలోని నడుపట్టి గ్రామానికి చెందిన శేఖర్ భార్య కలై సెల్వి (45). కటుంబకలహాల వల్ల జీవితంపై విసుగు చెంది విష మాత్రలు తిని ఆత్మహత్యకు యత్నించింది. ఊత్తంగేరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటనపై సింగారపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ దీపక్ జేకబ్ అధ్యక్షతన జరిగిన ఫిర్యాదుల స్వీకరణలో తాగునీరు, రోడ్లవసతి, వీధిదీపాల ఏర్పాటు, ఉచిత కుట్టు యంత్రాలు, ఇళ్లపట్టాలు, వృద్ధాప్య పెన్షన్, ఆర్థిక సాయం, విద్యాసహాయ నిధి కోరుతూ 296 మంది ఫిర్యాదులను అందజేశారు. వినతిపత్రాలను స్వీకరించిన కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

హత్య చేసి ఉరి వేశారా?

కెలమంగలం: కెలమంగలం సమీపంలో అపరిచిత వ్యక్తి అనుమానాస్పద మృతి చెందాడు. చిన్నట్టి వద్ద గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొన్న స్థితిలో ఉన్నట్లు స్థానికులు కెలమంగలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ శవాన్ని డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని వయస్సు సుమారు 40 ఏళ్ల వయసు ఉంటుందని, శవంపై గాయాలున్నట్లు, ఎవరో హత్య చేసి ఉరికి వేలాడదీసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. విచారణ చేపట్టారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న చైర్మన్

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమితి కళుగొండపల్లి గ్రామపంచాయతీలో సోమవారం అభివృద్ధి పనులకు యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కళుగొండపల్లి పంచాయతీలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతూ వచ్చారు. స్పందించిన అధికారులు రూ. 32 లక్షల నిధులు మంజూరు చేశారు. సోమవారం ఉళివీరనపల్లి గ్రామంలో జరిగిన భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ శ్రీనివాసరెడ్డి పాల్గొని పనులు ప్రారంభించారు. పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీ ప్రభాకర్, బీడీవో విమల్‌కుమార్, జిల్లా కౌన్సిలర్ మమత మంజునాథ్, యూనియన్ కౌన్సిలర్ నాగవేణి ప్రభాకర్, పంచాయతీ ఉపాధ్యక్షురాలు చైత్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే రామచంద్రన్

కెలమంగలం: తాలూకా కేంద్రం డెంకణీకోటలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 25 జట్లు పాల్గొన్నాయి. రాత్రి గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రధాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ ముఖ్య అతిథిగా పాల్గొని మొదటి స్థానంలో నిలిచిన పాండిచ్చేరి జట్టుకు రూ. 50 వేల నగదు బహుమతి, జ్ఞాపిక, రెండవ బహుమతి గెలుచుకొన్న సేలం జట్టుకు రూ. 30 వేల నగదు బహుమతి, జ్ఞాపికను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సఫీర్, యూనియన్ కౌన్సిలర్లు ప్రశాంత్, చెన్నవీరప్ప, నిచ్చెల్ రమేష్, సీపీఐ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు సాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో ఏనుగు మృతి


విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఏనుగు

క్రిష్ణగిరి: రాయకోట సమీపంలో రైతు పొలంలో బోరుబావికి అమర్చిన విద్యుత్ వైరును తొక్కిన ఏనుగు కరెంటు షాక్‌తో మృతి చెందింది. కొన్నిరోజుల క్రితం బెంగళూరు బన్నేరుఘట్ట ప్రాంతం నుంచి వలస వచ్చిన వందకుపైగా ఏనుగులు జవుళగిరి, డెంకణీకోట, కెలమంగలం, ఉడేదుర్గం, శ్యానమావు అటవీ ప్రాంతాల్లో మకాం వేశాయి. శ్యానమావు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న 80 ఏనుగుల మందను అటవీశాఖాధికార్లు కర్ణాటకవైపు మళ్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం రాయకోట సమీపంలోని వెలకలహళ్లి గ్రామం వద్ద రైతు బోరుబావి వద్ద ఓ ఏనుగు సంచరిస్తూ కరెంటు తీగను తాకడంతో షాక్ గురై ప్రాణాలు వదిలింది. రాయకోట అటవీశాఖాధికార్లు, పశువైద్యులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని కళేబరానికి అక్కడే పోస్టుమార్టం జరిపి పాతిపెట్టారు.

క్లుప్తంగా...

తీరంలో 'గిటారి' చేప



సముద్రంలో దొరికిన గిటారి

కృత్తివెన్ను: సముద్రంలో అరుదుగా దొరికే చేప కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలోని ఒర్లగొందితిప్ప వద్ద సోమవారం మత్స్యకారులకు చిక్కింది. రైనోబోటస్ గ్రాన్యులేటస్ అనే శాస్త్రీయనామం కలిగిన ఈ చేప సుమారు 30 కేజీల బరువు ఉంది. స్థానికంగా 'గిటారి'గా, తెరపాయిగా పిలిచే ఈ చేపను ఇక్కడి మత్స్యకారులు పట్టుకున్నారు. ఈ ప్రాంతంలో చాలా అరుదుగా దొరికే ఈ చేప సమయాన్ని బట్టి మార్కెట్‌లో ధర పలుకుతుందని, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మార్కెట్‌కు దీన్ని తరలించినట్లు స్థానిక వ్యాపారి జె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

కురుక్షేత్రలోని ఆలయాల సందర్శన

నాల్గో రోజు కొనసాగిన లక్ష చండీ మహాయజ్ఞం



స్థానేశ్వర్ మహాదేవ ఆలయంలో స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణ రాష్ట్రం కురుక్షేత్రలో జరుగుతున్న లక్ష మహాచండీ యజ్ఞం నిర్వహణలో భాగంగా సోమవారం శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి భద్రకాళి ఆలయం, పరశురాముడు సృష్టించిన బ్రహ్మసరోవర్, బ్రహ్మదేవుడు తపస్సు చేసిన ప్రాంతం సందర్శించారు. తర్వాత శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేసిన ప్రాంతమైన జ్యోతి సర్‌కు వెళ్లారు. ఇదే ప్రాంతాన్ని ఆదిశంకరాచార్యులు సందర్శించి శ్రీకృష్ణుడికి గీతోపదేశం చేసినట్లు నిర్ధారించారు. ఈ సందర్భంగా స్వామీజీ ఆదిశంకరాచార్యుల వారి విగ్రహాన్ని సందర్శించి శిష్యులతో కలిసి తోటకాష్టకం పఠనం చేశారు. అనంతరం స్థానేశ్వర్ మహాదేవ్ ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కాగా, నాలుగో రోజు లక్ష చండీ మహాయజ్ఞం దిగ్విజయంగా జరిగింది. సప్తశతి పారాయణం, లక్ష చండీ మహాయజ్ఞం, సహస్ర మోదక గణపతి హోమం, అతిరుద్ర యాగం, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు.



తీరానికి అందాల హారం!

'బ్లూ ఫ్లాగ్' సర్టిఫికెట్‌కు అనుగుణంగా బీచ్‌ల అభివృద్ధికి ఆప్టా కసరత్తు

- తొలి దశలో కాకినాడ, పేరుపాలెం, సూర్యలంకలో ఆధునిక సదుపాయాలు
- ఉత్తమ ప్రాజెక్టు డిజైన్ల కోసం ఆర్కిటెక్ట్ పోటీలు
- ఆర్కిటెక్ట్ సంస్థలు, రిజిస్టర్డ్ ప్లానర్లతోపాటు విద్యార్థులకూ అవకాశం
- ప్రతి విభాగంలో మూడు బెస్ట్ డిజైన్లకు నగదు బహుమతులు

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో బీచ్‌ల సమగ్రాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ(ఆప్టా) చర్యలు చేపడుతోంది. బీచ్‌లను 'బ్లూ ఫ్లాగ్' సర్టిఫికెట్‌కు అనుగుణంగా పర్యావరణ హితంగా, అందంగా తీర్చిదిద్దనుంది. ఇందులో భాగంగా తొలి దశలో కాకినాడ, సూర్యలంక, పేరుపాలెం బీచ్‌లలో ఆధునిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఉత్తమ ప్రాజెక్టు డిజైన్ల కోసం ఆర్కిటెక్ట్ పోటీలను నిర్వహిస్తోంది. ఆర్కిటెక్ట్ సంస్థలతోపాటు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్ట్ (సీవోఏ)లో రిజిస్టర్డ్ ఆర్కిటెక్ట్స్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా(ఐటీపీఐ)లో రిజిస్టర్డ్ ప్లానర్లు, ఆర్కిటెక్చర్, ప్లానింగ్, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల (వ్యక్తిగత/బృందాలుగా)నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్‌ఎఫ్‌పీ)ను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. వీటిని ప్రత్యేక కమిటీ ద్వారా పరిశీలించి ఉత్తమ ఆర్‌ఎఫ్‌పీలను ఎంపిక చేసి నగదు బహుమతులు అందించి ప్రోత్సహించనుంది. టెక్నికల్ బిడ్ల దాఖలుకు ఈ నెల 22వ తేదీ వరకు గడువు ఇచ్చింది. పూర్తి వివరాలను https:// tourism. ap. gov. in/ tenders వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

అభివృద్ధి ప్రణాళిక ఇలా...

తొలి దశలో కాకినాడ, సూర్యలంక, పేరుపాలెం బీచ్‌లలో సుమారు 1,500 మీటర్లు చొప్పున అభివృద్ధి చేయనున్నారు. ఈ బీచ్‌లను పర్యావరణ హితంగా తీర్చిదిద్దడంతోపాటు స్థానికులకు వ్యాపార, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో సావనీర్ దుకాణాలు, రెస్టారెంట్లు, వాటర్ స్పోర్ట్స్, వ్యూ పాయింట్లు, పిల్లల కోసం ఆట స్థలాలు, టూరిస్ట్ ఇంటర్‌ప్రిటేషన్ అండ్ రిసెప్షన్ సెంటర్, రెస్క్యూ, వైద్య సౌకర్యాలు, ల్యాండ్ స్కేపింగ్, సీటింగ్, పార్కింగ్, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేస్తారు. మరోవైపు పశ్చిమగోదారి జిల్లా పేరుపాలెంలో 104 ఎకరాల్లో, పల్నాడు జిల్లా నాగులవరంలో 250 ఎకరాల్లో పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నారు. వీటిల్లో బీచ్ కాటేజీలు, హోటళ్లు, రిసార్ట్స్, సావనీర్ దుకాణాలు, రెస్టారెంట్లు, వాటర్ స్పోర్ట్స్, ఎగ్జిబిషన్లు, థీమ్ పార్క్, వ్యూ పాయింట్లు, టూరిస్ట్ రిసెప్షన్ సెంటర్ వంటివి ఆధునిక సౌకర్యాలో ఏర్పాటు చేయనున్నారు.

నగదు బహుమతులు ఇలా..

ఆర్కిటెక్ట్ సంస్థల నుంచి వచ్చిన మొదటి మూడు ఉత్తమ ఎంపికలకు రూ.1,50,000, రూ.1,00,000, రూ.75,000 చొప్పున నగదు బహుమతులు అందిస్తారు. సీవోఏ రిజిస్టర్డ్ ఆర్కిటెక్ట్, ఐటీపీఐ రిజిస్టర్డ్ ప్లానర్ నుంచి వచ్చిన ఉత్తమ డిజైన్‌లకు రూ.1,00,000, రూ.75,000, రూ.55,000 చొప్పున, విద్యార్థి విభాగంలో విజేతలకు రూ.50,000, రూ.40,000, రూ.30,000 చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేస్తారు. ప్రతిభగల ఆర్కిటెక్ట్‌లకు ఆప్టాతో కలిసి పని చేసే అవకాశం కూడా కల్పిస్తారు.

మార్చి నాటికి 1.25 లక్షల కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు

- రాష్ట్రవ్యాప్తంగా 100 కొత్త సబ్‌స్టేషన్లను పూర్తి చేయాలి
- వేసవిలో విద్యుత్ కోతలు, బొగ్గు కొరత రాకుండా చూసుకోవాలి
- పెండింగ్ బకాయిలను వసూలు చేయాలి
- ఇంధన శాఖ సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: వచ్చే నెల మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 1.25 లక్షల కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఇస్తామని గనులు, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సచివాలయంలో సోమవారం ఇంధన శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను రైతన్నలకు అందించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేస్తామన్నారు. ఇందుకనుగుణంగా అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి ఉచిత విద్యుత్ కనెక్షన్‌ను మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వచ్చే నెలాఖరు నాటికి రాష్ట్రంలో నిర్మాణ దశలో ఉన్నవాటిలో 100 సబ్‌స్టేషన్ల నిర్మాణం కూడా పూర్తి కావాలన్నారు.

వేసవిలో డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ ఉత్పాదన..

రానున్న వేసవిలో డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ ఉత్పాదనకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం.. రోజుకు 210 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉందన్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ డిమాండ్ 240 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కోతలు లేకుండా విద్యుత్ ఉత్పత్తి, కొనుగోళ్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు, వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బంది రానివ్వద్దని ఆదేశించారు. కృష్ణపట్నం, ఎన్టీటీపీఎస్‌లోని కొత్త యూనిట్లను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కొరత లేకుండా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న బొగ్గు నిల్వలను పెంచుకోవాలని సూచించారు.

2,617 జగనన్న కాలనీలకు విద్యుదీకరణ పూర్తి..

రాష్ట్రవ్యాప్తంగా 9,979 జగనన్న కాలనీ లేఅవుట్లలో 2,617 కాలనీల్లో విద్యుదీకరణ పూర్తయ్యిందన్నారు. మొత్తం రూ.1,850 కోట్లకుగానూ ఇప్పటివరకు రూ.257.41 కోట్లు ఖర్చు చేశామని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. అలాగే లేఅవుట్లలోని 21,851 గృహాలు, సొంత భూముల్లో నిర్మించుకున్న 1,43,823 గృహాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు కర్మాగారాలు, వ్యాపార సంస్థ(హెచ్‌టీ కనెక్షన్)ల నుంచి రావాల్సిన రూ.349 కోట్లు బకాయిలను వసూలు చేయాలన్నారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీకాళహస్తి ఆలయ సమీపంలో భక్తకన్నప్ప కొండపై నిర్వహిస్తున్న ధ్వజారోహణం

శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తి రూరల్ (తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఈ నెల 25వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు సోమవారం భక్తకన్నప్ప ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలంకార మండపంలో భక్త కన్నప్ప ఉత్సవమూర్తితో పాటు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్త కన్నప్ప కొలువుదీరిన కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. తొలుత ధ్వజస్తంభానికి దర్భతో చేసిన పవిత్ర దారం, వస్త్రాన్ని అలంకరించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ప్రాంతీయ సంయుక్త కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి కేవీ సాగర్‌బాబు పర్యవేక్షణలో ఉత్సవాలను ప్రారంభించారు. 14న స్వామివారి ధ్వజారోహణం, 18న మహాశివరాత్రి, లింగోద్భవ దర్శనం, 19న రథోత్సవం, 20న స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, 22న కైలాసగిరి ప్రదక్షిణం(కొండ చుట్టూ), 23న పల్లకీ సేవ, 25న ఏకాంతసేవ ప్రధానంగా నిర్వహించనున్నారు.

రూ.1.36 కోట్ల వెండి అంబారీలు సమర్పణ

శ్రీకాళహస్తీశ్వరాలయానికి యాక్ట్ చానల్ సీఈవో మల్లాడి బాలసుబ్రహ్మణ్యం దంపతులు, మల్లాడి నాగేశ్వరరావు దంపతులు రూ.కోటి 36 లక్షల విలువ చేసే వెండి అంబారీలను కానుకగా సమర్పించారు. సోమవారం శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు సమక్షంలో వెండి అంబారీలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి దేవస్థానానికి అప్పగించారు.

ఆంధ్రప్రదేశ్ అని రాయలేని శుంఠ లోకేశ్

- సీఎం జగన్‌పై నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించం
- లోకేశ్‌కు సభ్యత, సంస్కారం లేవు
- ఆయనకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదు
- మంగళగిరిలో జగన్ పెట్టిన అభ్యర్థిపై ఓడిన లోకేశ్ పిల్లితో సమానం
- పెట్టుబడులకు విశాఖ స్వర్గధామం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అని రాయలేని శుంఠ లోకేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ హెచ్చరించారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పాదయాత్రలో లోకేశ్ మాట్లాడిన తీరు చూస్తే బూతేష్, బోకేష్, స్టూలేష్ వంటి పేర్లన్నీ ఆయనకే సరిపోతాయని అన్నారు. సభ్యత, సంస్కారం లేకుండా ప్రవర్తిస్తున్న లోకేశ్‌కు రాజకీయాల్లో ఉండే అర్హత ఉందా అని ప్రశ్నించారు. లోకేశ్ పచ్చి బూతులు మాట్లాడుతున్నారన్నారు. సీబీఎన్ అంటే చంద్రబాబు బూతుల నాయుడు అని, టీడీపీని బూతుల పార్టీగా మార్చుకోండని సలహా ఇచ్చారు. లోకేశ్ పాదయాత్ర అతని ఇంట్లో వారికే నచ్చలేదని, 200 కి.మీ. నడిచిన తర్వాత గానీ ఆయన్ని చూడ్డానికి ఆయన భార్య బ్రాహ్మణి రాకపోవడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. మంగళగిరిలో జగన్ పెట్టిన అభ్యర్థిపై ఓడిన లోకేశ్ ఓ పిల్లి అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని యువతకు సీఎం జగన్ అండగా ఉన్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక, ఒక్క సచివాలయాల్లోనే 1.4 లక్షల శాశ్వత ఉద్యోగాలు ఇచ్చారని, 25 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న డీఎస్సీని పరిష్కరించి, వారందరికీ ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. ఆర్టీసీని ప్రభుత్వపరం చేసి, 53 వేల మందిని ప్రభుత్వోద్యోగులుగా చేశారన్నారు. పవన్‌కు సొంత అజెండా లేదని, చంద్రబాబు కనుసన్నల్లో నడుస్తూ ఆయన చెప్పిన మాటలనే వల్లెవేస్తారని అన్నారు. కులాల మంటల్లో చలికాచుకునే తత్వం బాబుదని, కులాలను ఏకం చేసే విశాల హృదయం వైఎస్ జగన్‌దని చెప్పారు. చంద్రబాబు కాపులపై అక్రమంగా కేసులు పెడితే, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ తీసివేయించింది సీఎం జగన్ అని చెప్పారు. పెట్టుబడులు, పరిశ్రమలకు విశాఖ అనువైన ప్రదేశమైనా, ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఈ ప్రభుత్వం కృషి వల్ల అనేక పరిశ్రమలు విశాఖకు రాబోతున్నాయని చెప్పారు. పెట్టుబడులకు విశాఖ స్వర్గధామం కాబోతోంది. వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే సీఎం జగన్ లక్ష్యమని తెలిపారు.

తెలంగాణ

దేశంలోనే నం 1 'ఐఎస్‌బీ'

- గ్లోబల్‌లో 39వ ర్యాంకు
- ఫైనాన్షియల్ టైమ్స్ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్–2023లో ఉన్నత స్థానం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)కి అరుదైన గౌరవం లభించింది. ఫైనాన్షియల్ టైమ్స్(ఎఫ్‌టీ) గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్–2023ని సోమవారం ప్రకటించారు. ఇందులో పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(పీజీపీ) ఎంబీఏ ర్యాంకింగ్స్‌లో ఐఎస్‌బీ భారతదేశంలోనే నెంబర్ వన్ స్థానం లభించగా ప్రపంచస్థాయిలో 39వ ర్యాంకు సాధించింది. పరిశోధనా విభాగంలో కూడా ఐఎస్‌బీ అగ్రస్థానంలో నిలిచింది. ఈ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 61వస్థానం పొందింది. పరిశోధన, మహిళలు, కెరీర్ పురోగతి, జీతం పెరుగుదల, పూర్వ విద్యార్థుల నెట్ వర్క్ వంటి అంశాల్లో ఐఎస్‌బీ పనితీరు మెరుగ్గా ఉందని ఈ ర్యాంకింగ్స్ ద్వారా మరోసారి స్పష్టమైంది. అదే విధంగా ఐఎస్‌బీ ప్రపంచవ్యాప్తంగా టాప్–50లో ఉన్న ఏకైక భారతీయ బిజినెస్ స్కూల్‌గా గుర్తింపును మరోసారి చాటుకుంది. ప్రపంచంలో 39వ స్థానం పొందగా ఆసియా ఖండంలో ఆరవ స్థానం సాధించింది. 2019 పీజీపీ తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు చేసిన సర్వేలో కూడా అత్యున్నత ప్రమాణాలు సాధించింది. జీతం పెరుగుదల (2), పూర్వ విద్యార్థులు నెట్‌వర్క్(12), కెరీర్ పురోగతి(28), కెరీర్ సర్వీసెస్(29) వంటి అంశాలలో ఐఎస్‌బీ బాగా పనిచేస్తోందని ఈ సర్వేలో తేలింది. ఎఫ్‌టీ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్‌లో భారతదేశంలోనే అగ్రశ్రేణి బిజినెస్ స్కూల్‌గా ఐఎస్‌బీ స్థిరమైన ర్యాంకింగ్ సాధించిందని ఐఎస్‌బీ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ రామచంద్రన్‌తిరుమలై పేర్కొన్నారు.

దుర్గగుడి బస్సుల్లో ఉచిత ప్రయాణం!

- టికెట్ల రద్దు కోసం మంత్రి, కమిషనర్‌కు అధికారుల ప్రతిపాదన
- ప్రస్తుతం టికెట్ ధర రూ.10
- రైల్వేస్టేషన్, బస్టాండ్, దుర్గాఘాట్ నుంచి ఏడు బస్సులు నడుపుతున్న దేవస్థానం
- రోజు 4వేల నుంచి 5వేల మంది భక్తుల ప్రయాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దర్శనానికి విచ్చేసే భక్తులకు దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, దుర్గాఘాట్ నుంచి ఇంద్రకీలాద్రి పైకి దేవస్థానం నడుపుతున్న బస్సుల్లో వసూలు చేస్తున్న నామమాత్రపు చార్జీని సైతం రద్దు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మేరకు అనుమతించాలని కోరుతూ దేవదాయశాఖ మంత్రి, కమిషనర్‌కు ఆలయ అధికారులు లేఖ రాసినట్లు తెలుస్తోంది.

ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ...

దుర్గగుడికి తొమ్మిది బస్సులు ఉన్నాయి. వాటిలో నాలుగు బస్సులను రోజూ విజయవాడ రైల్వేస్టేషన్, పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి దుర్గగుడి పైకి నడుపుతున్నారు. మరో మూడు బస్సులను కొండ దిగువన ఉన్న దుర్గాఘాట్ నుంచి కొండ పైకి నడుపుతున్నారు. రెండు బస్సులను స్టాండ్ బైలో ఉంచి పండుగలు, పర్వదినాలు, రద్దీ సమయాల్లో వినియోగిస్తున్నారు. రోజూ ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు రైల్వేస్టేషన్, బస్టాండ్–దుర్గగుడి మధ్య బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. సాధారణ రోజుల్లో 16 సార్లు, పండుగలు, ప్రత్యేక రోజుల్లో 20 సార్లు బస్సులు తిరుగుతాయి. దుర్గా ఘాట్ నుంచి కూడా అదే స్థాయిలో బస్సు సర్వీసులు నడుపుతారు. ప్రతి నిత్యం 30వేల నుంచి 40 వేల మంది, శుక్ర, ఆదివారాల్లో 50వేల నుంచి 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. వీరిలో సాధారణ రోజుల్లో 4 వేల నుంచి 5 వేల మంది, శుక్రవారం, ఆదివారం, ఇతర ప్రత్యేక రోజుల్లో 7 వేల నుంచి 10వేల మంది వరకు దేవస్థానం బస్సుల్లో ఇంద్రకీలాద్రిపైకి చేరుకుంటారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, దుర్గాఘాట్ నుంచి కేవలం రూ.10 మాత్రమే టికెట్ వసూలు చేస్తారు. దీంతో దేవస్థానానికి ఏడాదికి సుమారు రూ.4 కోట్ల మేర ఆదాయం వస్తుండగా, ఆయిల్, రిపేర్లు, జీతాలు ఇతర ఖర్చులు మినహాయించినా రూ. కోటి మేరకు నికర ఆదాయం వస్తుంది.

భక్తుల సౌలభ్యం కోసం..

దుర్గమ్మ దర్శనం కోసం రైళ్లు, బస్సుల్లో వచ్చే సామాన్య భక్తుల సౌలభ్యం కోసం ఉచిత బస్సులు నడపాలని నిర్ణయించుకున్నాం. దీనివల్ల భక్తులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– హరి జవహర్‌లాల్, కమిషనర్, దేవదాయ శాఖ

భక్తులకు ఆర్థికంగా ఉపశమనం...

కరోనాకు ముందు రెండు బస్సుల్లో భక్తులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించారు. కరోనా తర్వాత దానిని రద్దు చేశారు. తాజాగా మొత్తం ఏడు బస్సుల్లోనూ ఉచిత ప్రయాణానికి అనుమతించాలని ప్రతిపాదనలు రూపొందించారు. అధికారుల నిర్ణయం అమల్లోకి వస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఆర్థికంగా ఉపశమనం కలుగుతుంది.

పరస్పర అవగాహనతో .... లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

- ముస్సోరి శిక్షణ కేంద్రంలో మొగ్గ తొడుక్కున్న ప్రేమ
- అభిప్రాయాలు..ఆలోచనలతో ఒక్కటైన ఐఏఎస్ జంట
- ప్రేమ పెళ్లి చేసుకున్న కలెక్టర్లు హిమాన్షు శుక్లా..కృతికా
- ఎనిమిదేళ్లలో అరమరికలు లేని వైవాహిక జీవితం
- వాలెంటైన్స్ డే సందర్భంగా యువ కలెక్టర్లతో ప్రత్యేక ఇంటర్వ్యూ



సాక్షిప్రతినిధి, కాకినాడ: రెండు మనసుల మధ్య బలమైన నమ్మకమే నిజమైన ప్రేమకు పునాది. పైపై అందాలు, ఆకర్షణలు ప్రేమను సజీవంగా ఉంచలేవు. బలమైన బంధంతో ఏర్పడే ప్రేమ కలకాలం సజీవంగా నిలిపి ఉంచుతుందని చాలా ప్రేమ వివాహాలు రుజువుచేస్తున్నాయి. ఇదిగో నిత్యం జిల్లా పాలనా వ్యవహారాలతో తలమునకలయ్యే ఈ ఐఏఎస్ దంపతులను చూస్తే ఈ మాట ముమ్మాటికీ నిజమే. కాకినాడ..డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లాలు ప్రేమతో ఒక్కటైన వారే. ఎనిమిదేళ్ల క్రితం ముస్సోరిలోని సివిల్ సర్వీసెస్ శిక్షణా కేంద్రంలో వీరిద్దరి మధ్య తొలి ప్రేమ చిగురించింది. పరస్పర ఆలోచనలు ఒక్కటి కావడంతో వీరి ప్రేమ పెళ్లిపీటలెక్కింది. నేడు వాలెంటైన్స్ డే సందర్భంగా జిల్లాల పాలనాధికారులు ఏమంటున్నారో వారి మాటల్లోనే తెలుసుకుందాం..



ముస్సోరిలో తొలిప్రేమ

మొదటిసారి ముస్సోరిలో కృతికాను చూశాను. పరస్పరం గౌరవించుకునేవాళ్లం. తరచూ పలుకరించుకునేవాళ్లం..ఈ సందర్భంలోనే పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నాం. చాలా విషయంలో ఒకే తరహా వ్యక్తిత్వం కనిపించింది. నేనెలా ఉన్నానో ఆమె కూడా అలానే ప్రాక్టికల్‌గా ఉండటం గమనించాను. ముఖ్యంగా అర్థం చేసుకునే విషయం నుంచి అన్నింటి వరకూ. ఒకే సర్వీసుకు ఎంపికయినందున ఏమైనా సమస్యలుంటే చర్చించుకునేవాళ్లం. వ్యక్తిగతంగానే కాదు..వృత్తిపరంగానూ ఒకే ఫీల్డుకు చెందడంతో మా మధ్య ప్రేమ మొగ్గ తొడుక్కుంది.. నేనే చొరవ తీసుకుని మా అమ్మానాన్నలు మంజు శుక్లా, ఎంఎల్ శుక్లాతో ప్రేమ విషయం చెప్పాను. అదృష్టం ఏంటంటే వారిద్దరూ నా ప్రేమకు ఓకే చెప్పారు. సంప్రదాయం ప్రకారం అమ్మానాన్నలతో కలిసి చండీఘడ్ వెళ్లాం. కృతికా తల్లిదండ్రులు మదన్‌లాల్‌బత్రా, హర్ష బత్రాలను కలిశాం. పెళ్లి విషయం ప్రస్తావించాం. వారు కూడా అన్నీ విని సంతోషంతోనే అంగీకరించారు. అలా మా ప్రేమ పెళ్లికి సులభంగానే మార్గం చూపింది. ఒకేరకమైన వృత్తిని సౌకర్యవంతంగా.. సమర్థవంతంగా నిర్వహిస్తున్నామంటే మా మధ్య ఉన్న పరస్పరం అవగాహన.. అభిప్రాయాలను పంచుకుని చర్చించుకుని ఒక మాటకు రావడం.

'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ కావాలి'

ప్రేమ, పెళ్లి అనేది సుదీర్ఘ జీవితానికి సంబంధించిన విషయం. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అని కాకుండా.. లైఫ్ గురించి అర్థం చేసుకోవాలి. అప్పుడే బతుకంతా సుందరంగా ఉంటుంది. కావాలి.. ఏమి చేయాలి అనేది నిజాయితీగా ఇరువురు మాట్లాడుకోవాలి. ప్రేమ,పెళ్లి అంటే ఇద్దరి కలయికే కాదు. ఇరు కుటుంబాలను కలిపే బంధమని గుర్తించాలి. ఈ విషయంలో త్వరత్వరగా నిర్ణయాలు తీసుకోకూడదు. ఆలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలను అర్థం చేసుకోవాలి. పిల్లలు హ్యాపీగా ఉంటేనే మనం కూడా హ్యాపీగా ఉంటామని గుర్తించాలి. ఐఏఎస్ శిక్షణ తర్వాత సెలవు...అదే సమయంలో మంచి రోజు సంక్రాంతి రానే వచ్చింది. ఎటువంటి అడ్డు లేకుండానే ప్రేమను పెళ్లి వరకు వచ్చింది. ఇద్దరి మధ్య బలమైన నమ్మకమే ఇంతవరకు తీసుకువచ్చిందని భావిస్తున్నాను. వృత్తి..వ్యక్తిగత జీవితంపై మా మధ్య స్పష్టమైన అవగాహన ఉంది. అందుకే ఇంతవరకు ఎప్పుడూ ఎటువంటి సమస్య రాలేదు. నేటి తరం ప్రేమికులు మాలానే పెళ్లి చేసుకునే ముందే అన్నీ అర్థం చేసుకోవాలి. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలి.

–హిమాన్షు శుక్లా. కలెక్టర్. డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ కోనసీమ జిల్లా.

ఎప్పుడూ మనస్పర్థలే రాలేదు

2013 సెప్టెంబరులో శిక్షణలో తొలిసారి హిమాన్షును చూశాను. రోజులు గడిచే కొద్దీ ఆయన ప్రాక్టికాలిటీ, వాస్తవానికి దగ్గరగా ఉండటం, సహజ ధోరణిలో సాగిన మాటలు నన్ను ఆకట్టుకున్నాయి. అదే ఆయన్ను ప్రేమించేలా చేశాయి. ప్రేమను ఇద్దరం వ్యక్తం చేసుకున్నాం. పరస్పరం అన్నీ అర్థం చేసుకున్నాక పెద్దలు అంగీకారంతో, 2015 ఫిబ్రవరి 8న పెళ్లి చేసుకున్నాం. ఒకే వృత్తిలో ఉన్నాం.. అర్థం చేసుకోవడానికి ఇది ఈజీగా దోహదపడింది. ఈ ఎనిమిదేళ్ల కాలంలో ఎప్పుడూ ఏ విషయంలోను ఇద్దరి మధ్య మనస్పర్థలు రాలేదు. నిజమైన ప్రేమ అలానే ఉంటుంది మరి. ఎనిమిదేళ్ల కెరీర్‌లో ఐదేళ్లు వేర్వేరు ప్రాంతాల్లో దూరంగా ఉన్నాం. వీకెండ్ లేదా రెండు వారాలకు ఒకసారి కలుసుకునేవాళ్లం.అప్పుడే అర్థం చేసుకున్నాం. జీవితం అంటే ఇలానే ఉంటుందని..ఇవేమీ మా వ్యక్తిగత జీవితానికి ప్రతిబంధకం కావడం లేదు. ఇద్దరం కూడా వృత్తిలో ఎక్కడా రాజీపడకూడదని ప్రేమలో పడినప్పుడే నిర్ణయం తీసుకున్నాం. అలానే కొనసాగుతున్నాం.

జీవితంలో స్థిరపడ్డాకే ప్రేమ..పెళ్లి

ప్రేమ విషయంలో అమ్మాయిలు చాలా ముందస్తుగా ఆలోచించాలి. స్కూల్, కాలేజీ స్థాయిలోనే ప్రేమ వ్యవహారాలతో జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. పరిస్థితులన్నీ ఒక కొలిక్కి వచ్చి ఆర్థికంగా నిలదొక్కుకున్నాకే ప్రేమ, పెళ్లి గురించి ఆలోచించాలి. ఇవేమీ లేకుండా కేవలం రంగు, ఆకర్షణలతో ప్రేమ అంటూ అడుగులు వేస్తే భవిష్యత్ అంత బాగుండదు. కొన్నాళ్లుగా మొబైల్‌లో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి వాటి ద్వారా చాటింగ్‌లు బాగా ఎక్కువైపోయాయి. మంచికంటే చెడునే ఎక్కువగా జరుగుతోందని అనుకుంటున్నాను. తల్లిదండ్రులు కూడా ఓ కంట పిల్లలను గమనిస్తూ ఉండాలి. 18 ఏళ్లు నిండిన తరువాతనే పెళ్లి ఆలోచన రావాలి. ముఖ్యంగా అమ్మాయిలు మరింత జాగ్రత్తగా ఉండాలి. మగపిల్లలు ఏదో వ్యాపారం చేయడం మొదలుపెట్టగానే పెళ్లి చేస్తుంటారు. అమ్మాయిల విషయంలో కూడా తల్లిదండ్రులు ఇలానే ఆలోచించాలి. ఆర్థికంగా స్థిరపడి ఆలోచించే శక్తి వచ్చాకనే పెళ్లి చేయాలి. నేను కూడా ఐఏఎస్ శిక్షణ పూర్తయ్యాకే పెళ్లి చేసుకున్నాను. జీవితంలో స్థిరపడ్డాక స్వతంత్రంగా ఏదైనా నిర్ణయం తీసుకోవచ్చు.

–కృతికాశుక్లా, కలెక్టర్, కాకినాడ జిల్లా



ప్రేమకానుక

సింపుల్ & స్వీట్



ఖరీదైన గిఫ్టులలోనే ప్రేమ ఉండదు. ప్రేమ గొప్పతనం అదే కదా! సింపుల్‌గా, తక్కువ ఖర్చుతో ప్రేమకానుకలు ఇవ్వడానికి మార్కెట్‌లో బోలెడు ఆప్షన్స్ ఉన్నాయి. మచ్చుకు కొన్ని...

● హార్ట్ షేప్‌డ్ మగ్స్, హార్ట్ షేప్‌డ్ చాక్లెట్స్ ● 365 లవ్ మెసేజ్‌లు, తియ్యటి టోఫీలతో కూడిన జార్ ● రొమాంటిక్ గ్రీటింగ్ కార్డ్స్ ● వాలెంటైన్స్ డే క్రిస్టల్ మెమెంటో ● ఫ్లోటింగ్ హార్ట్స్ గ్లాస్‌ఫ్రేమ్స్ ● 'ఇట్ వాజ్ ఆల్వేస్ యూ' ఫొటో పోస్టర్ ● రొటేటింగ్ పర్సనలైజ్‌డ్ పెన్ స్టాండ్ ● మెటల్ ఫొటో కీచైన్ ● వుడెన్ పర్సనలైజ్ జిగ్‌సా పజిల్ ● లవ్ నెవర్ ఎండ్స్ ఫ్రేమ్ ● లవ్ సర్టిఫికెట్ విత్ ఫ్రేమ్

టెక్‌సావి అయితే... ● ఫుజీ ఫిల్మ్ ఇన్‌స్టాక్స్ మినీ–11 కంపాక్ట్ ఇన్‌స్టంట్ కెమెరాతో క్రెడిట్–కార్డ్ సైజ్‌లో ఫొటోలు తీసుకోవచ్చు ● బిసైడ్ ల్యాంప్: మన వాయిస్‌తో రకరకాల రంగులను ఇల్లంతా వెదజల్లుతుంది ● రకరకాల హెయిర్‌స్టైల్స్‌ను ఇష్టపడే వారి కోసం: డైసన్ ఎయిర్‌రాప్ ● వీడియో గేమ్ ప్రేమికుల కోసం... ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్ కన్సోల్, లాగిటెక్ ఎ30 గేమింగ్ హెడ్‌సెట్ ● సంగీత ప్రేమికుల కోసం... జేబియల్ మినీబ్లూ స్పీకర్, అమెజాన్ ఎకో స్టూడియో స్పీకర్, శాంసంగ్ ఎంఎక్స్–ఎస్టీ 40బీ సౌండ్ టవర్ ● సెల్‌ఫోన్‌లోని మీ విలువైన జ్ఞాపకాల ఫొటోలను అప్పటికప్పుడు ప్రింట్ తీసుకోవడానికి... హెచ్‌పీ స్ప్రోకెట్ పోర్టబుల్ ప్రింటర్.







ఇంటిప్

బంగాళ దుంపలను చెక్కు తీసి పడేసి వండుతుంటారు. ఇలా పారవేసే పచ్చి బంగాళ దుంప తొక్కలో విటమిన్ సి తోబాటు కొన్ని రకాల ఎంజైములు ఉంటాయి. అందువల్ల ఈ తొక్కలను ఒక గంటపాటు రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన తరువాత అలసిపోయిన కళ్లమీద, కళ్ల చుట్టూ పెట్టుకుని 20 నిమిషాలపాటు ఉంచుకోవాలి. తరువాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కళ్లకు ఉన్న ఒత్తిడి, అలసట తగ్గి ఫ్రెష్‌గా కనిపిస్తాయి.





బ్యూటిప్

కురులకు ఉల్లి, కరివేపాకు

సహజసిద్ధంగా జుట్టును నల్లగా చేసుకునేందుకు... గుప్పెడు కరివేపాకును మిక్సీలో వేసి పేస్టులా చేసుకోండి. ఆ తర్వాత ఒక ఉల్లిపాయను తీసుకుని ముక్కలుగా తరిగి మిక్సీలో వేసి రసం తీసుకోవాలి. కరివేపాకు పేస్టులో ఉల్లిరసాన్ని బాగా కలపండి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల వరకు చేరేలా తలకు మర్దన చేస్తూ జుట్టుకు పట్టించండి. అరగంట తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయండి. ఇలా రెగ్యులర్‌గా చేస్తుంటే జుట్టు తెల్లబడటం ఆగుతుంది.

పోరాటం

సతీ భూదేవి

యముడితో పోరాడి భర్త ప్రాణాలు తిరిగి తెచ్చుకున్న సతీ సావిత్రి కథ మనకు తెలుసు.
చేయని నేరానికి శిక్ష అనుభవిస్తున్న భర్తను పరాయి దేశం నుంచి విడిపించుకుని రావడానికి పద్నాలుగేళ్లు పోరాటం చేసింది ఈ భూదేవి.
నేడు వేలంటైన్స్ డే. ప్రేమకు పట్టం కట్టే రోజు.
భర్త పట్ల భార్యకు ఎంత ప్రేమ ఉంటుందో...
అతని శ్రేయస్సు కోసం ఆమె ఎంత తపన పడుతుందో
ఈ రోజున ఈ ఘటన ద్వారా కాకుండా మరెలా తెలుసుకుంటాం?
భార్య ప్రేమకు శక్తి ఉంటే అది ఇంత బలంగా ఉంటుంది.
ఇంత అచ్చెరువొందేలా కూడా ఉంటుంది.



● భర్త, కొడుకుతో భూదేవి

తీవ్రవాదుల చెరలో బందీగా ఉన్న తన భర్తను విడిపించుకోవడానికి 'రోజా' సినిమాలో హీరోయిన్ తెగువను ఆస్వాదించాం. అచ్చం అలాంటి కథను పోలిన నిజజీవిత ఘటన తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా మెండోరా మండల కేంద్రంలో చోటు చేసుకుంది. విద్యాగంధం ఏమంతగా అంటని మాకూరి భూదేవి మరణశిక్ష ఖరారైన తన భర్తకు క్షమాభిక్ష ప్రసాదించాలని సుదీర్ఘ న్యాయపోరాటం చేసి విజేతగానే కాదు, వార్తలలో కూడా నిలిచింది. భూదేవి 14 ఏళ్లుగా చేసిన న్యాయపోరాటానికి ఇటీవల ఫలితం దక్కింది. ఇప్పుడు భూదేవి, ఆమె కుమారుడు రాజు, భర్త శంకర్ ఆనందోత్సాహంలో మునిగి తేలుతున్నారు.

అసలేం జరిగిందంటే..

మెండోరాకు చెందిన మాకూరి శంకర్‌కు సెంటు కూడా వ్యవసాయ భూమి లేదు. ఇక్కడ కూలి పని చేస్తే పెద్దగా సంపాదించుకోవడం కష్టం అనుకున్నాడు. తన భార్య గర్భవతిగా ఉన్న సమయంలో 2004లో దుబాయ్‌కు వెళ్లిపోయాడు. అక్కడ ఒక నిర్మాణ సంస్థలో ఫోర్‌మెన్ (సూపర్‌వైజర్)గా చేరాడు. అతనికింద పని చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన రామావతార్ కుమావత్ ప్రమాదవశాత్తు భవనం ఆరో అంతస్థుపై నుంచి పడి చనిపోయాడు. ఫోర్‌మెన్‌గా ఉన్న శంకర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే రాజస్థాన్ వాసి మరణించాడని దుబాయ్ పోలీసులు నిర్ధారించారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనను హత్య కేసుగా నమోదు చేసిన అక్కడి పోలీసులు శంకర్‌ను ప్రధాన నిందితునిగా గుర్తించి అరెస్టు చేసి పుజీరా జైలులో పెట్టారు. కోర్టు విచారణలో రామావతార్ కుమావత్ మృతికి తను బాధ్యుణ్ణి కాదని, అతను ప్రమాదవశాత్తు మరణించాడని శంకర్ ఎంత మొరపెట్టుకున్నా దుబాయ్ కోర్టులో చెల్లలేదు. పోలీసుల విచారణ నివేదిక ప్రకారం శంకర్‌ను దోషిగా తేల్చిన కోర్టు 2013లో మరణశిక్షను ఖరారు చేసింది.

చదువులేకపోయినా...

ఈ ఘటన 2009లో చోటు చేసుకుంది. మాకూరి శంకర్‌కే కాదు అతని భార్యకు కూడా చదువు రాదు. ఎవరిని సంప్రదించాలో, తమకేవిధంగా న్యాయం జరుగుతుందో తెలియదు. పుజీరా జైలులో ఉన్న శంకర్‌కు తన భార్య భూదేవితో నెల రోజులకు ఒకసారి ఫోన్‌లో మాట్లాడేందుకు జైలు పోలీసులు అవకాశం కల్పించారు. ''అప్పుడు ఆయన నా గురించి, మా అబ్బాయి గురించి అడిగి ఏడ్చేవాడు. తాను బతికి బట్టకట్టాలంటే రాజస్థాన్ వాసి రామావతార్ కుమావత్ కుటుంబ సభ్యులు క్షమాభిక్షకు అంగీకరించాలని చెప్పాడు. ఏం చేయాలో అర్థం కాలేదు. ఆ కుటుంబం అడ్రస్ తెలియదు. మా ఊళ్లో పెద్దలందరికీ ఈ విషయం చెప్పాను. కనపడినవారికల్లా మా కష్టం చెప్పాను. ఈ కష్టం పగవాడికి కూడా రాకూడదని ఏడ్వనిరోజు లేదు. రోజూ దిగులుగా ఉండేది. అలాగే నెలలు, ఏళ్లు గడిచిపోతున్నాయి. కానీ, దిగులుగా కూర్చుంటే అయ్యే పనులు కావు. నేనూ, నా బిడ్డ బతకాలి. కూలి పనులు చేసుకుంటూ బిడ్డను పోషించుకుంటూ వచ్చాను. గతంలో ఆర్మూర్ మండలం దేగాం వాసులు ముగ్గురు దుబాయ్‌లో మరణశిక్ష నుంచి బయటపడి ఇంటికి చేరుకున్నారని తెలిసింది. ఇందుకు అదే గ్రామానికి చెందిన యాదాగౌడ్ కృషి చేశారని తెలిసింది. గంపెడాశతో వెళ్లి యాదాగౌడ్‌ను సంప్రదించి ఎలాగైనా నా భర్తను మరణశిక్ష నుంచి తప్పించాలని వేడుకున్నాను..' అని ఇన్నేళ్ల తన కష్టాన్ని వివరించింది భూదేవి.

మా వాళ్లను చూస్తానని అనుకోలేదు

నేను దుబాయ్‌కు వెళ్లే సమయంలో నా భార్య గర్భవతి. కొన్ని నెలలకే కొడుకు పుట్టాడు. ఈ సంతోష వార్త వినే సమయంలో నా భార్యకు చెప్పాను 'త్వరలోనే వస్తాను' అని. కానీ, అది సాధ్యం కాదని తర్వాత తెలిసింది. రాజస్థాన్ వ్యక్తి మరణించడంతో నేను ఈ ఘటనలో అరెస్టు అయ్యి జైలుపాలు కావడం, ఆ తరువాత మరణశిక్ష పడటం వరుసగా జరిగాయి. ఇక నా వాళ్లను చూస్తానని కలలో కూడా అనుకోలేదు. నా భార్యతో ఫోన్‌లో మాట్లాడిన ప్రతిసారీ నాకు ఎంతో ధైర్యం చెప్పేది. జైల్లో ఎంతో మనోవేదనతో ఉన్నా నా భార్య మాటలు నాకు జీవితంపై ఆశలు చిగురించేలా చేశాయి. నా విడుదల కోసం కృషి చేసిన అందరికీ కృతజ్ఞతలు.



– మాకూరి శంకర్

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి...

'మా ఆయనకు ఫోన్ చేసినప్పుడల్లా ఊళ్లో విషయాలు, నేను చేస్తున్న పనుల గురించి, మా అబ్బాయి క్షేమం గురించి చెబుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోవద్దని చెబుతూ మరిన్ని వివరాలు అడిగి తెలుసుకునేదాన్ని. బాధిత కుటుంబాన్ని ఎలాగైనా ఒప్పించాలని కానీ, వాళ్లు ఎక్కడ ఉంటారో నాకు తెలియదని యాదాగౌడ్‌ను కలిసినప్పుడు చెప్పాను. అతను అన్ని వివరాలు కనుక్కొని, రాజస్థాన్ కుటుంబం గురించి తెలుసుకున్నాడు. వాళ్లకు ఆర్థికసాయం రూ.5 లక్షలు అందించాలంటే అందరినీ బతిమాలుకున్నాను. కూలీ చేసుకొని బతికేదాన్ని, నా దగ్గర అంత డబ్బు ఎక్కడుంటుంది. మా ఊరి వాళ్లు, ఇంకొంతమంది దయగలవాళ్లు తమకు తోచినంత ఇచ్చారు. అలా వచ్చిన డబ్బును రాజస్థాన్‌లోని మృతుని కుటుంబ సభ్యులకు అందజేశాం. మృతుని కుటుంబ సభ్యులు క్షమాభిక్షకు అంగీకరించారు' అని తెలిపింది భూదేవి. అలా వారు సంతకాలు చేసిన పత్రాలను యాదాగౌడ్ ద్వారా న్యాయవాది అనురాధ సహకారంతో భూదేవి దుబాయ్‌లోని కోర్టుకు పంపించింది. దుబాయ్ కోర్టు ఈ పత్రాలను పరిశీలించి మరణశిక్షను రద్దు చేయడమేకాకుండా అతన్ని విడుదల చేస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. దీంతో మరణశిక్షను తప్పించుకున్న శంకర్ ఇంటికి చేరుకున్నాడు. కథ సుఖాంతమైంది.

– ఎస్.చంద్రశేఖర్,
సాక్షి, మోర్తాడ్, నిజామాబాద్

సాగుబడి
ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 18 వరకు
శతభిష కార్తె : ఫిబ్రవరి 19 నుంచి

70 ఎకరాలు 30 పంటలు



● రంగప్రసాద్

ప్రకృతి వ్యవసాయదారుడిగా మారిన బ్యాంకింగ్ నిపుణుడు ఇమ్మనేని రంగప్రసాద్ తన పొలాన్ని ఉద్యాన పంటల జీవవైవిధ్య క్షేత్రంగా మార్చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలం జూపల్లె గ్రామపరిసరాల్లో 70 ఎకరాల భూమిని నాలుగేళ్ల క్రితం కొనుగోలు చేసి 'ఐఫార్మ్స్' పేరుతో అభివృద్ధి చేశారు. 30 రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల చెట్లతో పాటు నాటుకోళ్లు, ఆవుల పెంపకం చేపట్టారు. పూర్తిగా ప్రకృతి సేద్య పద్ధతుల్లోనే సాగు చేస్తున్నారు. హైదరాబాద్ నగరానికి ఏడాది పొడవునా అమృతాహారాన్ని అందించడమే లక్ష్యమంటున్న రంగప్రసాద్ కృషిపై కథనం.

ఒకసారి విత్తితే.. వరుసగా రెండు పంటలు!

ఆకుపచ్చ క్యాబేజీ, ఎరుపు బ్రోకలీ వంటి కొత్తరకం పంటలను ఐఫార్మ్స్‌లో పండిస్తున్నారు. మరో విశేషం ఏమిటంటే.. ఒకే మొక్కకు రెండు సార్లు దిగుబడి తీస్తున్నారు. ఒక పంట తీసుకున్న తర్వాత అదే మొక్క నుంచే 50 రోజుల్లో కార్శి(రటూన్ క్రాప్) పంట తీస్తున్నారు. గో ఆధారిత ప్రకృతి సేద్య నిపుణులు సుబ్రహ్మణ్యం రాజు పర్యవేక్షణలో ఈ ప్రయోగాత్మక సాగు జరుగుతోంది. ఆయన ఏమంటున్నారంటే.. మొదటి పంటగా క్యాబేజీ, బ్రోకలీ కోసిన తర్వాత మొక్కలను అలాగే ఉంచి, ఎప్పటిలాగే క్రమం తప్పకుండా నీరు ఇవ్వాలి. 2 వారాల్లో కొత్త పిలకలు వస్తాయి. పెద్దదాన్ని ఉంచి, మిగిలినవన్నీ తీసివేయండి. 400–500 గ్రాముల క్యాబేజీ, బ్రోకలీ కావాలంటే రెండు రెమ్మలు ఉంచండి. ప్రతి పది రోజులకు పంచగవ్య, ఫిష్ అమినో యాసిడ్, ఆవు మూత్రం పిచికారీ చేయడం ద్వారా పోషకాహారం ఇవ్వండి. పంట కాలంలో మూడు సార్లు పిచికారీ చేయాలి. రెండో పంట కోసం 40–50 రోజుల వరకు వేచి ఉండండి. ఈ కార్శి పంట వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. రెండో పంటకు బెడ్ తయారీ అవసరం లేదు. అదనపు శ్రమ లేదు. తక్కువ కలుపు. తక్కువ వ్యవధి. కాబట్టి చాలా తక్కువ ఖర్చు. సీజన్‌లో కన్నా ధర ఎక్కువగా వస్తుంది.



● గ్రీన్ క్యాబేజీ



● ఎరుపు బ్రోకలీ



● గ్రీన్ అండ్ పర్పుల్ లెట్యూస్



● కుసుమలు అంతరపంట



● జామ తోటలో వేరుశెనగ అంతరపంట



● గ్రోబ్యాగ్స్‌లో సొర పాదులు

హైదరాబాద్‌కు చెందిన ఇమ్మనేని రంగప్రసాద్ బ్యాంకింగ్ నిపుణుడు. డా. కిరణ్మయి మైక్రోబయాలజిస్టు. ఈ దంపతులకు సేంద్రియ/ప్రకృతి సేద్యం అంటే మక్కువ. ఈ మక్కువతోనే హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో సమీకృత సేంద్రియ ఉద్యాన పంటల క్షేత్రానికి ఎంతో శ్రమించి రూపుకల్పన చేశారు. ఏడాది పొడవునా రసాయనిక అవశేషాల్లేని చాలా రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, నాటు కోడిగుడ్లను నగర వాసులకు అందించాలని సంకల్పించారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలం జూపల్లె గ్రామపరిసరాల్లో 70 ఎకరాల భూమిని నాలుగేళ్ల క్రితం కొనుగోలు చేసి 'ఐఫార్మ్స్' పేరుతో జీవవైవిధ్య ఉద్యాన క్షేత్రంగా అభివృద్ధి చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల కాలువను ఆనుకొని ఉండటంతో ఈ క్షేత్రానికి సాగు నీటి కొరత లేదు. తెలంగాణ గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నేత ఎమ్మెస్ సుబ్రహ్మణ్యం రాజు సూచనలు, సలహాలతో ఈ క్షేత్రం మెరుగైన ఉత్పాదకత సాధిస్తుండటం విశేషం.

దేశ విదేశీ రకాలెన్నో...

అనేక రకాల నేలలు, ఎత్తుపల్లాలతో కూడిన ఈ పొలాన్ని అనేక విభాగాలుగా విభజించి, ఒక్కో విభాగంలో ఒక్కో రకం ప్రధాన పంటలను, వాటి మధ్య అనేక అంతర పంటలను సాగు చేస్తున్నారు. ఏడాది పొడవునా దిగుబడులు తీసుకునేందుకు వీలుగా వారానికోసారి ఆకుకూరలు, 15 రోజులకోసారి కూరగాయ మొక్కలు నాటుతూ (స్టాగర్డ్ ప్లాంటేషన్ చేస్తూ) ప్రణాళికాబద్ధంగా సాగు చేస్తున్నారు.

క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, క్యాబేజి, కాలీఫ్లవర్ వంటి పంటలు 15 రోజులకోసారి విత్తుతున్నారు. కాకర, బీర, సొర, టమాటో, బెండ వంటి పంటలను నెలకోసారి విత్తుతున్నారు. ఐఫార్మ్స్‌లో ఆరుబయట ఎత్తు మడులపై పెరుగుతున్న కసూరి మేతి, ఎర్ర ముల్లంగి, దిల్, గ్రీన్ లెట్యూస్, రెడ్ లెట్యూస్, పర్పుల్ కార్న్, బేబీ కార్న్, మిక్స్‌డ్ కలర్ కార్న్.. వంటి విదేశీ జాతుల కూరగాయలు వినియోగదారులను, సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రోగనిరోధక శక్తిని పెంచే నల్ల కంది, సుగంధ పసుపు, మామిడి అల్లం వంటి పంటలు కూడా ఈ క్షేత్రంలో సాగవుతున్నాయి.



● భారీ సైజు బ్రోకలి



● కసూరి మెంతికూర

అంతర పంటలు..
మొరంగడ్డ తీగతో మల్చింగ్...

మామిడి, జామ, సీతాఫలం, బొప్పాయి తదితర పండ్ల మొక్కల మొదళ్లలో మొరంగడ్డ (చిలగడదుంప) తీగ ముక్కలను నాటడం ద్వారా కలుపును నివారించడమే కాకుండా సజీవ ఆచ్ఛాదన కల్పిస్తుండటం మరో విశేషం. తీగ ముక్క నాటిన ఆరు నెలల్లో చిలగడదుంపలను తవ్వి వినియోగదారులకు అందిస్తూ ఆదాయం కూడా పొందుతున్నారు.

పండ్ల తోటల్లో ఖరీఫ్‌లో, రబీలో కూడా అంతర పంటలను సాగు చేస్తున్నారు. సజీవ ఆచ్ఛాదన, కలుపు నివారణ, అదనపు ఆదాయం.. అంతర పంటల ద్వారా ఈ మూడు ప్రయోజనాలు సాధిస్తున్నారు. జామ తోటలో మొక్కల మధ్య చిలగడదుంప, సాళ్ల మధ్య వేరుశనగ వేశారు. వేరుశనగలతో వంట నూనె ఉత్పత్తి చేయడానికి ఎద్దు గానుగను ఏర్పాటు చేసుకుంటున్నామని రంగప్రసాద్ తెలిపారు. శాశ్వత పందిరికి దొండ తీగలు పాకించి.. పందిరి కింద సాళ్ల మధ్య ఖాళీలో వెల్లుల్లి, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. బొప్పాయి తోట మధ్యలో 9 రకాల తులసి రకాలను పెంచుతున్నారు. సీతాఫలంలో బాలానగర్, ఎన్ఎంకె గోల్డ్, రామాఫలం, లక్ష్మణఫలం రకాలు నాటారు. ఈ నాలుగూ ఒకేసారి కాపునకు రావు. ఒకటి పూర్తయ్యాక మరొకటి ఫలాలనిస్తాయి.

ఎటు చూసినా 10 అడుగుల దూరంలో మామిడి మొక్కలు నాటారు. మధ్యలో ఖరీఫ్‌లో కంది, రబీలో చిలగడదుంప సాగు చేస్తున్నారు. అందరూ ఎక్కువగా ఇష్టపడే బేనిషాన్, హిమాయత్ మొక్కలు పెట్టాం. ఎక్కడెక్కడి నుంచో అరుదైన రకాలను సైతం తెచ్చి అన్నీ కలిపి 70 రకాలను నాటామని రంగప్రసాద్ తెలిపారు. భవిష్యత్తులో అన్ని రకాల మామిడి పండ్లతో కూడిన బుట్టలను ప్రజలకు సరఫరా చేయనున్నట్లు సుబ్రమణ్య రాజు తెలిపారు.

నాటు కోళ్లు

సమీకృత సేద్యం ద్వారానే ఉత్తమ ఫలితాలు వస్తాయని రంగప్రసాద్ నమ్మిక. 35 దేశీ ఆవులతో కూడిన గోశాల ఈ క్షేత్రంలో ఉంది. సుమారు 400 నాటుకోళ్ల ఫారాన్ని నెలకొల్పారు. నాటు కోళ్లతో పాటు గిన్నెకోళ్లు, టర్కీ కోళ్లు, అసీల్ తదితర జాతుల కోళ్లు కూడా ఇక్కడ ఉన్నాయి. ఆరోగ్యదాయకన రీతిలో ఆరుబయట తిరుగుతూ పెరిగేలా కోళ్లకు ఏర్పాట్లు చేశారు. నాటు కోడి గుడ్లను కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో పాటు అందించాలన్నదే రంగప్రసాద్ లక్ష్యం.

సంతృప్తికర ఉత్పాదకత

పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, జీవన ఎరువులు, జీవన పురుగుమందులను అవసరాన్ని బట్టి వాడుతున్నారు. తద్వారా పోషకలోపాలు లేకుండా, చీడపీడల బెడద లేకుండా.. సంతృప్తికరమైన రీతిలో పంటల ఉత్పాదకత సాధిస్తున్నట్లు సుబ్రహ్మణ్య రాజు(76598 55588) వివరించారు. హైదరాబాద్‌లోని ఆర్గానిక్ షాపులకు అందించడంతో పాటు ఎంపికచేసుకున్న గేటెడ్ కమ్యూనిటీలకు స్వయంగా తీసుకెళ్లి వారానికోసారి తమ సేంద్రియ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు రంగప్రసాద్. సేంద్రియ ఆహారోత్పత్తులను నేరుగా పొలం నుంచి పొందగోరే గేటెడ్ కమ్యూనిటీలు, నివాస సముదాయాల సంక్షేమ సంఘాలు ఉచితంగా తమ క్షేత్రాన్ని సందర్శించవచ్చని సమీకృత సేంద్రియ సాగు దారుడు రంగప్రసాద్(988 51 22544) ఆహ్వానిస్తున్నారు.

నిర్వహణ:
పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్

మామిడిలో సస్యరక్షణకు హోమియో మందులు



మామిడి పూత, పిందె దశలో సస్యరక్షణకు హోమియో మందులు ఎంతగానో ఉపయోగపడతాయని యాదాద్రి భువనగిరి జిల్లా రామకృష్ణాపురంలోని అమేయ కృషి వికాస కేంద్రం వ్యవస్థాపకులు, రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి చెబుతున్నారు. ఆయన మాటల్లోనే..

● మామిడి చెట్లకు పూత సరిగ్గా రావాలంటే ZINCUMET-30, MAGPHOS-30, BORAN / BORAX-30 మందులను వారం రోజుల వ్యవధిలో 3 సార్లు చొప్పున.. ఒకదాని వెంట మరొకటి 3 సార్లు పిచికారీ చేసుకోవాలి. అట్లనే పూత బలంగా రావటం కోసం PULSATILLA-30ను కూడా పిచికారీ చేసుకోవాలి. ● దోమ నుంచి పూతను, పిందెను కాపాడుకోవడానికి COCCINELLA SEPTE - 30, PSORINUM-30 పిచికారీ చేసుకోవాలి. ● రేగు కాయల పరిమాణంలోకి వచ్చిన మామిడి కాయలు రాలిపోతుంటే BOVISTA -30 పొటెన్సీలో పిచికారీ చేసుకోవాలి. మంచు ఎక్కువగా పడుతుంటే పూత, పిందెను రక్షించుకోవడానికి CUPRUM SULPH-30 పిచికారీ చేసుకోవాలి. ● మంగుతో కాయ నల్లగా మారుతూ ఉంటే, ముద్దపుచ్చు (ఆంత్రాక్నోస్)ను నివారించుకోవడానికి ALYSIC ACID-30, CARBOVEG-30 పిచికారీ చేసుకోవాలి. ● కొమ్మెండు తెగులు నుంచి రక్షించుకోవడానికి CUPRUM SULPH-30 పిచికారీ చేసుకోవాలి. ● పాత తోటల్లో మామిడి ఆకులపైన బుడిపెలు (మాల్ ఫార్మేషన్) వస్తే కొమ్మలను కత్తిరించి, దూరంగా తీసుకెళ్లి తగులబెట్టాలి. ఇది అంటు వ్యాధి. అరికట్టకపోతే దిగుబడిపై కూడా ప్రభావితం చూపిస్తుంది. TUJA-200ను వారంలో 3 సార్లు పిచికారీ చేసుకుంటే పోతుంది. ● కాయ పెరుగుదల మొదటి దశలో AMONIUMPHOS-30 పిచికారీ చేసుకోవచ్చు. తర్వాత కాయ పెరుగుతున్న దశలో SUPHALA-30ను పిచికారీ చేసుకోవచ్చు. ఇది అమేయ కృషి వికాస కేంద్రం రూపొందించిన మందు. బయట మందుల షాపులో దొరకదు. త్రిబుల్19కు ప్రత్యామ్నాయంగా పనిచేస్తుంది. ● మామిడి రైతులకు మరో ముఖ్య సూచన ఏమిటంటే.. 15 రోజులకోసారి నీటి తడులతో పాటు ఎకరానికి 800 నుంచి 1,000 లీటర్ల వరకు గోకృపామృతం పారించుకుంటే.. కాయ పరిమాణం బాగుంటుంది, కాయ రాలకుండా ఉంటుంది. మరిన్ని వివరాలకు ఈ కింది వీడియో చూడొచ్చు.
www.youtube.com/@ameyakrishivikasakendram5143

మిల్లెట్స్ వాల్ క్యాలెండర్



2023ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల పునరుజ్జీవానికి కృషి చేస్తున్న బెంగళూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ 'సహజ సమృద్ధ' మిల్లెట్స్‌పై ఓ వాల్ క్యాలెండర్‌ను ప్రచురించింది. నాబార్డ్ సహాయంతో ఆర్.ఆర్.ఎ. నెట్‌వర్క్‌తో కలసి సహజ సమృద్ధ ఈ క్యాలెండర్‌ను ఆంగ్లం, తెలుగు, కన్నడ తదితర ప్రాంతీయ భాషల్లోనూ రూపొందించింది. ఈ క్యాలెండర్‌లో వర్షాధార వ్యవసాయ పరంగా చిరుధాన్యాల ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు.. పౌష్టికాహార లోపాన్ని పారదోలే అద్భుత చిరుధాన్య వంటకాలను తయారు చేసుకునే పద్ధతులను, ప్రాసెసింగ్ యంత్రాల సమాచారాన్ని సైతం ఇందులో సచిత్రంగా వివరించారు. మిల్లెట్‌లను పునరుద్ధరించడంలో, సాంప్రదాయ మిల్లెట్ ఆహార వ్యవస్థను సజీవంగా ఉంచడంలో రైతులు, గిరిజనులు, భూమిలేని వ్యవసాయ కార్మికులు నిర్వహిస్తున్న పాత్రను ఈ క్యాలెండర్ గుర్తు చేస్తుంది. ఈ 24 పేజీల క్యాలెండర్. క్యాలెండర్ ధర రూ.150 (కొరియర్ ఖర్చుతో సహా). ఇతర వివరాల కోసం... 99720 77998 నంబరుకు కాల్ చేయవచ్చు.

448 వేలం బరిలో నిలిచిన ప్లేయర్లు
87 అమ్ముడైన మొత్తం ప్లేయర్లు
57 భారత క్రికెటర్లు
30 విదేశీ క్రికెటర్లు
రూ.**12** కోట్లు
ప్లేయర్ల కొనుగోలుకు ఒక్కో ఫ్రాంచైజీకి కేటాయించిన మొత్తం

రూ. **59** కోట్ల **50** లక్షలు
ఐదు ఫ్రాంచైజీలు కలిసి వెచ్చించిన మొత్తం

రూ. **50** లక్షలు
వేలం పూర్తయ్యాక మిగిలిన మొత్తం. ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్ జట్లు రూ. 12 కోట్లు ఖర్చు చేశాయి. ఢిల్లీ క్యాపిటల్స్ వద్ద రూ. 35 లక్షలు... గుజరాత్ జెయింట్స్ వద్ద రూ. 5 లక్షలు... రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వద్ద రూ. 10 లక్షలు మిగిలిపోయాయి.

ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా గిల్



గత నెలలో శ్రీలంక, న్యూజిలాండ్‌లతో జరిగిన ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ల్లో ఒక డబుల్ సెంచరీ, రెండు సెంచరీలతో సహా మొత్తం 567 పరుగులు చేసిన భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. కాన్వే (న్యూజిలాండ్), సహచరుడు సిరాజ్‌లను వెనక్కి నెట్టి ఈ పురస్కారానికి ఎంపికయ్యాడు. గతంలో భారత్ నుంచి పంత్, అశ్విన్, భువనేశ్వర్, కోహ్లి, శ్రేయస్ అయ్యర్ ఈ అవార్డు గెల్చుకున్నారు.

స్మృతి సూపర్ హిట్

డబ్ల్యూపీఎల్ వేలంలో భారత వైస్ కెప్టెన్‌కు అత్యధిక మొత్తం

- రూ. **3** కోట్ల **40** లక్షలకు సొంతం చేసుకున్న బెంగళూరు
- ముగిసిన మహిళల లీగ్ వేలం
- ముంబైలో మార్చి 4 నుంచి 26 వరకు టోర్నీ


స్మృతి మంధాన

అద్భుతమైన ఆట... నాయకత్వ ప్రతిభ... మార్కెటింగ్‌కు అవకాశం ఉన్న ప్రచారకర్త... ఒక మహిళా క్రికెటర్‌లో ఈ మూడు లక్షణాలు ఉంటే ఆమె కోసం జట్లు పోటీ పడటం సహజమే... ఇప్పుడు సరిగ్గా అదే జరిగింది. తొలి మహిళా ప్రీమియర్ లీగ్ వేలంలో అందరికంటే ఎక్కువ విలువతో భారత స్టార్ ప్లేయర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన శిఖరాన నిలిచింది. వేలంలో అందరికంటే ముందుగా ఆమె పేరు రాగా... ముంబై, బెంగళూరు స్మృతిని దక్కించుకునేందుకు హోరాహోరీగా పోటీ పడ్డాయి. చివరకు రూ. 3 కోట్ల 40 లక్షలకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు సొంతం చేసుకుంది. ఆ తర్వాత ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ స్టార్లు యాష్లే గార్డ్‌నర్, నటాలీ సివర్ రూ. 3 కోట్ల 20 లక్షలతో రెండో స్థానంలో నిలిచారు. ఆశ్చర్యకరంగా భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు మాత్రం ఆశించిన విలువ దక్కలేదు. నాలుగు టీమ్‌లు హర్మన్ కోసం ప్రయత్నించినా...చివరకు రూ. 1 కోటి 80 లక్షల వద్దే హర్మన్ వేలం ముగిసింది. మొత్తంగా చూస్తే పురుషుల ఐపీఎల్ తరహాలో కొన్ని సంచలనాలు, కొంత ఆశ్చర్యం, మరికొంత అనూహ్యం కలగలిపి తొలి మహిళల లీగ్ వేలం సాగింది. అయితే డబ్బుల విలువ, అంకెలను పక్కన పెట్టి చూస్తే భారత మహిళల క్రికెట్‌లో కొత్త లీగ్, అందు కోసం సాగిన వేలం కొత్త ప్రస్థానానికి పునాది వేసింది.

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మొదటిసారి నిర్వహించబోతున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మొదటి అంకమైన ప్లేయర్ల వేలం ఘనంగా ముగిసింది. మొత్తం 448 మంది వేలంలోకి రాగా... ఐదు జట్లలోకి కలిపి మొత్తం 87 మంది ఎంపికయ్యారు. నిబంధనల ప్రకారం గరిష్టంగా టీమ్‌కు 18 మంది చొప్పున మొత్తం 90 మందికి అవకాశం ఉన్నా.... యూపీ 16 మందికి, ముంబై 17 మందికే పరిమితమయ్యాయి. మిగిలిన మూడు జట్లు బెంగళూరు, ఢిల్లీ, గుజరాత్ 18 మంది చొప్పున తీసుకున్నాయి. వేలంలో ఎక్కువ మొత్తం పలికిన టాప్-10 జాబితాలో భారత్ నుంచి స్మృతి మంధానతో పాటు దీప్తి శర్మ (రూ.2 కోట్ల 60 లక్షలు), జెమీమా రోడ్రిగ్స్ (రూ. 2 కోట్ల 20 లక్షలు), షఫాలీ వర్మ (రూ. 2 కోట్లు), పూజ వస్త్రకర్ (రూ.1 కోటి 90 లక్షలు), రిచా ఘోష్ (రూ. 1 కోటి 90 లక్షలు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ. 1 కోటి 80 లక్షలు) ఉన్నారు. సీనియర్ జట్టుకు ఆడిన షఫాలీ, రిచా కాకుండా ఇటీవల అండర్-19 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టు నుంచి ఆరుగురు అమ్మాయిలకు లీగ్‌లో అవకాశం దక్కింది. అయితే అండర్-19 ప్రపంచకప్‌లో రాణించిన హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిషను వేలంలో ఎవరూ తీసుకోలేదు. మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలోని రెండు వేదికల్లో డబ్ల్యూపీఎల్ నిర్వహిస్తారు. ఈ టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు జరుగుతాయి. మహిళల ప్రీమియర్ లీగ్ కావడంతో వేలం కార్యక్రమాన్ని కూడా మహిళనే నిర్వహించడం విశేషం. 2021లో ప్రొ కబడ్డీ లీగ్ వేలం కార్యక్రమం చేసిన మల్లిక సాగర్ డబ్ల్యూపీఎల్ వేలంను నిర్వహించింది.

వేలం విశేషాలు...

భారత జట్టు ఓపెనర్ స్మృతి మంధానకు భారీ విలువ పలకవచ్చనే అంచనా తప్పలేదు. ఇప్పటికే మహిళల బిగ్‌బాష్ లీగ్, 'హండ్రెడ్' లీగ్‌లలో ఆడి ఆమె సత్తా చాటింది. దాంతో సహజంగానే ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. భారీ షాట్లు ఆడగల రిచా ఘోష్‌పై కూడా జట్లు నమ్మకం ఉంచాయి. టీమిండియా టాప్ ప్లేయర్లలో దీప్తి శర్మ తన సొంత రాష్ట్రం జట్టు యూపీ తరఫున ఆడనుంది. ప్రస్తుతం టి20 క్రికెట్‌లో వరల్డ్ నంబర్‌వన్ ఆల్‌రౌండర్ అయిన యాష్లే గార్డ్‌నర్‌పై కూడా టీమ్‌లు ఆసక్తి చూపించాయి. ఆసీస్ ఇతర అగ్రశ్రేణి ప్లేయర్లు అలీసా హీలీ, మెగ్ లానింగ్‌లకు కూడా మంచి విలువ దక్కింది. మహిళల టి20 క్రికెట్‌లో ఎంతో గుర్తింపు తెచ్చుకొని లీగ్ వేలంలో అమ్ముడు పోకుండా మిగిలిన అగ్రశ్రేణి ప్లేయర్లలో డానీ వ్యాట్, కేథరీన్ బ్రంట్, అమీ జోన్స్, అలానా కింగ్, సుజీ బేట్స్, చమరి అటపట్టు తదితరులు ఉన్నారు. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కోసం గుజరాత్ మినహా మిగతా నాలుగు జట్లూ పోటీ పడ్డాయి. అయితే చివరకు ఊహించిన మొత్తం మాత్రం ఆమెకు దక్కలేదు.

- అసోసియేట్ దేశాల నుంచి ఒకే ఒక ప్లేయర్ తారా నోరిస్ (అమెరికా) ఎంపికైంది. లెఫ్టార్మ్ పేసర్ అయిన తారా స్వస్థలం ఫిలడెల్ఫియా.
- యూఏఈకి చెందిన మనిక గౌర్ కోసం గుజరాత్ ఆసక్తి చూపించింది. అయితే వారి కోటా పూర్తి అయిందని తేలడంతో ఆ జట్టు వెనక్కి తగ్గాల్సి వచ్చింది.
- 16 ఏళ్ల ఆంధ్రప్రదేశ్ పేస్ బౌలర్ షబ్నమ్ షకీల్ ఈ వేలంలో ఎంపికైన అతి పిన్న వయస్కురాలు.

యూపీ వారియర్స్

దీప్తి శర్మ	రూ.2.60 కోట్లు
సోఫీ ఎకిల్‌స్టోన్ ✈	రూ.1.80 కోట్లు
దేవిక వైద్య	రూ.1.40 కోట్లు
తాహ్లియా మెక్‌గ్రాత్ ✈	రూ.1.40 కోట్లు
షబ్నిమ్ ఇస్మాయిల్ ✈	రూ.1 కోటి
గ్రేస్ హారిస్ ✈	రూ.75 లక్షలు
అలీసా హీలీ ✈	రూ.70 లక్షలు
అంజలీ శర్వాణి	రూ.55 లక్షలు
రాజేశ్వరి గైక్వాడ్	రూ.40 లక్షలు
శ్వేత సెహ్రావత్	రూ.40 లక్షలు
కిరణ్ నవ్‌గిరే	రూ.30 లక్షలు
లారెన్ బెల్ ✈	రూ.30 లక్షలు
లక్ష్మీ యాదవ్	రూ.10 లక్షలు
పార్శవి చోప్రా	రూ.10 లక్షలు
సొప్పదండి యశశ్రీ	రూ.10 లక్షలు
సిమ్రాన్ షేక్	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 16	విదేశీ ప్లేయర్లు: 6

ఢిల్లీ క్యాపిటల్స్

జెమిమా రోడ్రిగ్స్	రూ.2.20 కోట్లు
షఫాలీ వర్మ	రూ.2 కోట్లు
మరిజన్ కాప్ ✈	రూ.1.50 కోట్లు
మెగ్ లానింగ్ ✈	రూ.1.10 కోట్లు
అలైస్ కాప్సీ ✈	రూ.75 లక్షలు
శిఖా పాండే	రూ.60 లక్షలు
జెస్ జొనాసెన్ ✈	రూ.50 లక్షలు
లౌరా హారిస్ ✈	రూ.45 లక్షలు
రాధా యాదవ్	రూ.40 లక్షలు
అరుంధతీ రెడ్డి	రూ.30 లక్షలు
మిన్ను మణి	రూ.30 లక్షలు
పూనమ్ యాదవ్	రూ.30 లక్షలు
స్నేహ దీప్తి	రూ.30 లక్షలు
తానియా భాటియా	రూ.30 లక్షలు
టిటాస్ సాధు	రూ.25 లక్షలు
జాసియా అక్తర్	రూ.20 లక్షలు
అపర్ణ మోండల్	రూ.10 లక్షలు
తారా నోరిస్ ✈	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 18	విదేశీ ప్లేయర్లు: 6

తెలుగు అమ్మాయిలు ఆరుగురు...



అంజలి శర్వాణి
లెఫ్టార్మ్ పేస్ బౌలర్. కర్నూల్ జిల్లా ఆదోని స్వస్థలం. భారత్ తరఫున 6 టి20లు మ్యాచ్‌లు ఆడింది.



సబ్బినేని మేఘన
బ్యాటర్, స్వస్థలం విజయవాడ. భారత్ తరఫున 3 వన్డేలు, 17 టి20 మ్యాచ్‌లు ఆడింది.

వి. స్నేహ దీప్తి
బ్యాటర్. స్వస్థలం విశాఖపట్నం. భారత్ తరఫున 1 వన్డే, 2 టి20లు ఆడింది.



షబ్నమ్
రైట్ ఆర్మ్ పేస్ బౌలర్. స్వస్థలం విశాఖపట్నం. ఇటీవల అండర్-19 ప్రపంచకప్‌లో ఆడింది.



అరుంధతి రెడ్డి
రైట్ ఆర్మ్ పేస్ బౌలర్. స్వస్థలం హైదరాబాద్. భారత్ తరఫున 26 టి20లు ఆడింది.



ఎస్. యశశ్రీ
పేస్ బౌలర్. హైదరాబాద్ స్వస్థలం. ఇటీవల అండర్-19 ప్రపంచ కప్‌లో ఆడింది.

గుజరాత్ జెయింట్స్

యాష్లే గార్డ్‌నర్ ✈	రూ.3.20 కోట్లు
బెత్ మూనీ ✈	రూ.2 కోట్లు
జార్జియా వేర్‌హామ్ ✈	రూ.75 లక్షలు
స్నేహ్ రాణా	రూ.75 లక్షలు
అనాబెల్ సదర్లాండ్ ✈	రూ.70 లక్షలు
డియాండ్ర డాటిన్ ✈	రూ.60 లక్షలు
సోఫియా డన్‌క్లే ✈	రూ.60 లక్షలు
సుష్మా వర్మ	రూ.60 లక్షలు
తనూజ కన్వర్	రూ.50 లక్షలు
హర్లీన్ డియోల్	రూ.40 లక్షలు
అశ్వని కుమారి	రూ.35 లక్షలు
హేమలత	రూ.30 లక్షలు
మాన్సి జోషి	రూ.30 లక్షలు
మోనిక పటేల్	రూ.30 లక్షలు
సబ్బినేని మేఘన	రూ.30 లక్షలు
హర్లీ గాల	రూ.10 లక్షలు
పరుణిక సిసోడియా	రూ.10 లక్షలు
షబ్నమ్ షకీల్	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 18	విదేశీ ప్లేయర్లు: 6

ముంబై ఇండియన్స్

నటాలీ సివర్ ✈	రూ.3.20 కోట్లు
పూజ వస్త్రకర్	రూ.1.90 కోట్లు
హర్మన్‌ప్రీత్ కౌర్	రూ.1.80 కోట్లు
యస్తిక భాటియా	రూ.1.50 కోట్లు
అమేలియా కెర్ ✈	రూ.1 కోటి
అమన్‌జోత్ కౌర్	రూ.50 లక్షలు
హేలీ మాథ్యూస్ ✈	రూ.40 లక్షలు
క్లోయ్ ట్రియాన్ ✈	రూ.30 లక్షలు
హిదెర్ గ్రాహమ్ ✈	రూ.30 లక్షలు
ఇసాబెలె వోంగ్ ✈	రూ.30 లక్షలు
ప్రియాంక బాల	రూ.20 లక్షలు
ధార గుజ్జార్	రూ.10 లక్షలు
హుమైరా కాజి	రూ.10 లక్షలు
జింతిమని కలిత	రూ.10 లక్షలు
నీలమ్ బిష్త్	రూ.10 లక్షలు
సయిక ఇషాక్	రూ.10 లక్షలు
సోనమ్ యాదవ్	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 17	విదేశీ ప్లేయర్లు: 6

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

స్మృతి మంధాన	రూ.3.40 కోట్లు
రిచా ఘోష్	రూ.1.90 కోట్లు
ఎలీస్ పెర్రీ ✈	రూ.1.70 కోట్లు
రేణుక సింగ్	రూ.1.50 కోట్లు
సోఫీ డివైన్ ✈	రూ.50 లక్షలు
హీతెర్ నైట్ ✈	రూ.40 లక్షలు
మేగన్ షట్ ✈	రూ.40 లక్షలు
కనిక అహూజ	రూ.35 లక్షలు
డేన్‌వాన్ నికెర్క్ ✈	రూ.30 లక్షలు
ఎరిన్ బర్న్స్ ✈	రూ.30 లక్షలు
ప్రీతి బోస్	రూ.30 లక్షలు
కోమల్ జంజద్	రూ.25 లక్షలు
ఆశ శోభన	రూ.10 లక్షలు
దిశ కాసత్	రూ.10 లక్షలు
ఇంద్రాణి రాయ్	రూ.10 లక్షలు
పూనమ్ ఖేమ్నర్	రూ.10 లక్షలు
సహన పవార్	రూ.10 లక్షలు
శ్రేయాంక పాటిల్	రూ.10 లక్షలు
మొత్తం ప్లేయర్లు: 18	విదేశీ ప్లేయర్లు: 6 ✈

వేలంలో టాప్-10


యాష్లే గార్డ్‌నర్
రూ. 3 కోట్ల 20 లక్షలు


నటాలీ సివర్
రూ. 3 కోట్ల 20 లక్షలు


దీప్తి శర్మ
రూ. 2 కోట్ల 60 లక్షలు


జెమీమా రోడ్రిగ్స్
రూ. 2 కోట్ల 20 లక్షలు


బెత్ మూనీ
రూ. 2 కోట్లు


షఫాలీ వర్మ
రూ. 2 కోట్లు


పూజ వస్త్రకర్
రూ. 1 కోటి 90 లక్షలు


రిచా ఘోష్
రూ. 1 కోటి 90 లక్షలు


సోఫీ ఎకిల్‌స్టోన్
రూ. 1 కోటి 80 లక్షలు


హర్మన్‌ప్రీత్
రూ. 1 కోటి 80 లక్షలు

రన్నరప్ హంపి



మ్యూనిక్ (జర్మనీ): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో జరిగిన మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ రెండో టోర్నమెంట్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి రన్నరప్‌గా నిలిచింది. సోమవారం ముగిసిన ఈ టోర్నీలో హంపి 7 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. తాన్ జోంగీ (చైనా)తో జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌ను హంపి 31 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. 12 మంది మేటి క్రీడాకారిణుల మధ్య 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హంపి అజేయంగా నిలిచింది. ఎనిమిది గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హంపి మూడు గేముల్లో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 6 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచింది. 11వ రౌండ్‌లో నానా జాగ్‌నిడ్జెతో జరిగిన గేమ్‌ను హారిక 11 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. హారిక కూడా ఈ టోర్నీలో ఒక్క గేమ్‌లోనూ ఓడిపోలేదు. 10 గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హారిక ఒక గేమ్‌లో గెలిచింది. 7.5 పాయింట్లతో అలెగ్జాండ్రా కొస్టెనిక్ (రష్యా) విజేతగా అవతరించింది. చివరి గేమ్‌లో అలెగ్జాండ్రా కొస్టెనిక్ 64 ఎత్తుల్లో జినెర్ జు (చైనా) చేతిలో ఓడిపోయింది. నాలుగు గ్రాండ్‌ప్రి సిరీస్‌లలో భాగంగా మూడో టోర్నీ వచ్చే నెలలో భారత్‌లో జరుగుతుంది.

'అమ్మ' నుంచి మళ్లీ ఆటకు..

స్నేహ దీప్తికి డబ్ల్యూపీఎల్ అవకాశం


భర్త మద్దిరాల ఫిలిప్, పాప క్రివాలతో స్నేహ దీప్తి

16 ఏళ్ల 204 రోజులు... 2013 ఏప్రిల్‌లో స్నేహ దీప్తి అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ టి20ల్లో ఆడిన భారత ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. ఆ తర్వాత మరో టి20 మ్యాచ్‌లో బరిలోకి దిగిన ఆమె అదే నెలలో తన ఏకైక వన్డే కూడా ఆడింది. అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు ఆమె దూరమైంది. ఇప్పుడు దాదాపు పదేళ్ల తర్వాత స్నేహ దీప్తికి అరుదైన రీతిలో తొలి డబ్ల్యూపీఎల్‌లో ఆడే అవకాశం దక్కింది. వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఆమెను రూ. 30 లక్షలకు సొంతం చేసుకుంది. సాధారణంగా దశాబ్ద కాలం పాటు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరం అంటే కెరీర్ ముగిసినట్లే. కానీ దీప్తి 26 ఏళ్ల వయసులో మళ్లీ సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఇన్నేళ్ల పాటు ఆటకు దూరం కాకుండా 'అమ్మ'గా మారిన తర్వాత కూడా క్రికెట్‌లో ఆమె కొనసాగిన తీరు స్ఫూర్తిదాయకం. దూకుడైన బ్యాటింగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న స్నేహ ఆంధ్ర జట్టు తరఫున నిలకడైన ప్రదర్శనతో చిన్న వయసులోనే భారత జట్టులో అవకాశం దక్కించుకుంది. దేశవాళీలో దక్షిణ మధ్య రైల్వే తరఫున చక్కటి ఇన్నింగ్స్‌లతో ఆమె గుర్తింపు తెచ్చుకుంది. ఫిబ్రవరి 2021లో ఆమెకు పాప పుట్టింది. ఈ సమయంలోనే ఆటకు విరామమిచ్చి స్నేహ సెప్టెంబర్‌లోనే మళ్లీ దేశవాళీ క్రికెట్‌లోకి అడుగు పెట్టింది. అప్పటి నుంచి క్రికెట్‌ను కొనసాగిస్తూ ఇప్పుడు డబ్ల్యూపీఎల్‌తో మళ్లీ అందరి దృష్టిని ఆకర్షించడం విశేషం.

– సాక్షి క్రీడా విభాగం

ధర్మశాల టెస్టు ఇండోర్‌లో...

ఖరారు చేసిన బీసీసీఐ

న్యూఢిల్లీ: అనుకున్నట్లే జరిగింది. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య వచ్చే నెల 1 నుంచి 5 వరకు ధర్మశాల వేదికగా జరగాల్సిన మూడో టెస్టు వేదికను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మార్చింది. ఈ మ్యాచ్‌కు ఆతిథ్య వేదికగా ఇండోర్‌ను ప్రకటించింది. హిమాచల్‌ప్రదేశ్ క్రికెట్ సంఘం (హెచ్‌పీసీఏ)కు చెందిన స్టేడియంలో నవీకరణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో మైదానాన్ని మార్చారు. బీచ్ ఉన్న వైజాగ్ నగరంతో పాటు బెంగళూరులను ప్రత్యామ్నాయ వేదికలుగా బోర్డు పరిశీలించినప్పటికీ చివరకు ఇండోర్‌ను ఖాయం చేసింది. 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో భాగంగా ధర్మశాలలో జరగాల్సిన మూడో టెస్టును ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో నిర్వహిస్తాం' అని బోర్డు కార్యదర్శి జై షా ప్రకటించారు. శీతాకాల పరిస్థితులు, స్టేడియంలోని అసంపూర్తి పనుల వల్లే వేదికను మార్చినట్లు ఆయన వివరించారు. నాలుగు టెస్టుల సిరీస్‌లో భారత్ తొలి మ్యాచ్‌లో గెలిచి 1-0తో ఆధిక్యంలో ఉంది.

ప్రేమకథా చిత్రమ్

సినిమా

'ప్రేమకథ'లు చూడ్డానికి బాగుంటాయి. గాఢమైన 'ప్రేమ కథలు' అయితే మనసులో నిలిచిపోతాయి. దుష్యంతుడు, శకుంతలది అలాంటి ప్రేమకథే. కొన్నేళ్ల పాటు దూరంగా ఉన్నా వీరి ప్రేమ బలమైనది కాబట్టే నిలబడింది. ఈ ప్రేమ కథని త్వరలో వెండితెరపై చూడనున్నాం. మరికొన్ని ప్రేమకథలు కూడా రానున్నాయి. ఒక్కో 'ప్రేమకథా చిత్రమ్'ది ఒక్కో కథ. ఈ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆ ప్రేమకథా చిత్రాల గురించి తెలుసుకుందాం.


● సమంత, దేవ్ మోహన్


● విజయ్ దేవరకొండ, సమంత


● నాగశౌర్య, మాళవికా నాయర్


● కిరణ్, కశ్మీర


● ఆనంద్, వైష్ణవి చైతన్య


● సంతోష్, గౌరి

ప్రేమకావ్యాల్లో 'అభిజ్ఞాన శాకుంతలం'ది ప్రత్యేకమైన స్థానం. కాళిదాసు రచించిన ఈ ప్రేమకథ ఆధారంగా ఆల్రెడీ కొన్ని సినిమాలు వచ్చాయి. తాజాగా దర్శకుడు గుణశేఖర్ 'శాకుంతలం' సినిమా తీశారు. ఇందులో దుష్యంతుడిగా దేవ్ మోహన్, శకుంతలగా సమంత నటించారు. దుష్యంత మహారాజు, శకుంతల ప్రేమ చుట్టూ ఈ సినిమా సాగుతుందన్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు ఓ కొత్త ప్రేమకథతో ఖుషీగా రానున్నారు విజయ్ దేవరకొండ-సమంత. ఈ ఇద్దరూ జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఖుషి'. 'ఒక రొమాంటిక్ ప్రేమ కావ్యం నిర్మాణంలో ఉంది' అని విజయ్, 'కుటుంబమంతా చూసి మంచి అనుభూతికి గురయ్యే సినిమా' అని సమంత 'ఖుషి' అప్‌డేట్ అప్పుడు పేర్కొన్నారు. సమంత అనారోగ్యం కారణంగా ఈ సినిమా షూటింగ్‌కి చిన్న బ్రేక్ పడింది. ఏది ఏమైనా ఈ ఏడాదే ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటోంది యూనిట్. మరోవైపు హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో 2018లో వచ్చిన లవ్‌స్టోరీ 'గీత గోవిందం' సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. కాగా విజయ్, పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇది లవ్‌స్టోరీ ఫిల్మ్ అని, 'గీత గోవిందం'కు సీక్వెల్ అనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఇదే నిజమైతే విజయ్ వెంట వెంటనే ప్రేమకథా చిత్రాల్లో నటించినట్లు అవుతుంది. ఇక అబ్బాయి, అమ్మాయి స్నేహం ప్రేమగా మారిన ఎన్నో కథలు వెండితెరపైకి వచ్చాయి. ప్రేక్షకుల మనసులను మెప్పించాయి. ఈ కోవలో రానున్న మరో చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. అబ్బాయి సంజయ్ పీసపాటి, అమ్మాయి అనుపమా కస్తూరిల ప్రేమ కథ ఇది. సంజయ్ పాత్రలో నాగశౌర్య, అనుపమ పాత్రలో మాళవికా నాయర్ నటించారు. ఫ్రెండ్‌షిప్, లవ్, బ్రేకప్ అంశాల మేళవింపుతో దర్శకుడు అవసరాల శ్రీనివాస్ ఈ సినిమాను తెరకెక్కించారు. మార్చి 17న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఇంకోవైపు 'మొదటి ప్రేమకు మరణం లేదు. మనసు పొరల్లో శాశ్వతంగా సమాధి చేయబడి ఉంటుంది' అంటున్నారు ఆనంద్ దేవరకొండ. సాయి రాజేష్ దర్శకత్వంలో ఆనంద్ హీరోగా, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. ఫస్ట్ లవ్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందుతోంది. ఇక శ్రీదేవి ఎక్కడుంటే శోభన్‌బాబు అక్కడే ఉంటాడట. ఎందుకంటే ప్రేమంట. సంతోష్ శోభన్, గౌరి జి కిషన్ హీరో హీరోయిన్లుగా ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో రూపొందిన లవ్‌స్టోరీ 'శ్రీదేవి శోభన్‌బాబు'. ఇందులో శోభన్‌బాబుగా సంతోష్ శోభన్, శ్రీదేవిగా గౌరి కనిపిస్తారు. ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ఇంకోవైపు 'ఎస్ఆర్ కళ్యాణ మండపం'తో ఫేమ్ సంపాదించుకున్న హీరో కిరణ్ అబ్బవరం నటించిన తాజా చిత్రం 'వినరో భాగ్యము విష్ణుకథ'. ఫోన్ నంబర్ నైబర్‌హుడ్ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ ప్రేమకథా చిత్రంలో కశ్మీర హీరోయిన్‌గా నటించగా, కిశోర్ డైరెక్టర్ చేశారు. ఈ చిత్రం కూడా ఈ నెల 18న రిలీజ్ కానుంది.

ఇవి కాక మరికొన్ని ప్రేమకథా చిత్రాలు ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
251	86
60,432	17,771

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,885	△ 167
డోజోన్స్	34,180	△ 310
ఎఫ్‌టీఎస్ఈ 100	7,948	△ 65
డాక్స్	15,397	△ 89
హాంగ్‌సెంగ్	3,284	△ 24
నికాయ్	27,427	▽ 244

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్)	57,060
బంగారం (22 క్యారట్)	56,832
వెండి (కిలో)	66,371

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.95	83.62
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.73	89.93
€	యూరో	ఒకటి	98.08	101.37
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	61.70	63.70
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.05	58.46
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.13	63.12
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	21.62	23.42
¥	చైనా యువాన్	ఫారెక్స్	11.00	13.07

అంతా బాగానే ఉంది..

ఇన్వెస్టర్లకు అదానీ గ్రూప్ భరోసా



న్యూఢిల్లీ: అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ దెబ్బతో కంపెనీల షేర్ల పతనం ఇంకా కొనసాగుతూనే ఉండటంతో ఇన్వెస్టర్లకు భరోసా కల్పించేందుకు అదానీ గ్రూప్ ప్రయత్నాలు చేస్తోంది. తమ వ్యాపార ప్రణాళికలకు అవసరమైన నిధులు పుష్కలంగా ఉన్నాయని తెలిపింది. వాటాదారులకు మంచి రాబడులే అందించగలమంటూ ధీమా వ్యక్తం చేసింది. వృద్ధి లక్ష్యాలు, పెట్టుబడులను కుదించుకుంటున్నట్లు వస్తున్న వార్తలను గ్రూప్ అధికార ప్రతినిధి ఖండించారు. ప్రస్తుత మార్కెట్ కుదుటపడిన తర్వాత గ్రూప్‌లోని ప్రతీ సంస్థ తన వ్యూహాల సమీక్ష చేపడుతుందని చెప్పారు.

సీయూబీ లాభం అప్

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ సంస్థ సిటీ యూనియన్ బ్యాంక్(సీయూబీ) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 11 శాతం బలపడి రూ. 218 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ. 1,195 కోట్ల నుంచి రూ. 1,430 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 13 శాతం పుంజుకుని రూ. 556 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయం 40 శాతం జంప్‌చేసి రూ. 224 కోట్లను అధిగమించింది.

వారాంతాన ఫలితాలు ప్రకటించిన సీయూబీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 15 శాతంపైగా పతనమై రూ. 136 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-2-2023	
విశాఖ	440–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	411–00
విజయవాడ	411–00
రిటైల్ ధర (డజను)	66.00
13-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	383–00
వరంగల్	385–00
రిటైల్ ధర	4.45

భారత్‌లో రెనో-నిస్సాన్ రూ. 5,300 కోట్ల పెట్టుబడులు

చెన్నై: ఆటోమొబైల్ దిగ్గజాలు రెనో–నిస్సాన్ భారత్‌లో సుమారు 600 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,300 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నాయి. రెండు చిన్న ఎలక్ట్రిక్ కార్లతో పాటు ఆరు కొత్త వాహనాలను ఆవిష్కరించనున్నాయి. అలాగే చెన్నైలోని తమ ప్లాంటును కూడా అప్‌గ్రేడ్ చేయనున్నాయి. నిస్సాన్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అశ్వనీ గుప్తా ఈ విషయాలు తెలిపారు. రెనో ఇండియా కంట్రీ సీఈవో వెంకట్రామ్ మామిళ్లపల్లి, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాలను రాష్ట్ర ప్రభుత్వ సారథ్యంలోని నోడల్ ఏజెన్సీ గైడెన్స్ బ్యూరో ఎండీ విష్ణు వేణుగోపాల్, గుప్తా ఇచ్చిపుచ్చుకున్నారు. రెనో–నిస్సాన్ అనేది ఫ్రాన్స్‌కి చెందిన రెనో, జపాన్‌కి చెందిన నిస్సాన్ కంపెనీల జాయింట్ వెంచర్. కొత్తగా వచ్చే వాహనాల్లో నాలుగు ఎస్‌యూవీలు ఉంటాయి. వీటిలో మొదటిది 2025 నాటికి మార్కెట్లోకి రానుందని గుప్తా చెప్పారు. దేశీయంగా ప్రవేశపెట్టే ఆరు వాహనాల్లో నిస్సాన్, రెనోవి చెరో మూడు వాహనాలు ఉంటాయి. తాజా పెట్టుబడులతో కొత్తగా 2,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని గుప్తా ఈ సందర్భంగా వివరించారు.

పునర్‌వ్యవస్థీకరణ..

జాయింట్ వెంచర్లో సమాన వాటాదార్లుగా ఉండేలా రెండు సంస్థలు భారత్‌లో తమ తయారీ, ఆర్‌అండ్‌డీ విభాగాల్లో పెట్టుబడుల స్వరూపంలో మార్పులు, చేర్పులు చేస్తున్నాయి. దీని ప్రకారం జేవీలో నిస్సాన్ వాటా 70 శాతం నుంచి 51 శాతానికి తగ్గనుండగా రెనో వాటా 30 శాతం నుంచి 49 శాతానికి పెరుగుతుంది. తమ చెన్నై తయారీ కేంద్రాన్ని 2045 నాటికల్లా పూర్తిగా పునరుత్పాదక విద్యుత్‌తో నడిచేలా తీర్చిదిద్దనున్నట్లు గుప్తా వివరించారు. భారత మార్కెట్‌కు రెనో, నిస్సాన్ కట్టుబడి ఉన్నాయని నిస్సాన్ రీజియన్ చైర్‌పర్సన్ (ఆఫ్రికా తదితర ప్రాంతాలు) గిలోమ్ తెలిపారు.



కొనసాగిన నష్టాలు

ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు అప్రమత్తత
సెన్సెక్స్ నష్టం 251 పాయింట్లు • 17,800 దిగువకు నిఫ్టీ

ముంబై: కీలక ద్రవ్యోల్బణ డేటా వెల్లడి ముందు అప్రమత్తత చోటు చేసుకోవడంతో స్టాక్ మార్కెట్ సోమవారమూ నష్టపోయింది. అదానీ గ్రూప్ షేర్లలో భారీ అమ్మకాలు సెంటిమెంట్‌పై ఒత్తిడిని పెంచాయి. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న మిశ్రమ సంకేతాలతో ఉదయం సూచీలు స్వల్ప నష్టాలతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 496 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 251 పాయింట్లు నష్టపోయి 60,432 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 161 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి 86 పాయింట్లు పతనమైన 17,771 వద్ద నిలిచింది. సూచీలకిది ఇది రెండోరోజు నష్టాల ముగింపు. అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అధికంగా విక్రయాలు జరిగాయి. విస్తృత స్థాయి మార్కెట్లో నెలకొన్న అమ్మకాలతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 1.25% నష్టపోయాయి.



విదేశీ ఇన్వెస్టర్లు వరుసగా రెండోరోజూ కొనుగోళ్లు చేపట్టారు. మొత్తం రూ.1,322 షేర్లను, దేశీయ ఇన్వెస్టర్లు రూ.522 షేర్లను కొన్నారు. రూపాయి విలువ 15 పైసలు క్షీణించి 82.73 వద్ద స్థిరపడింది. సూచీలు అరశాతం పతనంతో రూ.2.51 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. యూఎస్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. ''బాండ్లపై దిగుమతులు, డాలర్ ఇండెక్స్ పెరగడంతో మార్కెట్లో విస్తృతంగా అమ్మకాలు జరిగాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ నాలుగు అదానీ కంపెనీ షేర్లపై రేటింగ్ ఔట్‌లుక్‌ను 'స్టేబుల్' నుండి 'నెగటివ్'కి తగ్గించడంతో ఈ గ్రూప్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి.
- ఫార్మా కంపెనీ లుపిన్ షేరు ఎనిమిదిశాతానికి పైగా నష్టపోయి రూ.675 వద్ద స్థిరపడింది. క్యూ3 గణాంకాలు నిరాశపరచడం, బ్రోకరేజీలు డౌన్‌గ్రేడ్ చేయడం దీనికి నేపథ్యం.
- నష్టాల మార్కెట్‌లోనూ ఆయిల్ ఇండియా షేరు ర్యాలీ చేసింది. బీఎస్ఈలో తొమ్మిదిశాతం బలపడి తొమ్మిది నెలల గరిష్టం రూ.243 వద్ద ముగిసింది.

గోల్డ్ ఈటీఎఫ్‌లకు అమ్మకాల సెగ

జనవరిలో రూ.199 కోట్లు ఉపసంహరణ



న్యూఢిల్లీ: బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్) నుంచి జనవరిలో రూ.199 కోట్లు బయటకు వెళ్లిపోయాయి. గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి నికరంగా పెట్టుబడులు వెళ్లిపోవడం వరుసగా ఇది మూడో నెల కావడం గమనించాలి. ఇన్వెస్టర్లు ఈ తరుణంలో బంగారం కంటే కూడా ఈక్విటీలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు. 2022 డిసెంబర్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి రూ.273 కోట్లు, నవంబర్‌లో రూ.195 కోట్లు చొప్పున పెట్టుబడులు బయటకు వెళ్లాయి. 2022 అక్టోబర్‌లో రూ.147 కోట్ల పెట్టుబడులను గోల్డ్ ఈటీఎఫ్ పథకాలు ఆకర్షించాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ గణాంకాలను విడుదల చేసింది. ఈక్విటీ ఫండ్స్‌కు ఆదరణ పెరగడం బంగారం ఈటీఎఫ్‌లు వెనుకబడడానికి కారణమని నిపుణులు అభిప్రాయపడ్డారు. కాగా, బంగారం ఈటీఎఫ్ నిర్వహణ ఆస్తుల విలువ మాత్రం రూ.21,836 కోట్లకు వృద్ధి చెందింది. 2022 డిసెంబర్ నాటికి ఇది రూ.21,455 కోట్లు. గోల్డ్ ఈటీఎఫ్ ఫోలియోల సంఖ్య 35,680 పెరిగి 46.74 లక్షలకు చేరింది.

మళ్లీ రిటైల్ ధర'దడ..'

జనవరిలో ద్రవ్యోల్బణం 6.52 శాతం స్పీడ్ • మూడు నెలల గరిష్ట స్థాయి

న్యూఢిల్లీ: వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం మళ్లీ పంజా విసిరింది. ధరల స్పీడ్ జనవవరిలో మూడు నెలల గరిష్ట స్థాయి 6.52 శాతంగా (2022 ఇదే నెలతో పోల్చి ధరల తీరు) నమోదయ్యింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి కేంద్రం నిర్దేశిస్తున్నదాని ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం 6 శాతం దిగువన ఉండాలి. అయితే 10 నెలలు ఆపైన కొనసాగిన రిటైల్ ద్రవ్యోల్బణం నవంబర్, డిసెంబర్ నెలల్లో కట్టడిలోకి (ఆరు శాతం దిగువకు) వచ్చింది. ఆర్‌బీఐ ద్రవ్య, పరపతి విధానాలకు ముఖ్యంగా రెపోపై నిర్ణయానికి రిటైల్ ద్రవ్యోల్బణమే ప్రాతిపదిక అయిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు), మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. ఈ నెల మొదట్లో వరుసగా ఆరవసారి పెంపుతో మే నుంచి 2.5 శాతం రెపో రేటు పెరిగినట్లయ్యింది. జాతీయ గణాంకాల కార్యాలయం తాజా లెక్కల ప్రకారం ఫుడ్ బాస్కెట్ ధర జనవరిలో 5.94 శాతం ఎగసింది. డిసెంబర్‌లో ఈ పెరుగుదల రేటు 4.19 శాతం. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 6.85 శాతం అయితే, పట్టణ ప్రాంతాల్లో ఈ రేటు 6 శాతంగా ఉంది.



2022–23లో రిటైల్ ద్రవ్యోల్బణం సగటును 6.5 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ తాజా పాలసీ సమీక్షలో అంచనావేయగా, జనవరి–డిసెంబర్ మధ్య 5.7 శాతంగా ఉంటుందని విశ్లేషించింది.

ఐఏఐసీసీ హైదరాబాద్ చాప్టర్ ఏర్పాటు

చైర్మన్‌గా సురేష్ చిట్టూరి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇండియన్ అమెరికన్ ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐఏఐసీసీ) తాజాగా హైదరాబాద్ చాప్టర్ ప్రారంభించింది. శ్రీనివాసా ఫామ్స్ వీసీ, ఎండీ సురేష్ రాయుడు చిట్టూరి దీనికి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇరు దేశాల్లో వ్యాపార అవకాశాలను తెలుగు రాష్ట్రాలు, అమెరికాలోని చిన్న సంస్థలు అందిపుచ్చుకునేందుకు కావాల్సిన తోడ్పాటును ఐఏఐసీసీ అందిస్తుందని సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో సురేష్ తెలిపారు.ప్రస్తుతం భారత్‌లో ఢిల్లీ, ముంబై తదితర నగరాల్లో ఐఏఐసీసీ చాప్టర్లు ఉన్నాయి. తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఐఏఐసీసీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కేవీ కుమార్, సీఐఐ తెలంగాణ చైర్మన్ వాగీశ్ దీక్షిత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆడి క్యూ3 స్పోర్ట్‌బ్యాక్



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ కంపెనీ ఆడి.. భారత్‌లో స్పోర్టీ కాంపాక్ట్ క్రాస్‌ఓవర్ క్యూ3 స్పోర్ట్‌బ్యాక్ మోడల్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఆల్ వీల్ డ్రైవ్ కారు ధర ఎక్స్‌షోరూంలో రూ.51.43 లక్షలు. 190 హెచ్‌పీ పవర్‌తో 2 లీటర్ పెట్రోల్ ఇంజన్‌ను పొందుపరిచారు. 7.3 సెకన్లలోనే గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. లగ్జరీ కార్ల రంగంలో ఈ బాడీ స్టైల్‌తో మోడల్‌ను ప్రవేశపెట్టడం తొలిసారి అని కంపెనీ తెలిపింది. 2022లో ఆడి ఇండియా 4,187 కార్లను దేశీయంగా విక్రయించింది. 2021తో పోలిస్తే 27.14 శాతం వృద్ధి అని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ తెలిపారు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 500 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులు

ముంబైలో ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా ఉన్న శాఖల్లో రెగ్యులర్ ప్రాతిపదికన ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 500
» **పోస్టుల వివరాలు:** జనరల్ బ్యాంకింగ్ స్ట్రీమ్‌లో క్రెడిట్ ఆఫీసర్ (జీబీవో)–350, ఐటీ ఆఫీసర్ ఇన్ స్పెషలిస్ట్ స్ట్రీమ్(ఎస్‌పీఎల్)–150.
» **అర్హత:** క్రెడిట్ ఆఫీసర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ,ఐటీ ఆఫీసర్ పోస్టులకు బీఈ, బీటెక్/పీజీ(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్–టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.02.2023 నాటికి 20 నుంచి 29 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. » **వేతనం:** నెలకు రూ.36,000 నుంచి రూ.63,480 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, బృంద చర్చలు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్షా విధానం:** మొత్తం 225 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్, ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ పేపర్–లెటర్ రైటింగ్–ఎస్సే అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
» **తెలంగాణ రాష్ట్రంలో పరీక్షా కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.02.2023.
» **వెబ్‌సైట్:** www.bankofindia.co.in

గుంటూరు జిల్లా కారాగార వైద్యశాలలో వివిధ ఉద్యోగాలు

గుంటూరు జిల్లా కారాగార వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **పోస్టుల వివరాలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్2–01, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2–01, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ–01.
» **అర్హత:** పదో తరగతి, డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.17,500(ఎంఎన్‌వో ఖాళీలకు రూ.12,000).
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సూపరింటెండెంట్ కార్యాలయం, జిల్లా జైలు, గుంటూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.02.2023.
» **వెబ్‌సైట్:** guntur.ap.gov.in

డీఎంహెచ్‌వో, మెదక్ జిల్లాలో మెడికల్ ఆఫీసర్ పోస్టులు

మెదక్‌లోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్(ఆయుర్వేద/యునాని/హోమియోపతి) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీఎన్‌వైఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** డిగ్రీలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, మెదక్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.02.2023.
» **వెబ్‌సైట్:** medak.telangana.gov.in

ఆతిథ్య రంగంలో.. అందుకో అవకాశాలు!

ఇంజనీరింగ్, మెడిసిన్‌కు భిన్నంగా వినూత్న అవకాశాలు కోరుకునే వారికి సరైన మార్గం.. హోటల్ మేనేజ్‌మెంట్! బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో.. బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసుకుంటే.. విస్తృత అవకాశాలు ఖాయం! ఇందుకు ఎన్‌టీఏ నిర్వహించే.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్.. జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ)–2023 లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ వివరాలు, పరీక్ష విధానం, కోర్సులు అందించే ఇన్‌స్టిట్యూట్స్, ఎంట్రన్స్‌లో విజయానికి నిపుణుల సలహాలు..

» ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ–2023 నోటిఫికేషన్ విడుదల
» బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశానికి మార్గం
» ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ స్కోర్‌తో పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం
» ఇంటర్మీడియెట్ అర్హతతో పోటీ పడే అవకాశం
» బీఎస్సీ సర్టిఫికెట్‌తో ఫ్యూచర్ బెస్ట్ ఆపర్చునిటీస్

వృద్ధి బాటలో పయనిస్తూ.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగాల్లో కీలకంగా నిలుస్తోంది.. హోటల్ మేనేజ్‌మెంట్ విభాగం. కాబట్టి బ్యాచిలర్ స్థాయిలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి భవిష్యత్తు అవకాశాలకు ఢోకా లేదు అంటున్నారు నిపుణులు.

బ్యాచిలర్ టు పీజీ

హోటల్ మేనేజ్‌మెంట్‌లో రాణించేందుకు అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలు అందించే ఉద్దేశంతో.. కేంద్ర పర్యాటక శాఖ.. నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ విభాగాన్ని నెలకొల్పింది. దీని పరిధిలో జాతీయ స్థాయిలో ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో బ్యాచిలర్ స్థాయి నుంచి పీజీ, ఇతర స్పెషలైజేషన్లలో హోటల్ మేనేజ్‌మెంట్ సంబంధిత కోర్సులు అందిస్తున్నారు. బ్యాచిలర్ స్థాయిలో.. బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రవేశానికి జరిపే పరీక్ష.. ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా ఆయా క్యాంపస్‌లలో ప్రవేశం ఖరారు చేస్తారు.

75 ఇన్‌స్టిట్యూట్‌లు.. 11,965 సీట్లు

- ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ స్కోర్ ఆధారంగా.. జాతీయ స్థాయిలో 75 ఇన్‌స్టిట్యూట్‌లలో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 21 ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లతో పాటు ఆయా రాష్ట్రాల పరిధిలో 28 ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్స్ ఉన్నాయి.
- అదే విధంగా 25 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లు, ఒక పబ్లిక్ సెక్టార్ యూనిట్ అనుబంధ కాలేజ్ ఉన్నాయి. వీటిలో మొత్తం11,965 సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- తెలుగు రాష్ట్రాలకు సంబంధించి.. ఏపీలో ఎస్ఐహెచ్ఎం–తిరుపతి(60 సీట్లు), తెలంగాణలో ఐహెచ్ఎం–హైదరాబాద్(285 సీట్లు), డాక్టర్ వైఎస్సార్ ఎన్ఐటీహెచ్ఎం(120 సీట్లు), ఐహెచ్ఎం శ్రీశక్తి కాలేజ్(120 సీట్లు), ఎస్ఐహెచ్ఎం–మెదక్(60 సీట్లు) క్యాంపస్‌లలో ఈ కోర్సు ఉంది.

అర్హతలు

ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి వయోపరిమితి నిబంధన లేదు.

ఐదు విభాగాలు-200 ప్రశ్నలు

- ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈని జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో.. 200 ప్రశ్నలకు నిర్వహిస్తారు. మొత్తం నాలుగు విభాగాల్లో పరీక్ష ఉంటుంది. న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ 30 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 60 ప్రశ్నలు, ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ 50 ప్రశ్నలకు పరీక్ష నిర్వహిస్తారు.
- పరీక్ష ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలతో ఉంటుంది. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.
- మెరిట్ జాబితాను రూపొందించే క్రమంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో అత్యధిక మార్కులు పొందిన వారిని ముందుగా పరిగణనలోకి తీసుకుంటారు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌తో సీట్ల భర్తీ

ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈలో స్కోర్ ఆధారంగా.. ఉమ్మడి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ విధానం ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకుని తమ ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలతో ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి. అందుబాటులో ఉన్న సీట్లు, అప్లికేషన్లు, విద్యార్థులు పొందిన స్కోర్‌ను గణించి సీట్ల కేటాయింపు చేస్తారు.

నాలుగో ఏడాది చదివే అవకాశం

ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ, బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు విషయంలో ఈ ఏడాది ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశం.. మూడేళ్ల కోర్సు పూర్తయ్యాక ఆసక్తి ఉన్న అభ్యర్థులు మరో ఏడాది చదివే అవకాశం కల్పించడం. నూతన విద్యా విధానం ప్రకారం–తొలిసారి ఈ ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీంతో.. మూడేళ్ల బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తయ్యాక నాలుగో ఏడాది కూడా చదివితే ఆనర్స్ డిగ్రీ అందిస్తారు.

ఉపాధి అవకాశాలు విస్తృతం

హాస్పిటాలిటీ బీఎస్సీ పూర్తి చేసుకున్న వారికి టూరిజం హాస్పిటాలిటీ సెక్టార్లలో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్; ఫ్రంట్ డెస్క్ మేనేజర్; క్రూయిజ్ మేనేజర్; కిచెన్ ఎగ్జిక్యూటివ్; మార్కెటింగ్ మేనేజర్; సర్వీస్ ఎగ్జిక్యూటివ్; అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్; ట్రిప్ అడ్వైజర్; బ్యాక్ ఎండ్ ఎగ్జిక్యూటివ్స్; చెఫ్స్ వంటి పలు ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ బీఎస్సీ కోర్సులో ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ ఆధారంగా.. ఆయా విభాగాల్లో ఎంట్రీ లెవల్‌లో కొలువులు దక్కుతున్నాయి. ప్రారంభంలో సగటున రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకూ వేతనం అందుతోంది.



ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ-2023

ఎంట్రెన్స్‌లో విజయం ఇలా

- **న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్:** అభ్యర్థికి మ్యాథమెటిక్స్‌లో ఉన్న బేసిక్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందుకోసం హైస్కూల్ స్థాయిలోని మ్యాథమెటిక్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా శాతాలు, లాభ– నష్టాలు, నెంబర్ సిస్టమ్, సగటు, కాలం–పని, సాధారణ వడ్డీ, బారు వడ్డీ, కాలం–వేగం–దూరం, నిష్పత్తులు, జామెట్రీ వాటిపై పట్టు సాధించాలి. అనలిటికల్ ఆప్టిట్యూడ్ విషయంలో.. నిర్దిష్టంగా డేటాను విశ్లేషించగలిగే సామర్థ్యం , డేటాలోని ముఖ్య సమాచారాన్ని క్రోడీకరించి.. ఇచ్చిన ప్రశ్నకు అనువుగా, సమాధానం ఇచ్చే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. ఇందుకోసం గ్రాఫ్‌లు, పైచార్ట్‌లు, ఫ్లోచార్ట్‌లు వంటి వాటిని ప్రాక్టీస్ చేయాలి.
- **రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్:** ఇందులో మెరుగైన ప్రతిభ కనబర్చాలంటే.. మ్యాథమెటికల్ ఆపరేషన్స్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్స్ వంటి రీజనింగ్ ఆధారిత అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా డేటా సఫీషియన్సీ, వెన్ డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది.
- **జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్:** హైస్కూల్ స్థాయిలోని పుస్తకాల్లో ఉండే చరిత్ర, రాజ్యాంగం, జాగ్రఫీ, ఎకనామిక్స్ పాఠ్యాంశాలు చదవాలి. హిస్టరీలో ముఖ్యమైన యుద్ధాలు–పరిణామాలు–పర్యవసానాలు, స్వాతంత్ర్యోద్యమం వంటి అంశాలపై అవగాహన లాభిస్తుంది. జాగ్రఫీలో దేశంలోని ముఖ్యమైన ప్రదేశాలు, ఖనిజ వనరులు–అవి ఎక్కువగా లభించే ప్రాంతాలు, నదులు, సరస్సులు, పర్వతాల గురించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి ముఖ్యమైన సదస్సులు, సమావేశాలు, వార్తల్లోని వ్యక్తులు, ఇటీవల కాలంలో అంతర్జాతీయ ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్:** కీలకమైన ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో రాణించడానికి అభ్యర్థులు గ్రామర్‌ను ఔపోసన పట్టాలి. టెన్సెస్, ప్రిపోజిషన్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, యాంటానిమ్స్, సినానిమ్స్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్స్, సీక్వెన్స్ ఆఫ్ వర్డ్స్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. దీనికోసం బేసిక్ గ్రామర్ పుస్తకాలను అధ్యయనం చేయడంతోపాటు న్యూస్ పేపర్లను చదవడం, వాటిలోని కొత్త పదాలను తెలుసుకోవడం, ఆ పదాలను వినియోగించిన తీరుపై అవగాహన ఏర్పరచుకోవడం వంటివి లాభిస్తాయి. పదో తరగతి స్థాయి ఇంగ్లిష్ పుస్తకాలను అధ్యయనం చేయడం ద్వారా ఈ విభాగంలో పేర్కొన్న సిలబస్‌లో అధిక శాతం సిలబస్‌ను పూర్తి చేసుకోవచ్చు.
- **ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్..స్పెషల్ సెక్షన్:** ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈలో ప్రత్యేకమైన విభాగంగా ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ విభాగాన్ని పేర్కొనొచ్చు. ఇందులో ప్రధానంగా అభ్యర్థికి ఆతిథ్య, పర్యాటక రంగాల్లో ఉన్న ఆసక్తి,దృక్పథాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి. వాస్తవ సంఘటన లేదా అంశం ఇచ్చి దానికి ఎలా స్పందిస్తారు? అనే తరహా ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నలు అభ్యర్థుల్లో ఎదుటి వారిని మెప్పించే తీరు,సందర్భానికి తగినట్లు వ్యవహరించే శైలికి సంబంధించి ఉంటాయి.

ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ-2023.. ముఖ్యాంశాలు

- దేశ వ్యాప్తంగా 21 ఐహెచ్‌ఎంలు, 28 ఎస్ఐహెచ్ఎంలు, 25 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్స్, 1 పీఎస్‌యూ ఇన్‌స్టిట్యూట్‌లో బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశం.
- ఈ ఏడాది నుంచి ఆనర్స్ డిగ్రీ విధానం ప్రారంభం.
- మూడేళ్ల కోర్సు తర్వాత మరో ఏడాది చదివితే ఆనర్స్ డిగ్రీ సర్టిఫికెట్.
- కోర్సు పూర్తి చేసుకుంటే ప్రముఖ హోటల్స్, హాస్పిటాలిటీ, టూరిజం విభాగాల్లో కొలువులు.
- ప్రారంభంలోనే సగటున రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వార్షిక వేతనం

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** ఏప్రిల్ 27, 2023
- **ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ పరీక్ష తేదీ:**మే14, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
- **వెబ్‌సైట్:** https://nchmjee.nta.nic.in

క్లుప్తంగా...

ఆర్కే బీచ్‌లో డ్రెడ్జింగ్ ప్రారంభం



బీచ్‌రోడ్డు: తీర ప్రాంత పరిరక్షణకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్‌రావు అన్నారు. విశాఖలోని ఆర్కే బీచ్‌లో డ్రెడ్జింగ్ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ విశాఖ పోర్టు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా ఏటా రూ.20 కోట్లతో ఈ డ్రెడ్జింగ్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు.

నగరిలో టీడీపీని రెండు సార్లు ఓడించారు..

- ఈసారైనా గెలిపించాలని వినతి
- యువగళం పాదయాత్రలో లోకేశ్



పుత్తూరులో జనంలేక వెలవెలబోయిన సభ

పుత్తూరు రూరల్(తిరుపతి జిల్లా): నగరిలో రెండు సార్లు వరుసగా టీడీపీని ఓడించారని, ఈ సారైనా టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నగరి నియోజక వర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన ప్రారంభించిన యువగళం పాదయాత్ర 18వ రోజైన సోమవారం పుత్తూరు పట్టణ పరిధిలోని చినరాజుకుప్పం నుంచి ప్రారంభమైంది. అంతకు ముందు అదే గ్రామం వద్ద నిర్వహించిన బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడారు. మంత్రి రోజా తనకు చీర, గాజులు పంపిస్తానని చెప్పారని గుర్తుచేశారు. పుత్తూరుకు వచ్చానని, వాటిని పంపిస్తే ఇక్కడి ఆడపడుచులకు ఇస్తానన్నారు. అనంతరం పుత్తూరు మీదుగా నారాయణవనం మండలంలోకి పాదయాత్ర ప్రవేశించింది. కాగా, లోకేశ్ తన ప్రసంగంతో నవ్వులు పూయించారు. గ్రానైట్‌కు బదులు గర్నైటు అనీ, క్వారీ బదులు కొర్రీ అని పలికారు.

టీడీపీవన్నీ మోసపూరిత విధానాలే

- లోకేశ్‌పై మంత్రి నాగార్జున ధ్వజం



సాక్షి, అమరావతి: కుల తత్వం, మోసపూరిత విధానాలు, మితిమీరిన అవినీతితోనే 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిందని మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయింది టీడీపీ కాదని, ప్రజలు, యువత అని లోకేశ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సోమవారం ఓ ప్రకటనలో ఘాటుగా స్పందించారు. టీడీపీ ఎందుకు ఓడిపోయిందో లోకేశ్‌కు తెలియకపోతే ఆయన తండ్రి చంద్రబాబును అడిగి తెలుసుకోవాలన్నారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని లోకేశ్ ప్రజా తీర్పుపై వక్రభాష్యం చెప్పి, కించపరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చంద్రబాబు అన్ని పథకాల్లోనూ సొంత సామాజిక వర్గానికే పెద్దపీట వేసారన్నారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వకుండా యువతను మోసం చేసారని చెప్పారు. 2014 ఎన్నికల్లో 600కు పైగా వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదని ధ్వజమెత్తారు. సీఎంను విమర్శించే స్థాయి లోకేశ్‌కు లేదని స్పష్టం చేశారు.

అప్పర్‌భద్రను ఆపకుంటే ఆందోళనలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

హొసపేటె: కర్ణాటకలో తుంగభద్ర జలాశయం ఎగువన అప్పర్ భద్ర సహా ఎటువంటి ప్రాజెక్టు నిర్మాణం జరగరాదని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అప్పర్‌భద్ర నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో సోమవారం ఆయన హొసపేటె వద్ద తుంగభద్ర జలాశయాన్ని సందర్శించారు.

మార్చి నుంచి దేశవ్యాప్త రాజకీయ ప్రచారోద్యమం

- సీపీఎం నేతలు బేబీ, రాఘవులు

సాక్షి, అమరావతి: మార్చిలో దేశవ్యాప్తంగా రాజకీయ ప్రచారోద్యమం నిర్వహిస్తామని సీపీఎం నేతలు ఎంఏ బేబీ, బీవీ రాఘవులు అన్నారు. విజయవాడలో ఆ పార్టీ నూతనంగా నిర్మించిన రాష్ట్ర కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. పార్టీ పతాకాన్ని సీపీఎం సీనియర్ నేత పి.మధు ఆవిష్కరించారు. బేబీ మాట్లాడుతూ దేశం ఫాసిస్టు ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వంలోని బీజేపీ, అదానీ, అంబానీ, మాఫియా చేతుల్లోకి వెళుతున్నదని విమర్శించారు. బీవీ రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం సూత్రబద్ధ వైఖరితో పనిచేస్తున్నదన్నారు.

'సిప్'.. సిప్.. హుర్రే

సిప్ విధానంలో మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు మొగ్గు

- రూ. 6,73,774.80 కోట్లకు చేరిన పొదుపు మొత్తం
- పది నెలల కాలంలో కొత్తగా 82 లక్షల ఖాతాలు ప్రారంభం
- జనవరి నాటికి 6.21 కోట్లకు చేరిన సిప్ ఖాతాల సంఖ్య
- భారీగా పెరుగుతున్న సగటు ఇన్వెస్ట్‌మెంట్ మొత్తం




ఆంఫీ తాజా గణాంకాల్లో వెల్లడి

సాక్షి, అమరావతి: అంతర్జాతీయంగా మార్కెట్లు తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతున్నా... మరోసారి ఆర్థిక మాంద్యం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అవుతున్నా.. దేశంలోని యువత స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడానికే మొగ్గు చూపుతోంది. ఇందుకోసం వారు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ విధానం (సిప్)ను ఎంచుకుంటున్నారు. ప్రతీ నెలా నిర్దిష్ట మొత్తాన్ని క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేయడాన్ని సిప్ విధానంగా పేర్కొంటారు. బ్యాంకు వడ్డీ రేట్లు తక్కువగా ఉండటం, రియల్ ఎస్టేట్, బంగారం ధరలు ఆకాశాన్నంటడంతో యువత ఇన్వెస్ట్‌మెంట్ సాధనంగా మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకుంటున్నారు. దీంతో గడిచిన మూడేళ్లలో సిప్ ఖాతాల సంఖ్య రెట్టింపు కావడమే కాకుండా అదే స్థాయిలో నెలవారీ ఇన్వెస్ట్‌మెంట్ మొత్తం కూడా పెరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పది నెలల కాలంలో సిప్ ఖాతాల సంఖ్య 82 లక్షలకు పైగా పెరిగినట్లు అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఆంఫీ) తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. 2021–22 ఏప్రిల్‌లో 5.39 కోట్లుగా ఉన్న సిప్ ఖాతాల సంఖ్య ఈ ఏడాది జనవరి నాటికి 6.21 కోట్లకు చేరాయి. అంటే సగటున ప్రతీ నెలా 10 లక్షల మంది కొత్త ఇన్వెస్టర్లు వచ్చి చేరుతున్నారు.

భారీగా పెరిగిన ఇన్వెస్ట్‌మెంట్

దేశంలోని మ్యూచువల్ ఫండ్ ఆస్తుల విలువ జనవరి నాటికి రికార్డు స్థాయిలో రూ. 14,28,43,642 కోట్లకు చేరితే అందులో సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసిన మొత్తం రూ. 6,73,774.80 కోట్లు ఉందంటే మనవాళ్లు సిప్ విధానానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అంతే కాదు గడిచిన మూడేళ్లుగా సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే మొత్తంలో కూడా భారీ పెరుగుదల నమోదవుతోంది. 2020–21లో సగటున నెలవారీ ఇన్వెస్ట్ చేసే మొత్తం రూ. 9,000 కోట్లుగా ఉంటే అది ఇప్పుడు ఏకంగా రూ. 13,856.18 కోట్లకు చేరింది. దీర్ఘకాలిక లక్ష్యాలతో మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య ఏటా క్రమంగా పెరుగుతోందని ఆంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎన్.ఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. ఒక్క జనవరిలోనే కొత్తగా 23 లక్షల కొత్త సిప్ ఖాతాలు ప్రారంభం కావడం దేశీయ స్టాక్‌మార్కెట్ పాజిటివ్ ట్రెండ్‌కు నిదర్శనంగా పేర్కొన్నారు. సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తున్నవారిలో అత్యధికంగా స్మాల్ క్యాప్ ఫండ్స్ వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రస్తుత గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దేశ స్టాక్ మార్కెట్ల పతనం తక్కువగా ఉండటానికి సిప్ పెట్టుబడులు కారణంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.



ముందే మొదలైన వేసవి

ఫిబ్రవరి రెండో వారంలోనే సర్రుమంటున్న ఎండ



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది వేసవి ముందే మొదలైంది. ఫిబ్రవరిలోనే ఎండలు పెరుగుతున్నాయి. సాధారణంగా ఫిబ్రవరి ఆహ్లాదకరంగా ఉంటుంది. శీతలం తగ్గుముఖం పడుతూ క్రమంగా వేడి వాతావరణం మొదలవుతుంది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి అందుకు భిన్నంగా ఉంది. ఈ నెల తొలి వారం నుంచే వేసవి వచ్చిందా అనేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో ఆరంభమయ్యే ఉష్ణోగ్రతలు ఇప్పట్నుంచే మొదలవుతున్నాయి. గత రెండు రోజులుగా రాయలసీమలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగాయి. నంద్యాలలో ఆదివారం 38 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. సోమవారం తిరుపతి జిల్లా వరదాయిపాలెంలో 37.9 డిగ్రీలు నమోదైంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 36 నుంచి 37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 9, 10 గంటలకే 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతంలో ఈ సమయాల్లో 32 నుంచి 35 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు ఉండేవి. సాధారణంగా ఈస్థాయి ఉష్ణోగ్రతలు మార్చిలో నమోదవుతాయి. ఇప్పుడు 9 గంటలకే పెరిగి 11 గంటల సమయానికి 36 డిగ్రీలు దాటిపోతోంది. ప్రధానంగా రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉంటున్నాయి. రాయలసీమలోని నంద్యాల, కర్నూలు, అనంతపురం తదితర జిల్లాల్లో వచ్చే 10 రోజులు ఎండ తీవ్రత ఇంకా పెరుగుతుందని చెబుతున్నారు. కృష్ణా, గుంటూరు, విజయనగరం జిల్లాల్లోనూ 36 నుంచి 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు చెబుతున్నారు. గత రెండేళ్లుగా మార్చి, ఏప్రిల్‌ల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేలో ఎక్కువగా ఉంటాయనిపించినా అప్పటికి పెరగలేదు. ఏప్రిల్ చివరి వారం వరకే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీనివల్లే నైరుతి రుతుపవనాలు సకాలంలో వచ్చి, వర్షాలు సమృద్ధిగా కురిశాయి. ఈ ఏడాదీ ముందుగానే ఎండలు మొదలవుతుండడంతో ఏప్రిల్ చివరికి వేసవి తీవ్రత తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అంటే నైరుతి రుతుపవనాలు త్వరగానే వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

గతేడాది వచ్చిన తుపానులు కూడా తీవ్రంగా లేకపోవడం కొంత అనుకూలమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తీవ్ర తుపానులు వస్తే గాలిలో తేమను లాగేసుకుంటాయి. ఆ తర్వాత సూర్యకిరణాలు నేరుగా భూమి మీద పడి ఎండ తీవ్రత పెరుగుతుంది. తీవ్ర తుపానులు లేకపోవడంవల్ల గాలిలో తేమ శాతం పెద్దగా కోల్పోలేదని చెబుతున్నారు. దీని వల్ల ఎండ తీవ్రత అంత ఎక్కువ ఉండే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది లానినా బలహీన పడి ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివిధ వాతావరణ పరిశోధన సంస్థలు చెబుతున్నప్పటికీ, దీనిని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నిర్ధారించడంలేదు. ప్రస్తుతం సమతుల వాతావరణం ఉందని చెబుతోంది. దేశంపైన, రాష్ట్రంపైన ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం పెద్దగా ఉండదని, ఈ ఏడాది కూడా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఇవీ కారణాలు..

భూతాపం (గ్లోబల్ వార్మింగ్), కాలుష్యం పెరుగుదల, ఎల్‌నినో పరిస్థితులు వంటివి ఏటా ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణమని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణం, సముద్ర అధ్యయన విభాగం మాజీ అధిపతి ఓఎస్ఆర్‌యూ భానుకుమార్ చెప్పారు. వాతావరణంలో అనూహ్య మార్పుల వల్ల అతి భారీ, అకాల వర్షాలు, అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఈ వేసవిలో వడగాడ్పుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ చెప్పారు. 'ఇప్పటివరకు ఫిబ్రవరి నెలలో దేశంలో 1953లో 39.7 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత నమోదైందని, 2009లో 39.6 డిగ్రీలు నమోదైందని, ఈసారి 40 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని కేఎల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ సైన్స్ ప్రొఫెసర్ చినసత్యనారాయణ తెలిపారు.

ఏపీ ఇన్ పార్లమెంట్ — లోక్‌సభ

రైల్వేది వ్యాపారమా.. సేవా!

కేంద్రాన్ని ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

సాక్షి, న్యూఢిల్లీ: రైల్వే అనేది వ్యాపారమా లేక సేవా చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్రాన్ని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఎస్.రెడ్డెప్ప పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లు 'ఆదర్శ్ స్టేషన్ల పథకంలో భాగంగా రైల్వేస్టేషన్ల సుందరీకరణ, ఆధునికీకరణ'పై సోమవారం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడారు. దక్షిణ కోస్తా రైల్వేలో రైల్వేబోర్డు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విభజన చట్టం వచ్చి 9 ఏళ్లయినా జోన్ పేరిట ఒక్క భవనం కూడా పూర్తికాలేదన్నారు. ఏపీకి బడ్జెట్‌లో రూ.8,700 కోట్లు ఇచ్చారని, దాంట్లో 50 శాతమైనా ఖర్చు చేస్తారా అని ప్రశ్నించారు. నడికుడి–శ్రీకాళహస్తి రెండో లైన్ అవసరాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. ఝార్ఖండ్, బిహార్‌ల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వాటాను తగ్గించినట్టే ఏపీకి కూడా సహకరించాలన్నారు. లోక్‌సభ జీరో అవర్‌లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. స్టేషన్లు, ప్లాట్‌ఫామ్‌ల ఆధునికీకరణ పేరిట పలు రద్దీ స్టేషన్లలో రైళ్లను ఆపడం లేదన్నారు.

నెట్ బారోయింగ్ సీలింగ్ తగ్గిస్తే ఎలా?

టీడీపీ హయాంలో చేసిన ఎక్కువ అప్పుల భారాన్ని ప్రస్తుత ప్రభుత్వంపై వేయడం తగదని వైఎస్సార్‌సీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ చేసిన అధిక అప్పుల వల్ల ప్రస్తుతం ప్రభుత్వానికి నెట్ బారోయింగ్ సీలింగ్‌ను 2021–22లో రూ.17,923.24 కోట్లకు తగ్గించడం సరికాదన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ హేతుబద్ధతను అనుసరించాలని కోరారు. రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి సీఎం వైఎస్ జగన్ తలపెట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన ప్రారంభించేలా చూడాలని కోరారు.

2.38,835 ఎంఎస్ఎంఈలకు రుణాలు

క్రెడిట్ లైన్ గ్యారంటీ పథకంలో భాగంగా ఏపీలో 2,38,835 ఎంఎస్ఎంఈలకు రూ.9,231.68 కోట్లను రుణాలుగా ఇచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్‌కరాద్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు కార్మిక, ఉపాధి శాఖ సహాయమంత్రి రామేశ్వర్‌తేలి సమాధానమిస్తూ.. ఏపీలో స్టార్టప్‌ల ద్వారా 2020, 2021, 2022ల్లో 8,427 మందికి ఉపాధి లభించిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు గురుమూర్తి ప్రశ్నకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రేణుకసింగ్ సమాధానమిస్తూ.. ఏపీలో 28 ఏకలవ్య మోడల్ పాఠశాలలు పని చేస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు గొడ్డేటి మాధవి, బి.వి.సత్యవతి అడిగిన ప్రశ్నకు విద్యా శాఖ సహాయ సుభాష్ సర్కార్ సమాధానమిస్తూ.. కేంద్రీయ విద్యాలయాల్లో విచక్షణ కోటా ప్రవేశాలు 2021–22 నుంచి నిలిపివేసినట్లు తెలిపారు.

పర్యావరణ ప్రాజెక్టుల ప్రతిపాదనేదీ లేదు

ఎంపీ బీవీ సత్యవతి అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ అటవీ శాఖ సహాయ మంత్రి అశ్విని కుమార్‌చౌబే సమాధానమిస్తూ.. కన్జర్వేషన్ ఆఫ్ నేచురల్ రిసోర్సెస్, ఎకో సిస్టమ్(సీఎన్ఆర్ఈ) కేంద్ర ప్రాయోజిత పథకం ద్వారా గడచిన మూడేళ్లుగా ఏపీ ప్రభుత్వం ఎలాంటి ఆర్థిక సాయం పొందలేదన్నారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి రామేశ్వర్‌తేలి సమాధానమిస్తూ.. జాబ్‌సెర్చ్, కెరియర్ కౌన్సెలింగ్, ఒకేషనల్ గైడెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల సమాచారం తదితర ఉపాధి సంబంధిత సేవల నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో 7.82 లక్షల యాజమాన్యాలు ఉన్నాయని తెలిపారు. పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 1.12 కోట్ల మంది వినియోగించుకున్నారన్నారు.

రాజ్యసభ

తలసరి జీడీపీ పెరిగింది

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: ఆర్‌బీఐ నివేదిక ప్రకారం 2013–14లో రూ.89,796గా ఉన్న దేశ జీడీపీ తలసరి 2021–22 నాటికి రూ.1,72,913కు పెరిగిందని ప్రణాళిక శాఖ సహాయమంత్రి రావ్ ఇంద్రజిత్‌సింగ్ తెలిపారు. జాతీయ ఆదాయంలో టాప్–1 శాతం కలిగిన ధనికులు 40 శాతం, టాప్ 10 శాతం కలిగిన ధనికులు 57 శాతం ఉంటే.. దిగువ ఉన్న 57 శాతం మంది ప్రజలు జాతీయ ఆదాయంలో కేవలం 13 శాతం మాత్రమే ఉన్నారన్న వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్–2022 గణాంకాలు వాస్తవమేనా అని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి సోమవారం అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్టు–2022 నివేదిక సందేహాస్పదంగా ఉండటంతో దాన్ని పరిగణనలోకి తీసుకోలేమని.. ఆ నివేదిక ఆధారంగా కోరిన వివరాలపై వ్యాఖ్యానించలేమని మంత్రి తెలిపారు. దేశంలో పేదరికం, ఆర్థిక అసమానతలు తొలగించేందుకు, వికసిత్ భారత్ ఉద్దేశాన్ని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా, విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ సమాధానమిస్తూ.. ఏపీలో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు ప్రతిపాదన ఏదీ తమ వద్ద లేదన్నారు. ఎన్‌సీసీ కేడెట్లకు సాంకేతిక శిక్షణ ఇచ్చే ఆలోచన ఏదీ లేదని వెల్లడించారు.

ఆ ప్రకటన జారీ లేదు

వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే సమాధానమిస్తూ.. విశాఖ ఉక్కుకు చెందిన రెండు కోక్ ఓవెన్ బ్యాటరీలను రెండేళ్లపాటు కాంట్రాక్టు పద్ధతిన అప్పగించాలన్న ప్రకటన ఏదీ జారీ చేయలేదని తెలిపారు. విశాఖ ఉక్కులో వంద శాతం వాటాను ఉపసంహరించుకోవడానికి కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని పునరుద్ఘాటించారు. వేమిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి సమాధానమిస్తూ.. ఏపీలో పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ప్రాజెక్టును ఆచరణీయం చేయడానికి వయబిలిటి గ్యాప్ ఫండ్ అవసరమని ఓ అధ్యయనం నిర్ధారించిందని తెలిపారు.

బొగ్గు గనులపై ఫిర్యాదులు పరిష్కరించాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సమాధానమిస్తూ.. బొగ్గు గనుల అక్రమ తవ్వకాలపై ఫిర్యాదుల నిమిత్తం తీసుకొచ్చిన ఖానన్ ప్రహరీ (మైనింగ్ గార్డ్) యాప్ ద్వారా 462 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వీటిలో 251 తప్పుడు ఫిర్యాదులని, 77 మాత్రమే సరైనవని తెలిపారు. ప్రస్తుతం 134 ఫిర్యాదులు పరిశీలించాల్సి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు గృహ నిర్మాణ శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ సమాధానమిస్తూ.. 'హృదయ్' పథకంలో భాగంగా ఏపీలోని అమరావతిలో హెరిటేజ్ ప్రాంతాల్లో అప్రోచ్ రోడ్లు ఆధునికీకరించామని, హెరిటేజ్ వాక్‌ను, నూనెగుండెం చెరువును అభివృద్ధి చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తానరావు అడిగిన ప్రశ్నకు మంత్రి రామేశ్వర్ తేలి సమాధానమిస్తూ.. ఏపీలో నవంబర్ 2022 నాటికి 180 సీఎన్జీ స్టేషన్లు, 2,42,054 పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లు ఏర్పాటు చేశామని తెలిపారు.

పెట్టుబడుల్లో అగ్రగామి

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన: మంత్రి వేణుగోపాలకృష్ణ
- రాష్ట్రానికి మరిన్ని ఆకర్షించడమే లక్ష్యంగా విశాఖ సమ్మిట్

సాక్షి, అమరావతి: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సాగుతున్న సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం పారిశ్రామికంగా, ఆర్థికంగా పురోగమిస్తోందని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. దేశంలోనే అత్యధిక పెట్టుబడులను ఆకర్షిస్తున్న రాష్ట్రంగా ఏపీ దూసుకెళ్తోందన్నారు. మార్చిలో విశాఖ వేదికగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ ద్వారా భారీ పెట్టుబడులు రప్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. సోమవారం సచివాలయంలో ఆయన మాట్లాడారు.

■ నూతన పారిశ్రామిక విధానం, సింగిల్ విండో అనుమతులు, ఎంఎస్ఎంఈలకు పలు రకాల ప్రోత్సాహకాలతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ వరుసగా నాలుగేళ్లు అగ్రగామిగా నిలిచింది. డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ (డీపీఐఐటీ) నివేదిక ప్రకారం 2022 జూలై నాటికి దేశవ్యాప్తంగా రూ.1,71,285 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రాగా అందులో రూ.40,361 కోట్లకుపైగా పెట్టుబడులతో ఏపీ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులను రాబట్టడంలో 5వ స్థానంలో, పరిశ్రమల స్థాపనలో 3వ స్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఈ రెండు అంశాల్లో ఏపీ మొదటి స్థానంలో ఉంది. సీఎం అధ్యక్షతన డిసెంబర్‌లో జరిగిన ఏపీ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు



(ఎస్ఐపీబీ) సమావేశం రూ.23,985 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ఇందులో రూ.8,800 కోట్లతో కడప జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్, రూ.6,330 కోట్లతో అదానీ గ్రీన్ ఎనర్జీ, రూ.8,855 కోట్లతో షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ నెలకొల్పే పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఏటీసీ అలయన్స్ టైర్స్ రూ.1,240 కోట్లతో విశాఖలో ప్లాంట్‌ను జూన్ 2022 లో ప్రారంభించింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర దక్షిణాది రాష్ట్రాలతో పోటీపడి బల్క్ డ్రగ్ పార్క్ (బీడీపీ)ను ఏపీ దక్కించుకుంది. బల్క్ డ్రగ్ పార్క్ స్థాపనకు కేంద్రం రూ.వెయ్యి కోట్లు గ్రాంటుగా అందించనుంది.

■ కోవిడ్ సమయంలో ప్రభుత్వం వైఎస్సార్ నవోదయం ద్వారా రూ.7,976 కోట్ల పైచిలుకు రుణాలను పునరుద్ధరించి 1.78 లక్షల ఎంఎస్ఎంఈ ఖాతాలకు జమ చేసింది. దావోస్‌లో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో సహా దాదాపు రూ.1.25 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలను కుదుర్చుకోగా దాదాపు రూ.30 వేల కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. గత సర్కారు హయాంలో చంద్రబాబు ఐదుసార్లు దావోస్ వెళ్లి పలు ఒప్పందాలు చేసుకోగా ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు.

■ 2021–22లో రాష్ట్ర జీఎస్‌డీపీ 11.43% గా ఉంది. జాతీయ స్థాయిలో జీడీపీ 8.7% కాగా కేంద్రం కంటే రాష్ట్ర జీఎస్‌డీపీ 2.73% అదనంగా నమోదు కావడం గర్వకారణం. దేశ తలసరి ఆదాయం కంటే రాష్ట్ర తలసరి ఆదాయం 38.5% ఎక్కువగా ఉండటమే కాకుండా దేశంలోనే ఆరో స్థానంలో నిలిచింది. గత సర్కారు పాలనలో 2018–19లో రాష్ట్ర జీఎస్‌డీపీ కేవలం 5.36% మాత్రమే నమోదైంది.

గ్లోబల్ ఇన్వెస్టర్ల మీట్‌కు విస్తృత ఏర్పాట్లు

- సీఎస్ జవహర్‌రెడ్డి అధ్యక్షతన 3వ వర్కింగ్ కమిటీ భేటీ
- మీట్‌లో పాల్గొనే ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు
- పలు రంగాలపై జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులతో చర్చలు



గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌కు సంబంధించిన 3వ వర్కింగ్ కమిటీ భేటీలో సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వచ్చే నెల 3, 4 తేదీల్లో విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్ (ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు)కు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకు సీఎస్ సమావేశ మందిరంలో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుకు సంబంధించిన 3వ వర్కింగ్ కమిటీ సమావేశం సీఎస్ జవహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఏర్పాట్లపై ఆయన వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, డెలిగేట్లు తదితరులకు ఆహ్వాన పత్రాలు అందించడంతో పాటు వారికి ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం రవాణా, వసతి వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను సీఎస్ ఆదేశించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో వివిధ సెక్టార్లపై చర్చలు జరగనున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్, అగ్రి అండ్ ఫుడ్ ప్రాసెసింగ్, ఏరోనాటికల్ అండ్ ఎలక్ట్రానిక్ వాహనాలు, హెల్త్ కేర్ అండ్ మెడికల్ ఇక్విప్‌మెంట్, ఇండస్ట్రియల్ అండ్ లాజిస్టిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పెట్రో అండ్ పెట్రో కెమికల్స్, రెన్యువల్ ఎనర్జీ, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్, టెక్స్‌టైల్స్ అండ్ అపారెల్స్, టూరిజం, స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రానిక్స్, స్టార్టప్స్ అండ్ ఇన్నోవేషన్, ఐటీ అండ్ జీసీసీ వంటి రంగాలపై పెద్దఎత్తున చర్చ జరగనుందని సీఎస్ పేర్కొన్నారు. ప్రతి రంగంలోను చర్చకు సంబంధించిన ప్రతినిధులతో పాటు ఇద్దరు అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొనేలా చూడాలని చెప్పారు.

పలు నగరాల్లో రోడ్ షోలు

ఈ నెల 14న బెంగళూరు,17న చెన్నై, 20న ముంబై, 24న హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌కు సంబంధించి రోడ్ షోలు నిర్వహిస్తామని సీఎస్ డా. జవహర్‌రెడ్డి తెలిపారు. ఆహ్వానితులందరికీ త్వరగా ఆహ్వాన పత్రికలు అందించే ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు ఆహ్వానితులకు అందించే జ్ఞాపికల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్త, చేనేత జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, ఐటీశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్, పరిశ్రమలు శాఖ అధికారులు, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు. వీడియో లింక్ ద్వారా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రజత్ భార్గవ, వై.శ్రీలక్ష్మి, కె.విజయానంద్, ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ మల్లికార్జున, విశాఖ పోలీస్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943